www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 21-7-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 135 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి ఉ.9:39 తదుపరి ద్వాదశి, నక్షత్రం: రోహిణి రా.9:07 తదుపరి మృగశిర, వర్జ్యం: మ.1:42-3:11, రా.2:19-3:48, దుర్ముహూర్తం: మ.12:47-1:38, మ.3:22-4:13, అమృతఘడియలు: సా.6:09-7:38, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 5:54, సూర్యాస్తమయం: 6:48 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అభిశంసనకు సిద్ధం

జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలన్న తీర్మానం..

నోటీసుపై 100 మందికి పైగా ఎంపీల సంతకాలు

రిజిజు అధ్యక్షతన అఖిలపక్ష భేటీ.. నేటి నుంచి పార్లమెంటు

8 ప్రధాన అంశాలపై నిలదీస్తామని ప్రతిపక్షాల ప్రకటన

తానే యుద్ధం ఆపానన్న ట్రంప్ ప్రకటనపైనా సభలో చర్చ

12



ఏపీ మద్యం స్కాంను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం

10

టీడీపీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు వెల్లడి

ముడుపులు మూలవిరాట్‌కే!

కసిరెడ్డి ఆధ్వర్యంలో

3,500 కోట్ల వరకు మద్యం కమీషన్లు వసూలు

కసిరెడ్డి నుంచి సాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, గోవిందప్పలకు!

వారి ద్వారా నాటి ముఖ్యమంత్రి జగన్‌కు చేరవేత

మద్యం స్కాం చార్జిషీటులో బట్టబయలు చేసిన సిట్

డిస్టిలరీల నుంచి తొలుత 12% కమీషన్‌కు ఒప్పందం

తర్వాత 20కి పెంపు.. మాట వినకపోతే బెదిరింపులు

ముడుపుల మళ్లింపునకు రకరకాల పద్ధతులు

డిస్టిలరీల ఖాతాల నుంచి బంగారం వ్యాపారులకు బదిలీ

తర్వాత బంగారం కొన్నట్లుగా జీఎస్‌టీ ఇన్‌వాయిస్‌లు

నిందితులకు బంగారం రూపంలో కమీషన్లు

రూ.100-120 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు

హవాలా ద్వారా షెల్ కంపెనీలకూ సొమ్ముల మళ్లింపు

సిండికేట్ బంధుమిత్రుల కంపెనీల నుంచీ డబ్బుల బదిలీ

మున్ముందు వెలుగులోకి మరికొందరి పాత్ర: సిట్

ప్రతి నెలా రూ.50-60 కోట్లు జగన్‌కు

"జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం స్కాం ముడుపుల్లో సింహభాగం మూలవిరాట్‌కే చేరినట్టు బట్టబయలైంది. ప్రతి నెలా రూ.50 నుంచి రూ.60 కోట్ల దాకా డిస్టిలరీల నుంచి వసూలు చేసిన సొమ్మును నిందితులు అప్పటి సీఎం వైఎస్ జగన్‌కు చేర్చారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేల్చింది. డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి ఎంతెంత ముడుపులను కసిరెడ్డి బృందం వసూలు చేసింది.. ఆ మొత్తాన్ని ఎవరెవరికి ఎలా మళ్లించిందో సమగ్ర వివరాలను ఏసీబీ కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో విపులంగా తెలియజేసింది."

119) From the investigation done so far, it is revealed that during the 2nd half of 2019, a meeting of the owners of the distilleries was held by the Sajjala Sridhar Reddy (A-6) at Hotel Park Hyatt, Hyderabad, where in the owners of the distilleries were told to co-operate with the orchestrated sale of liquor i.e. by raising planned indents and issuing manual OFS to select suppliers in the state of Andhra Pradesh. During the meeting, the owners were intimidated that if they do not accede to their proposals and no orders will be issued to them. Such intimidation for kickbacks by threatening them with no issuances of OFS and thereby receiving kickbacks amounts to extortion. Under the threat of loss of business, several distilleries agreed to pay kickbacks @ 12%. Soon, the percentage of kickbacks was increased to 20% of the

base price. The collected amounts were eventually handed over to Kesireddy Rajasekhar Reddy(A-1). Rajasekhar Reddy would then pass the money to Vijay Sai Reddy(A-5), Mithun Reddy(A-4), Balaji (A-33) who would transfer it to former Chief Minister Y.S. Jagan Mohan Reddy. On an average, ₹50-60 crore was collected every month. (This is further corroborated by the statements of LW- 104)

మద్యం ముడుపులు జగన్‌కు చేరిన విధానాన్ని వివరిస్తున్న చార్జ్‌షీటులోని భాగం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

పక్కా వ్యూహంతో స్కాం

డిస్టిలరీల నుంచి ముడుపులు.. బోగస్ కంపెనీలతో దారి మళ్లింపు

షెల్ కంపెనీలను సృష్టించి డబ్బును వైట్‌గా మార్చిన వైనం

ఎప్పటికప్పుడు వాటాల పంపిణీ.. ఎన్నికల ఖర్చుకు 250 కోట్లు

ముడుపులిస్తేనే ఆర్డర్లు!

మాన్యువల్ విధానంతో కంపెనీలకు చుక్కలు

2020లోనే 111 ఓఎఫ్‌ఎస్‌ల తిరస్కరణ

కొన్ని కంపెనీలపై అమితమైన ప్రేమ.. ఊరూ పేరు లేని బ్రాండ్లకు వంద శాతం అనుమతులు

పాపులర్ బ్రాండ్లు రాకుండా మోకాలడ్డు

హడావిడిగా తెరపైకి అనామక బ్రాండ్లు





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేశంలోనే అతి పెద్ద మద్యం కుంభకోణం కేసులో.. ముడుపుల అంతిమ లబ్ధిదారు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డేనని సిట్ తేల్చింది. ఏ కంపెనీ ఎంతెంత కమీషన్ ఇచ్చింది.. ఎవరికి ఎక్కడ చెల్లించింది.. ఎవరు నిర్ణయించారో కూడా వెల్లడించింది. ముడుపులు ఏయే రూపాల్లో అందాయో కూడా కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో తెలియజేసింది. డిస్టిలరీలను భయపెట్టి మొదట 12 శాతం ముడుపులకు ఒప్పించారు. ఆ తర్వాత 20 శాతానికి పెంచేశారు. ఆ మొత్తం డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి (ఏ-1)కి అందేది. అతడి నుంచి నాటి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి(ఏ-5), మరో ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ-4), భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33)లకు వచ్చేది. ఆ ముడుపులను ఈ ముగ్గురూ అప్పటి సీఎం జగన్‌కు ముట్టజెప్పినట్లు సిట్ స్పష్టం చేసింది. నెలకు రూ.50-60 కోట్ల చొప్పున ఆయనకు అందాయని.. ఎన్నికల ఖర్చుకూ రూ.250-300 కోట్లు పంపిణీ చేశారని.. ఇతర నిందితులూ వాటాలు పంచుకున్నారని పేర్కొంది. మొత్తం రూ.3,500 కోట్లు ముడుపుల రూపంలో వసూలు చేశారు. అందుకు పకడ్బందీ ప్రణాళికలు వేశారు. డబ్బులు ఎక్కడెక్కడికి వెళ్లాయో దర్యాప్తు సంస్థలకు అంతుచిక్కకుండా వివిధ మార్గాల్లో మళ్లించారని తెలిపింది.

చార్జిషీటులో ముఖ్యాంశాలివీ..

2019 ద్వితీయార్థంలో సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6) హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్లో డిస్టిలరీల యజమానులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రోజువారీ మద్యం అమ్మకాలకు సంబంధించి ఇండెంట్ ప్లాన్ పెంచుకునేందుకు సహకరించాలన్నారు. తాము చెప్పినంత కమీషన్ ఇవ్వడానికి

మిగతా 11వ పేజీలో...

రింగ్ మాస్టర్ మిథున్‌రెడ్డే



వైద్య పరీక్షల అనంతరం ప్రభుత్వాస్పత్రి నుంచి బయటికొస్తున్న మిథున్‌రెడ్డి

లిక్కర్ సిండికేట్‌ను నడిపింది ఆయనే

దందాలో కర్త, కర్మ, క్రియ ఎంపీనే

విచారణకు ఏ మాత్రం సహకరించలేదు

పైగా.. తప్పుదారి పట్టించే యత్నం చేశారు

ఎంపీ కనుసన్నల్లోనే షెల్ కంపెనీల ఏర్పాటు

నగదు మళ్లింపూ ఆయన ఆధ్వర్యంలోనే

సిండికేట్ నుంచి పీఎల్‌ఆర్ ప్రాజెక్టుకు సొమ్ము

నాటి సీఎంకు చేరిన నిధులు.. లెక్క తేల్చాల్సిందే

రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు.. కస్టడీకి వినతి

జైలుకు మిథున్‌రెడ్డి.. 1 వరకు రిమాండ్

రాజమహేంద్రవరం జైలుకు తరలింపు.. ఇరు పక్షాల తరపున జోరుగా వాదనలు.. రిమాండ్‌పై అభ్యంతరం చెప్పని ఎంపీ

కోర్టు ప్రాంగణం వద్ద వైసీపీ నేతల యాగీ

నినాదాలతో హల్చల్.. పోలీసులతో వాగ్వాదం

అదే మందుకు కొత్త కొత్త పేర్లు!

నిబంధనలకు విరుద్ధంగా పేర్లు మార్చి దోపిడీ

ఒకే విధంగా పలికే నూతన బ్రాండ్లు సృష్టి

ఒక్కో కేసుపై రూ.వెయ్యికి పైగా ధర పెంపు

హేవార్డ్స్ క్లాసిక్ విస్కీ బదులు హేవార్డ్స్ ఫైన్ విస్కీ

హనీ బీ గోల్డ్ బ్రాందీకి ప్రత్యామ్నాయంగా హనీ బీ బ్రాందీ సృష్టి

బ్యాగ్‌పైపర్ ప్రీమియం విస్కీ స్థానంలో బ్యాగ్‌పైపర్ గోల్డ్ రిజర్వ్ విస్కీ

ఆటోమేటిక్ విధానం తొలగించి మాన్యువల్ విధానంలో ఆర్డర్లు..

మద్యం ప్రియుల నుంచి భారీ ధరలు వసూలు

ఆ మొత్తం కంపెనీలకు అప్పగింత

ఆనక వాటి నుంచి కమీషన్ రూపంలో లాగిన వైనం

మద్యం స్కాం చార్జిషీటులో కీలక అంశాలు

సమగ్ర కథనాలు 10, 11లో



భారత్ అమ్ములపొదిలో కొత్త బ్రహ్మాస్త్రం..

కే-6 క్షిపణి!

జలాంతర్గామి నుంచి ప్రయోగించగలిగే న్యూక్లియర్ బాలిస్టిక్ మిస్సైల్

రేంజ్.. 8 -12 వేల కిలోమీటర్ల దాకా

హైదరాబాద్‌లోని ఏఎన్‌ఎస్‌ఎల్‌లో అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో

12

గంటకు 9,200 కిలోమీటర్ల వేగం

ఈ క్షిపణిని మోసే ఎస్-5 స్ట్రాటజిక్ సబ్‌మెరైన్‌ను తయారుచేస్తున్న శాస్త్రజ్ఞులు

దొనకొండలో క్షిపణి తయారీ యూనిట్..?

3

భూములు పరిశీలించిన డీఆర్‌డీవో ప్రతినిధులు

ట్రంప్ మెడకు లొలిటా ఎక్స్‌ప్రెస్ లొల్లి



బాలికలపై లైంగికదాడులకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ విమానమది

అందులో ఎప్‌స్టీన్ సొంత దీవికి మైనర్ల అక్రమ రవాణా

ఆ విమానం ఎక్కినవారి జాబితాలో ట్రంప్, బిల్ క్లింటన్ పేర్లు

ట్రంప్, ఎప్‌స్టీన్ సంబంధాలపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం

న్యూఢిల్లీ, జూలై 20: హైస్కూలు దశ కూడా దాటని బాలికలతో తాను కామవాంఛలు తీర్చుకోవడమే కాక.. ప్రపంచ ప్రముఖులైన వ్యాపార, రాజకీయ దిగ్గజాలకు, సంపన్నులకు వారిని ఎరగా వేసిన వికృత మనస్కుడు జెఫ్రీ ఎప్‌స్టీన్! అలాంటి వ్యక్తితో ట్రంప్ సంబంధాలపై అమెరికా అట్టుడుకుతోంది. ఎప్‌స్టీన్ తన సొంతవిమానంలో హైప్రొఫైల్ వీవీఐపీలను, బాలికలను.. తన సొంత దీవికి

మిగతా 12వ పేజీలో...

ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి హైస్పీడ్ రైలు

ఆ పక్కనే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

కేంద్రం సూత్రప్రాయ ఆమోదం!

3



ఆదివారం రాత్రి బెజవాడలో జోరువాన



కురిసింది వాన

ఉపరితల ఆవర్తనంతో వర్షాలు

కోస్తా, సీమకు నేడూ రేపూ మరింత భారీగా


3

అసెంబ్లీలో మంత్రి పేకాట

రైతు సమస్యలపై చర్చ జరుగుతుండగా ఆన్‌లైన్‌లో ఆడిన మహారాష్ట్ర వ్యవసాయ మంత్రి కొకాటే

వీడియో తీసి, ఎక్స్‌లో పెట్టిన ఎన్సీపీ ఎమ్మెల్యే

ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని విపక్షాల డిమాండ్



12

వధూవరులు!

ఒకే యువతిని పెళ్లాడిన అన్నదమ్ములు!

ప్రదీప్ నేగి ప్రభుత్వోద్యోగి, అతడి తమ్ముడు కపిల్ నేగికి విదేశాల్లో ఉద్యోగం

హట్టి తెగలో కుటుంబాలు కలిసికట్టుగా ఉండేందుకే ఈ సంప్రదాయం

హిమాచల్‌ప్రదేశ్‌లో దశాబ్దాలుగా పాటింపు



ట్రాఫిక్ ఉల్లంఘనులకు రెట్టింపు జరిమానా!

వాహనాల్లో పిల్లలతో వెళ్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే మూల్యం

12

కేంద్ర చట్టంలో కొత్త ప్రతిపాదనలు

మెరిట్, డీమెరిట్ పాయింట్లు ఇచ్చే యోచన

పాయింట్ల ఆధారంగా వాహన బీమా ప్రీమియంలో హెచ్చుతగ్గులు


టెస్టు సిరీస్‌కు నితీశ్ దూరం!



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మోకాలి గాయం కారణంగా మిగిలిన రెండు టెస్టులకు దూరమయ్యే అవకాశం ఉంది. ఆదివారం అతడు జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా మోకాలికి గాయమైంది. స్కానింగ్‌లో లిగమెంట్ దెబ్బతిన్నట్టు తేలడంతో సిరీస్‌లో అతడు ఆడేది సందేహంగా మారింది. అయితే నితీశ్ గాయంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించలేదు. తొలి టెస్టులో ఆడని నితీశ్‌కు ఆ తర్వాత రెండు టెస్టుల్లో చోటు కల్పించారు. అయితే లార్డ్స్ టెస్టులో 3 వికెట్లు, 43 పరుగులతో ఫర్వాలేదనిపించాడు.

2031 వరకు లండన్‌లోనే..

డబ్ల్యూటీసీ ఫైనల్‌పై ఐసీసీ



సింగపూర్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ 2031 వరకు ఇంగ్లండ్‌లోనే జరుగుతుందని ఐసీసీ తెల్చింది. ఆదివారం సింగపూర్‌లో జరిగిన ఐసీసీ ఏజీఎంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. 2019లో ఆరంభమైన డబ్ల్యూటీసీలో ఇప్పటి వరకు మూడు ఫైనల్స్‌కు ఇంగ్లండే ఆతిథ్యమిచ్చింది. అయితే వచ్చేసారి భారత్‌లో నిర్వహించాలని బీసీసీఐ ప్రయత్నించినా సఫలం కాలేకపోయింది. ఇప్పటికిదాకా ఆతిథ్యమిచ్చిన ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహణ తీరుపై సంతృప్తి చెందడంతో 2027, 2029, 2031 డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆతిథ్య హక్కులను ఇచ్చినట్టు ఐసీసీ పేర్కొంది. మరోవైపు టిమోర్-లెస్టే క్రికెట్ సమాఖ్య, జాంబియా క్రికెట్ యూనియన్లను అసోసియేట్ సభ్య దేశాలుగా చేర్చుకుంది.

బంగ్లా చేతిలో పాక్ చిత్తు

మిర్పూర్: ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన బంగ్లాదేశ్.. తొలి టీ20లో పర్యాటక పాకిస్థాన్‌కు ఝలక్ ఇచ్చింది. ఓపెనర్ పర్వేజ్ హొస్సేన్ ఇమాన్ (56 నాటౌట్) అజేయ అర్ధశతకంతో.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లా 7 వికెట్లతో పాక్‌ను మట్టికరిపించింది. మొదట పాక్ 19.3 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫఖార్ జమాన్ (44), అబ్బాస్ అఫ్రీది (22), కుష్‌దిల్ షా (17) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. టస్కిన్ అహ్మద్ 3, ముస్తాఫిజుర్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 15.3 ఓవర్లలో 112/3 స్కోరు చేసి గెలిచింది. తౌహిద్ హ్రిదయ్ (36) రాణించాడు. సల్మాన్ మీర్జా రెండు వికెట్లు పడగొట్టాడు.

అన్షుల్‌కు పిలుపు

గాయంతో అర్ష్‌దీప్, ఆకాశ్ అవుట్ ● కీపర్‌గా జురెల్!



మాంచెస్టర్: సిరీస్‌లో సజీవంగా ఉండేందుకు నాలుగో టెస్టులో విజయంపై దృష్టి సారించిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి అతడి స్థానంలో యువ లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇస్తారని అంతా భావించారు. కానీ రెండు రోజుల క్రితం గాయం కావడంతో మాంచెస్టర్ టెస్టుకు అర్ష్‌దీప్ అందుబాటులో ఉండడం లేదు. ప్రాక్టీస్ సమయంలో బంతిని ఆపుతుండగా అర్ష్‌దీప్ ఎడమ చేతికి గాయమైంది. అలాగే మరో పేసర్ ఆకాశ్ దీప్‌నకు గజ్జల్లో గాయం కావడంతో అతను కూడా నాలుగో టెస్టుకు దూరం కానున్నాడు. లార్డ్స్ టెస్టు నాలుగో రోజు ఆటలో అతను చికిత్స కోసం మైదానం కూడా వీడాడు. అటు బెకెన్‌హామ్‌లో జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్‌లోనూ ఆకాశ్ బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరూ జట్టుతో పాటే మాంచెస్టర్‌కు వెళ్లినా వీరి గాయం తీవ్రతపై సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అన్షుల్ జట్టులోకి..: ఇద్దరు పేసర్లు గాయపడడంతో ముందు జాగ్రత్తగా హరియాణాకు చెందిన 24 ఏళ్ల పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను బ్యాకప్ కోసం ఇంగ్లండ్‌కు రప్పించనున్నారు. తాజా సిరీస్‌కు ముందు అన్షుల్ భారత్ 'ఎ' తరఫున ఇంగ్లండ్ 'ఎ'తో రెండు అనధికార టెస్టులు ఆడాడు. అన్షుల్ రెండో మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో ఆకట్టుకోవడంతో పాటు బ్యాటింగ్‌లోనూ తనుష్ కోటియన్‌తో కలిసి అజేయంగా 149 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. దీంతో భారత్ 'ఎ' జట్టు ఓటమి నుంచి తప్పించుకొని మ్యాచ్‌ను డ్రా చేయగలిగింది.

అవకాశం దక్కేనా?

నాలుగో టెస్టులో మూడో పేసర్‌గా అన్షుల్‌తో అరంగేట్రం చేయిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ప్రసిద్ధ్ క్రిష్ణకు తొలి రెండు టెస్టుల్లో అవకాశం ఇచ్చినా ప్రభావం చూపలేకపోయాడు. ఆల్‌రౌండర్ శార్దూల్ సైతం నిరాశపర్చాడు. దీంతో దేశవాళీల్లో ఫామ్ కనబర్చిన అన్షుల్‌కు చాన్స్ ఇస్తే తప్పేమిటని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. అన్షుల్ తన చివరి 11 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 55 వికెట్లు తీయగా, గత రంజీ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనే 34 వికెట్లు పడగొట్టాడు. పైగా ఇంగ్లండ్ 'ఎ'తో ఇక్కడ ఆడిన అనుభవం కూడా అతనికి ఉంది. అందుకే బుమ్రా, సిరాజ్‌లకు అన్షుల్ చక్కటి సహకారం అందించగలడన్నది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.

పంత్ పరిస్థితేమిటి?



భారత నెట్ సెషన్‌లో ధ్రువ్ జురెల్ కీపింగ్ ప్రాక్టీస్ చేస్తుండడంతో గాయంతో ఉన్న రిషబ్ పంత్ ప్రాతినిధ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కీపింగ్‌కు దూరమై కేవలం బ్యాటర్‌గానే ఆడతాడనే కథనాలు కూడా వినిపిస్తున్నాయి. అదే జరిగితే జురెల్ వికెట్ల వెనకాల కనిపించనున్నాడు. మూడో టెస్టు తొలి రోజు బుమ్రా వేసిన బంతిని పంత్ చేతి వేలికి బలంగా తాకింది. దీంతో తను రెండు ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ చేసినా కీపింగ్‌కు మాత్రం దూరమయ్యాడు. సోమవారం తను ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన వీడియోలో బంతిని చక్కగా త్రో వేయడంతో పాటు బ్యాటింగ్‌లోనూ ఎలాంటి అసౌకర్యానికి గురి కాలేదు. కానీ కీపింగ్ మాత్రం చేయకపోవడంతో, అతడిని స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించి కీపింగ్ బాధ్యతలు జురెల్‌కు అప్పగించే అవకాశం కనిపిస్తోంది.



జురెల్

సెమీస్‌కు హంపి



మహిళల చెస్ వరల్డ్‌కప్

టైబ్రేక్‌కు హారిక, దేశ్‌ముఖ్
వైశాలి అవుట్

బటూమి (జార్జియా): తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి.. ఫిడే మహిళల వరల్డ్‌కప్‌లో సంచలన ప్రదర్శన చేసింది. ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణానికి మరింత చేరువైంది. చైనా క్రీడాకారిణి యుక్సిన్ సాంగ్‌తో క్వార్టర్‌ఫైనల్ పోరులో శనివారం తొలి గేమ్ గెలిచిన హంపి.. ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను డ్రా చేసుకొంది. దీంతో హంపి 1.5-0.5 ఆధిక్యంతో యుక్సిన్‌పై గెలిచి తొలిసారి సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకొంది. ఈ క్రమంలో.. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో సెమీస్ చేరిన తొలి భారత మహిళగా హంపి రికార్డు సృష్టించింది. కాగా, భారత్‌కు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాన్ జోంగి (చైనా)తో క్వార్టర్స్‌లో తొలి గేమ్‌ను డ్రాగా ముగించిన వైశాలి.. రెండో గేమ్‌లో ఓటమి పాలైంది. దీంతో వైశాలి 0.5-1.5తో టాంగ్ చేతిలో ఓడి టోర్నీ నుంచి వెనుదిరిగింది. ఇక.. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక, దివ్యా దేశ్‌ముఖ్ మధ్య క్వార్టర్స్ పోరులో రెండో గేమ్ కూడా డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరూ 1-1తో సమంగా నిలవడంతో.. ఫలితం కోసం టైబ్రేక్‌లో తలపడనున్నారు.

మూడో స్థానం రేస్‌లో కార్ల్‌సన్

లాస్ వెగాస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ రేస్ నుంచి నిష్క్రమించిన వరల్డ్ నెంబర్‌వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ ఇప్పుడు మూడోస్థానం కోసం పోటీపడనున్నాడు. లోయర్ బ్రాకెట్ నాకౌట్స్‌లో భారత్‌కు చెందిన అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానందపై కార్ల్‌సన్ గెలిచాడు. మూడో స్థానం కోసం జరిగే పోరులో నకమురాతో కార్ల్‌సన్ తలపడనున్నాడు. టైటిల్ కోసం అరోనియన్‌తో నీమన్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. కాగా, ఐదో స్థానం కోసం కరువానాతో అర్జున్, ఏడో స్థానం కోసం సో వెస్లీతో ప్రజ్ఞానంద ఆడనున్నారు.

పాక్‌తో ఆడేది లేదు

భారత వెటరన్ క్రికెటర్ల బాయ్‌కాట్
ఇండో-పాక్ లెజెండ్స్ మ్యాచ్ రద్దు




బర్మింగ్‌హామ్: వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)ను ఇండో-పాక్ ఉద్రిక్తతలు కుదిపేశాయి. టీమిండియా మాజీ స్టార్లు బాయ్‌కాట్ చేయడంతో.. భారత్, పాకిస్థాన్ వెటరన్ జట్ల మధ్య ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేయాల్సి వచ్చింది. గత ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా మరికొందరు భారత వెటరన్ క్రికెటర్లు పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించారు. డబ్ల్యూసీఎల్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. రెండో అంచె జూన్ 18న ఆరంభం కాగా.. వచ్చే నెల 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ భారత జట్టుకు సారథ్యం వహిస్తుండగా.. ధవన్, హర్భజన్, యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, రైనా, ఊతప్ప, ఆరోన్ జట్టు సభ్యులు. పాక్ జట్టు కెప్టెన్‌గా షాహిద్ అఫ్రీది వ్యవహరిస్తున్నాడు. 'కొన్ని మధురానుభూతులు అందించాలనుకొన్నాం. అయితే, ఈ ప్రయత్నంలో కొందరి సెంటిమెంట్స్‌ను గాయపరిచినట్టు అర్థమైంది. ఎవరికైనా బాధ కలిగి ఉంటే క్షమాపణలు కోరుతున్నామ'ని డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కలిసి తిరుగుతారు కానీ...

భారత వెటరన్ క్రికెటర్ల నిర్ణయంపై పాక్ నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. 'కలిసి తిరుగుతారు. హోటళ్లకు, షాపింగ్‌కు అంతా వెళతారు. తెరవెనుక సీన్ వేరే విధంగా ఉంటుంది. కానీ, ప్రజల ముందు మాత్రం మేం ఆడమంటూ రచ్చ చేస్తున్నార'ని పాక్ మాజీ పేసర్ అబ్దుర్ రౌఫ్ ఖాన్ విమర్శించాడు.

శ్రీశంకర్‌కు 'పోర్చుగల్' టైటిల్



న్యూఢిల్లీ: భారత స్టార్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. పోర్చుగల్‌లోని మయియాలో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ మీట్‌లో టైటిల్ విజేతగా నిలిచాడు. శనివారం రాత్రి జరిగిన మీట్ ఫైనల్స్ లాంగ్ జంప్‌లో శ్రీశంకర్.. 7.75 మీటర్ల దూరాన్ని లంఘించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.

మాంచెస్టర్ స్టార్లతో టీమిండియా



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టు కోసం మాంచెస్టర్ చేరుకున్న టీమిండియా క్రికెటర్లు.. ప్రఖ్యాత సాకర్ క్లబ్ మాంచెస్టర్ యునైటెడ్ జట్టు ఆటగాళ్లతో కలిసి సందడి చేశారు. ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఇరుజట్ల ఆటగాళ్ల కోచ్‌లు, కెప్టెన్లు, ఆటగాళ్లు కలిసి క్రికెట్, ఫుట్‌బాల్ ఆడారు. టీమిండియా కెప్టెన్ గిల్, మాంచెస్టర్ యునైటెడ్ జట్టు సారథి బ్రూనో ఫెర్నాండెజ్‌తో పాటు ఆటగాళ్లందరూ ఒకరి జెర్సీలు ఒకరు మార్చుకొని ఫొటోలకు పోజిచ్చారు.

నాకు దక్కిన గొప్ప గౌరవం

అండర్సన్



లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌ను అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీగా పిలుచుకుంటున్నారు. అయితే దిగ్గజ సచిన్ పేరు పక్కన తన పేరు చూసి గర్వంగా భావించినట్టు అండర్సన్ తెలిపాడు. 'క్రికెట్‌లో సచిన్ ఓ దిగ్గజ ఆటగాడు. అలాంటి క్రికెటర్‌తో కలిసి ట్రోఫీని పంచుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నిజానికి నేను అతడితో సరితూగగలనా? అని కూడా మనసులో అనుకున్నా. కానీ మన పేరుతో ట్రోఫీని నిర్వహించడమే చాలా గొప్ప విషయం. అది కూడా సచిన్ సరసన నాకు స్థానం దక్కడం ఎనలేని సంతోషాన్నిచ్చింది. చిన్నప్పటి నుంచి అతడి ఆటను చూసి పెరిగాను. ప్రత్యర్థిగానూ ఆడా' అని అండర్సన్ వివరించాడు.

బిజినెస్

'ఆటో' ఎగుమతుల జోరు

క్యూ1లో 22 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆటోమొబైల్ ఎగుమతులు 22 శాతం వృద్ధి చెందినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. ఈ కాలంలో మొత్తం ఎగుమతులు 14,57,461 యూనిట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 11,92,566 యూనిట్లుగా ఉన్నాయి. ప్యాసింజర్ వాహన ఎగుమతులు రికార్డు స్థాయికి చేరటంతో పాటు ద్విచక్ర, వాణిజ్య వాహన విభాగాల్లో బలమైన పెరుగుదల ఈ వృద్ధికి కారణమని సియామ్ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2,04,330 యూనిట్లుగా ఉన్నాయి. పశ్చిమాసియా సహా అమెరికా మార్కెట్లలో స్థిరమైన డిమాండ్ కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపింది. ఈ కాలంలో ద్విచ క్ర, వాణిజ్య వాహన ఎగుమతులు 23 శాతం వృద్ధితో వరుసగా 11,36,942 యూనిట్లు, 19,427 యూనిట్లుగా ఉన్నాయి.

మెరిల్‌లో ఏడీఐఏ రూ.1,700 కోట్ల పెట్టుబడి

వాపి : మెడికల్ డివైసెస్ కంపెనీ అయిన మైక్రో లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (మెరిల్)లో అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) అనుబంధ సంస్థ 20 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,700 కోట్లు) పెట్టుబడితో 3 శాతం వాటాను చేజిక్కించుకుంది. ఈ మేరకు మెరిల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏడీఐఏ తెలిపింది. డీల్‌లో భాగంగా మెరిల్ విలువను 660 కోట్ల డాలర్లుగా లెక్కించారు. కాగా మెరిల్‌లో ఇప్పటికే ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ వాటాదారుగా ఉంది. బిలాఖియా గ్రూప్‌నకు చెందిన మెరిల్.. కార్డియోవాస్క్యులర్, స్ట్రక్చరల్ హార్ట్, ఎండో-సర్జరీ, సర్జికల్ రోబోటిక్స్ వంటి అడ్వాన్స్‌డ్ మెడికల్ టెక్నాలజీల్లో కీలకంగా ఉంది.

టాప్‌గేర్‌లో ఐపీఓ మార్కెట్



ఈ ఏడాది 6 నెలల్లో రూ.45,351 కోట్ల సమీకరణ
2024 ఇదే కాలంతో పోల్చితే 45 శాతం ఎక్కువ

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో 24 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.45,351 కోట్లు సమీకరించాయి. గత ఏడాది ఇదే కాలంలో 36 కంపెనీలు సమీకరించిన రూ.31,281 కోట్లతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. గత ఆరు నెలల్లో ఇష్యూల సంఖ్య తగ్గినా సమీకరించిన నిధులు పెరగడం విశేషం. ప్రైమరీ మార్కెట్లో నెలకొన్న ఈ జోరు డిసెంబరు వరకు కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దేశీయ మదుపరులకు ఐపీఓలపై పెరుగుతున్న మోజు, లాభాలు ఇందుకు దోహదం చేయనున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితులు పెరిగినా భారత ఐపీఓ మార్కెట్ జోరు మీద ఉండడం విశేషం. గత ఏడాది తొలి ఆరు నెలల్లో 52 కంపెనీలు తమ ఐపీఓల కోసం సెబీకి దరఖాస్తు చేస్తే గత ఆరు నెలల్లో ఈ సంఖ్య ఏకంగా 118కు పెరిగింది.

ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓ: ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) అనుబంధ సంస్థ ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎన్ఎల్‌సీఐఎల్ సీఎండీ మోటుపల్లి ప్రసన్న కుమార్ ఈ విషయం ప్రకటించారు. వచ్చే ఏడాది సెప్టెంబరులోగా ఈ ఐపీఓ పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఎన్ఐఆర్ఎల్ పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్టు చెప్పారు.

24 నుంచి బ్రిగేడ్ హోటల్స్ ఇష్యూ: ఐపీఓ ద్వారా రూ.750 కోట్లు సమీకరించేందుకు బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఈ నెల 24న క్యాపిటల్ మార్కెట్‌కు వస్తోంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించే రూ.750 కోట్లలో రూ.468.14 కోట్లు రుణ చెల్లింపులకు, రూ.197.52 కోట్లు ప్రమోటర్‌కే చెందిన కొంత స్థలం కొనుగోలుకు వినియోగిస్తారు. మిగతా నిధులను కంపెనీ వ్యాపార విస్తరణ కోసం వినియోగిస్తామని కంపెనీ తెలిపింది.

నేటి నుంచే సావీ ఇన్‌ఫ్రా ఐపీఓ: గుజరాత్ కేంద్రంగా పనిచేసే ఈపీసీ కంపెనీ సావీ ఇన్‌ఫ్రా అండ్ లాజిస్టిక్స్ ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. రూ.70 కోట్ల సమీకరణ కోసం మార్కెట్‌కు వస్తున్న ఈ ఎస్ఎంఈ కంపెనీ ఐపీఓ ఈ నెల 23న ముగుస్తుంది. ఈ ఇష్యూ ప్రైస్ బ్యాండ్‌ను రూ.114/120గా నిర్ణయించారు.

ఇతర ప్రధాన అంశాలు

- ప్రీమియంతో లిస్టయిన 67 శాతం ఐపీఓలు
- సగటున 25 శాతం రాబడులు పంచిన పబ్లిక్ ఇష్యూలు
- తయారీ, మౌలిక రంగాల నుంచే ఎక్కువ ఐపీఓలు
- ఈ నెలలో ఇప్పటికే 4 ఇష్యూలు
- నెలాఖరులోగా మరో ఐదు ఐపీఓలు

అతిపెద్ద పబ్లిక్ ఇష్యూలు

కంపెనీ పేరు	(రూ.కోట్లలో)
హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్	రూ.12,500
హెక్సావేర్ టెక్నాలజీస్	రూ.8,750
స్లాస్ బెంగళూరు	రూ.3,500
ఏథర్ ఎనర్జీ	రూ.2,981

కాయిన్‌డీసీఎక్స్‌పై సైబర్ దాడి

రూ.378 కోట్లు గాయబ్

న్యూఢిల్లీ: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. క్రిప్టోకరెన్సీల ట్రేడింగ్ ఎక్స్ఛేంజీలను వదలడం లేదు. భారత్‌లో క్రిప్టోకరెన్సీల్లో ట్రేడింగ్ చేసే వారికి సేవలందించే కాయిన్‌డీసీఎక్స్‌పైనా హ్యాకర్లు దాడి చేసి 4.42 కోట్ల డాలర్ల (సుమారు రూ.378 కోట్లు) కొట్టేశారు. అయితే ఇది తమ అంతర్గత ఖాతా సొమ్ము అని, ఖాతాదారుల నిధులకు ఎలాంటి ఢోకా లేదని కాయిన్‌డీసీఎక్స్ ప్రకటించింది. సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తాన్ని తమ ట్రెజరీ రిజర్వుల నుంచి భర్తీ చేసుకుంటామని పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం ప్లాంట్‌పై ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం ప్లాంట్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఏడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫారం-483 జారీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈ నెల 10 నుంచి 18 వరకు ఈ ఫార్ములేషన్స్ ప్లాంట్‌లో ఎఫ్‌డీఏ తనిఖీలు చేపట్టి ఈ అభ్యంతరాలను లేవనెత్తిందని తెలిపింది. నిర్దేశిత గడువులోగా వీటిని సరిదిద్దుతామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

25,350 ఎగువన బుల్లిష్

(జూలై 21-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 25,245-24,919 పాయింట్ల మధ్యన కదలాడి చివరకు 0.73 శాతం నష్టంతో 24,968 వద్ద క్లోజైంది. ఈ వారాంతంలో 25,350 ఎగువన క్లోజయితే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,350
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,600
నిరోధ స్థాయిలు: 25,175, 25,275, 25,375 (25,075 ఎగువన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,750, 24,650, 24,550 (24,850 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ



హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	543	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	112
వరంగల్	109	గుంటూరు	117
కరీంనగర్	109	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	106
కర్నూలు	109	నెల్లూరు	111
విశాఖపట్నం	95	అనంతపురం	111
గోదావరి	112		

మదుపరులూ జాగ్రత్త!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత వచ్చేంత వరకు ఊగిసలాట తప్పకపోవచ్చు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కీలకంగా మారుతున్నాయి. నిఫ్టీ సైతం 25,000 దిగువకు రావటం నెగటివ్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తోంది. ఏమైనా సానుకూల సంకేతాలు వస్తే సూచీలు బౌన్స్‌బ్యాక్ అయ్యే అవకాశం ఉంది. మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేటెడ్ అవుతోంది. స్వల్ప,మధ్యకాలిక మూమెంటమ్ పర్వాలేదు. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్‌పై ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం రూ.266 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.260 వద్ద పొజిషన్ తీసుకుని రూ.290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.256 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంక్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ లేనప్పటికీ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఆసక్తి పెరిగింది. 20,50 రోజుల చలన సగటు వద్ద షేరు కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.1,425 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,400 శ్రేణిలో బై ఆన్ డిప్స్ పద్ధతిలో పొజిషన్ తీసుకుని రూ.1,480/1,530 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,375 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఫైనాన్స్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు బలాన్ని ప్రదర్శిస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా మెరుగవుతోంది. టైట్ రేంజ్‌లో కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.942 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.910/900 శ్రేణిలో ఎంటరై రూ.980/1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.880 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు సైడ్‌వేస్‌లో చలిస్తోంది. ప్రస్తుతం అక్యుములేషన్ దశ కొనసాగుతోంది. ఎఫ్ఐఐలు తమ వాటా పెంచుకున్నారు. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.71 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.70 వద్ద పొజిషన్ తీసుకుని రూ.82 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.67 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25,000 వద్ద గట్టి పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఆరంభంలో రికవరీ కనబరిచినా ఆ తర్వాత నిలదొక్కుకోలేక పోయింది. వారం మొత్తానికి 181 పాయింట్లు నష్టపోయి చివరకు 24,968 పాయింట్ల వద్ద క్లోజైంది. గత మూడు వారాలుగా నిఫ్టీ కరెక్షన్‌లోనే సాగుతూ దాదాపు 700 పాయింట్ల వరకు నష్టపోయింది. పుల్‌బ్యాక్ రియాక్షన్‌తో నిఫ్టీ మరోసారి 25,000 దిగువకు చేరింది. అలాగే మిడ్‌క్యాప్-100, స్మాల్ క్యాప్-100 సూచీలు కూడా గరిష్ఠ స్థాయిల నుంచి రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ 25,000 స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఒకటి, రెండు రోజుల్లో మార్కెట్ కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటేనే సానుకూల ట్రెండ్‌ను వెలువరిస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం తదుపరి నిరోధ స్థాయి 25,300 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 25,550. ఇది స్వల్పకాలిక నిరోధ స్థాయి కావడంతో స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ మరింత బలహీనతను సూచిస్తే తదుపరి మద్దతు స్థాయిలు 24,900 దిగువన ఉంటాయి. ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి. తదుపరి మద్దతు స్థాయి 24,450.

బ్యాంక్ నిఫ్టీ: వీక్లీ ప్రాతిపదికన ఈ సూచీ గత వారం 470 పాయింట్ల మేర నష్టపోయి చివరకు 56,280 వద్ద క్లోజైంది. గడచిన మూడు వారాల్లో ఈ సూచీ దాదాపు 1,400 పాయింట్లు నష్టపోయింది. తదుపరి ప్రధాన నిరోధం 56,700. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 57,300. సూచీ మరింత బలహీనపడితే ప్రస్తుత మద్దతు స్థాయి 56,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా వ్యవహరించటం మంచిది.

పాటర్న్: నిఫ్టీ సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" ఎగువన కచ్చితంగా బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్ 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏకు చేరువలో ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,060, 25,150
మద్దతు	24,900, 24,830

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హరి



తిరుమల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వాదం అందించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

బనకచర్ల సాంకేతిక కమిటీలోకి రాష్ట్రం నుంచి ముగ్గురు!

▸▸ పేర్లు పంపాలంటూ కేంద్రజలశక్తి శాఖ లేఖ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై అధ్యయనం కోసం కేంద్ర జలశక్తి శాఖ వేయనున్న 12 మందితో కూడిన సాంకేతిక, నిపుణుల కమిటీలోకి రాష్ట్రం నుంచి ముగ్గురు అధికారుల పేర్లను ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ పథకంపై అధ్యయనం కోసం కమిటీని వేయాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షత న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితో నిర్వహించిన సమావేశం తీర్మానించింది. ఈ నేపథ్యంలో కమిటీలో నియమించే సభ్యుల పేర్లను ప్రతిపాదించాలని ఇరు రాష్ట్రాలను కోరుతూ కేంద్ర జలశక్తిశాఖ శనివారం లేఖ పంపింది. దీంతో ఈ పథకంపై సంపూర్ణ అవగాహన కలిగిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఆ శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఆ శాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ నరసింహమూర్తి పేర్లను మంగళవారం నాటికి అధికారికంగా ఖరారు చేసి పంపాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. కాగా, పోలవరం ప్రాజెక్టు బృందం ఆదివారం రాజమండ్రికి చేరుకుంది. సోమవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఈ బృందం పర్యటించి, జలాలపై అధ్యయనం చేయనుంది.

అభివృద్ధి పేరుతో పొలాలు లాక్కోవద్దు!

▸▸ ప్రభుత్వానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విజ్ఞప్తి

గుంటూరు కార్పొరేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చని పంట పొలాలను ధ్వంసం చేయాలనుకోవడంపై పునఃపరిశీలన చేసుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కరేడు భూముల వివాదం నేపథ్యంలో 'అభివృద్ధి పేరుతో భూదోపిడీ' అనే అంశంపై ఆదివారం గుంటూరు జనచైతన్య వేదిక హాలులో చర్చాగోష్ఠి జరిగింది. శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. 5,500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్రీసిటీలో 300లకు పైగా 30దేశాల కంపెనీలు కొనసాగుతుంటే.. 8,500 ఎకరాల పంట పొలాలను ఇండోసోల్ అనే ఒక్క కంపెనీకి ధారాదత్తం చెయ్యాలనుకునే కుటిల ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. వేలాది మంది కరేడు రైతుల పోరాటాన్ని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.42 వేల కోట్లు కేటాయిస్తే, ఇండోసోల్ కంపెనీకి రూ.46,429 కోట్ల ప్రజాధనాన్ని ప్రోత్సహకాలు, సబ్సిడీల రూపంలో ఇవ్వాలనుకోవడం ప్రజావ్యతిరేక చర్య అన్నారు. రైతుల నుంచి భూసేకరణ వల్ల ఆహార భద్రతకు విఘాతం కలుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు.

డిప్లమో కోర్సుల వెబ్ ఆప్షన్ల గడువు పెంపు

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే అగ్రికల్చర్ డిప్లమో కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవటానికి ఆఖరి తేదీని ఈనెల 25 వరకు పొడిగించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో డిప్లమో కోర్సులో ప్రవేశానికి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి తిరుపతిలో కూడా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఇస్తున్నట్లు వివరించారు.

ఐద్వా మహాసభలకు రచనల ఆహ్వానం

అనంతపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభల నేపథ్యంలో కవులు, రచయితల నుంచి రచనలను ఆహ్వానిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మహాసభలను అక్టోబరు రెండో వారంలో అనంతపురం జిల్లాలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన కవులు, రచయితల ద్వారా స్త్రీ జీవితం వస్తువుగా కవితలు, కథలు రాయించి, రెండు సంకలనాలు ప్రచురించనున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు తమ రచనలను ఆగస్టు 31లోపు 9440222117 నంబరుకు వాట్సాప్ ద్వారా గానీ, rachapalem1@gmail.comకు ఈమెయిల్ ద్వారా గానీ పంపవచ్చన్నారు. కవిత్వాలు 'ఎక్కడమ్మా నీవు లేనిది', కథానికలు 'ఆధునిక మహిళ.. చరిత్రను తిరిగి రచిస్తున్నది' అంశాలపై ఉండాలని పేర్కొన్నారు.

మల్లిక స్పైన్ సెంటర్‌కు 'బెస్ట్ పేపర్ అవార్డ్'

గుంటూరు మెడికల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ పరిశోధనా బృందం.. సొసైటీ ఫర్ మినిమల్లీ ఇన్‌వేజివ్ స్పైన్ సర్జరీ-ఆసియా పసిఫిక్ (ఎస్ఎంఐఎస్ఎస్-ఏపీ) వార్షిక సదస్సులో ప్రదర్శించిన పరిశోధనకు 'బెస్ట్ పేపర్ అవార్డు' లభించింది. భారత్‌లోని వైద్య పరిశోధనకు ఈ అవార్డు లభించడం ఇదే మొదటిసారి. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ముంబైలో జరిగిన ఎస్ఎంఐఎస్ఎస్ ఆసియా ఫసిఫిక్ వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా ఎస్ఎంఐఎస్ఎస్-ఏఎఫ్ అధ్యక్షుడు జపాన్‌కు చెందిన ప్రొఫెసర్ కొటానీ ఈ అవార్డును ప్రకటించినట్టు ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జె నరేశ్‌బాబు ఆదివారం వెల్లడించారు. వచ్చే ఏడాది సింగపూర్‌లో జరిగే వార్షిక సదస్సులో ఈ అవార్డును అందజేయనున్నారని పేర్కొన్నారు.

2047 నాటికి అగ్రగామిగా భారత్

▸▸ ఇస్రో చైర్మన్ నారాయణన్ ఆశాభావం



కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆధునికీకరణ, పరిశోధనలపై భారత్ దృష్టి పెట్టిందని.. దీంతో 2047 నాటికి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. కర్నూలు జగన్నాథగట్టుపై ఉన్న భారత సమాచార సాంకేతికత, రూపకల్పన, తయారీ సంస్థ (ఐఐఐటీడీఎం) 7వ స్నాతకోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. నారాయణన్ మాట్లాడుతూ.. దేశంలో శాస్త్రీయ పురోగతిని గ్రామీణాభివృద్ధితో అనుసంధానించడం అవసరమని అన్నారు.

ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లిన కారు

▸▸ యువకుడు మృతి.. మరొకరు గల్లంతు

▸▸ కర్నూలు జిల్లా కౌతాళంలో ప్రమాదం



ఎల్లెల్సీ కాలువలో నుంచి కారును జేసీబీ సాయంతో బయటకు తీయిస్తున్న పోలీసులు

కౌతాళం/ఎమ్మిగనూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎల్లెల్సీ (లో లెవల్ కెనాల్)లోకి కారు దూసుకెళ్లడంతో ఒక యువకుడు మరణించాడు. మరో యువకుడు గల్లంతయ్యాడు. కర్నూలు జిల్లా కౌతాళం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కర్ణాటకలో హుబ్లీకి చెందిన సునీల్(21), మణికంఠ, హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్ అక్కడి ఒక కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శని, ఆదివారాల్లో సెలవు కావడంతో రాఘవేంద్రస్వామి దర్శనం కోసం కారులో మంత్రాలయానికి వచ్చారు. శనివారం రాత్రి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కొప్పల్ సమీపంలోని గవి మఠాన్ని సందర్శించుకొని అక్కడినుంచి హుబ్లీకి చేరుకోవాలని ఆదివారం మధ్యాహ్నం బయలుదేరారు. కౌతాళం వద్ద వారు ప్రయాణిస్తున్న కారు ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కాలువగట్టుపై భోజనం చేస్తున్న వ్యవసాయ కూలీలు గొట్టయ్య, గోవర్దన్, రమేష్ వెంటనే కాలువలోకి దిగి అప్పయ్య, మంజునాథ్, హైదర్, అభిషేక్‌లను కాపాడారు. అప్పటికే సునీల్, మణికంఠ గల్లంతయ్యారు. పోలీసులు ఎక్సకవేటర్ సాయంతో కారును బయటకు తీయించారు. గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా సునీల్ మృతదేహం లభించింది. మణికంఠ కోసం గాలింపు కొనసాగుతోంది. సునీల్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

కురిసింది వాన!

▸▸ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షం

▸▸ కొన్ని చోట్ల కొనసాగిన ఎండ తీవ్రత

▸▸ కోస్తా, సీమకు నేడు, రేపు భారీ వర్షాలు

▸▸ ఖరీఫ్ పంటలకు ఊపిరి.. రైతుల సంతోషం

▸▸ వరి సాగు ముమ్మరం



ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం కురిసిన భారీ వర్షానికి చెరువును తలపిస్తున్న కర్నూల్‌రోడ్డు

విశాఖపట్నం, అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దక్షిణ కోస్తా మీదుగా తూర్పు, పడమరకు, ఉత్తర బిహార్ నుంచి ఒడిశా వరకు వేర్వేరుగా ఉపరితల ద్రోణులు విస్తరించాయి. వీటి ప్రభావంతో సముద్రం నుంచి వచ్చే తేమగాలులు, భూ ఉపరితలంపై నెలకొన్న ఎండ తీవ్రతతో అనిశ్చితి వాతావరణం నెలకొంది. ఈ ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం సాయంతం రెండు గంటలపాటు తెరిపిలేకుండా వర్షం కురవడంతో ఎక్కడికక్కడ నీరు భారీగా నిలిచి ప్రధాన రోడ్లు కాలువలను తలపించాయి. చాలాచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మందసలో 81 మిల్లీమీటర్లు, టంగుటూరులో 74.75, రణస్థలంలో 70.75, డెంకాడలో 51, గోవిందపురంలో 47.75 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అయితే కోస్తాలో పలుచోట్ల తీవ్రమైన ఎండ, ఉక్కపోత నెలకొంది. నర్సాపురం, కావలిలో 38 డిగ్రీలు, బాపట్ల, ఒంగోలులో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని, 23వ తేదీ వరకు కోస్తా, 22 వరకు రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో ఈ నెల 24వ తేదీ వరకు అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొంది. కాగా, రానున్న 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరుగా, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది.

అన్నదాతల సంతోషం..

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పంటలు ఊపిరి పోసుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాలు వచ్చాక.. జూన్‌లో తొలకరి వర్షాలకు చాలా మంది రైతులు విత్తనాలు నాటారు. ఇప్పటి వరకు 10లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. కానీ మొన్నటి దాకా రుతుపవనాలు మందగించడంతో మెట్ట పంటలకు నీటి తడులు అందక పైర్లు ఎండుముఖం పట్టి రైతులు సతమతమవుతున్నారు. ఈ తరుణంలో ఉపరితల ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో రుతుపవనాల్లో కదలిక వచ్చి.. గత నాలుగైదు రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు పడుతున్నాయి. దీంతో పైర్లన్నీ జీవం పోసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర, చిరుధాన్యాల పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని రైతులు చెప్తున్నారు. చాలా రోజుల తర్వాత వర్షాలు పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో సాగు చేయాల్సిన మిగిలిన విస్తీర్ణంలో పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసి, రాష్ట్రంలోని జలాశయాలకు నీరు చేరడంతో కృష్ణా, గోదావరి డెల్టాలోని ఆయకట్టుకు ఇరిగేషన్‌శాఖ కాలువల ద్వారా నీరు విడుదల చేసింది. దీంతో వరి సాగు ముమ్మరంగా జరుగుతోంది.



అధ్యక్షురాలు డాక్టర్ ఎన్.సుగుణతో నూతన కార్యవర్గం

ఏపీ ఫెన్సింగ్ అధ్యక్షురాలిగా సుగుణ

▸▸ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

కాకినాడ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి ఎంపికయ్యారు. కాకినాడలోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో ఆదివారం ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుగుణ(తూర్పు గోదావరి), ప్రధాన కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్(పశ్చిమ గోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్రకళావతి(కడప), ఉపాధ్యక్షురాలిగా కె.సూర్యలక్ష్మీదేవి(గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి.నవీన్ (ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా ఎన్.రాధిక(కర్నూలు), డి.అశోక్‌బాబు(గుంటూరు) ఎన్నికయ్యారు. పరిశీలకులుగా శాప్ నుంచి అశోక్ దుదారె, కాకినాడ డీఎస్ఏ నుంచి వి.సతీష్‌కుమార్ విచ్చేశారు. నూతన కార్యవర్గం 2025 నుంచి 2029 వరకు కొనసాగుతుందని ఫెన్సింగ్ అసోసియేషన్ మెంటార్ నాగం సతీష్‌బాబు తెలిపారు. అధ్యక్షురాలిగా ఎన్నికైన డాక్టర్ ఎన్.సుగుణను, నూతన కార్యవర్గాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి హైస్పీడ్ రైలు

▸▸ తెలంగాణ ప్రతిపాదనకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం

హైదరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటు.. దీనిని ఏపీ రాజధాని అమరావతితో అనుసంధానించే హైస్పీడ్ రైలు ప్రాజెక్టు వ్యవహారం దాదాపు కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాద్- విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే(కొత్త అలైన్‌మెంట్) నిర్మాణానికి హామీ ఉంది. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను, ఇదే ప్రాంతంలో నిర్మించాలని భావిస్తున్న డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం పోర్టు వరకు కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఇక్కడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు పక్కనే కొత్త రైలు మార్గాన్ని నిర్మిస్తే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇక్కడి రైలు మార్గాన్ని హైస్పీడ్ కారిడార్‌గా నిర్మించాలని.. అది రెండు తెలుగు రాష్ట్రాలకే కాకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాలకు కూడా ఉపయుక్తమని భావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన సందర్భంగా ఈ అంశాలకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. మరోవైపు ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతికి నిర్మించే రోడ్డు ఏయే ప్రాంతాల మీదుగా చేపట్టాలనే అంశాన్ని పరిశీలించే బాధ్యతను ఒక సంస్థకు అప్పగించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

పాత కథనమే.. మళ్లీ!

▸▸ టీడీపీ ఎమ్మెల్యే భానుప్రకాశ్ వ్యాఖ్యలపై రోజా శోకాలు

▸▸ నటీమణుల సంఘీభావం అంటూ రోతపత్రికలో కథనం

▸▸ 2023 నాటి వార్తనే తిరిగి అచ్చేశారని దుమ్మెత్తిపోస్తున్న నెటిజన్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ మాజీ మంత్రి రోజా గత కొన్ని రోజులుగా శోకాలు పెడుతున్నారు. టీడీపీ నాయకులకు మహిళలంటే గౌరవం లేదని, వారిని కించపరుస్తున్నారంటూ జగన్ సొంత మీడియాలో కథనాలు వండివారుస్తున్నారు. దానికి కొనసాగింపుగా ఈ నెల 19న జగన్ పత్రికలో 'ఆ వ్యాఖ్యలు దుర్మార్గం' అంటూ ప్రముఖ నటీమణులు రమ్యకృష్ణ, కుష్బూ, నవనీత్‌కౌర్ వంటి వారు సంఘీభావం తెలుపుతున్నట్లు ఒక కథనాన్ని ప్రచురించారు. అయితే ఈ కథనం ఫేక్ అంటూ నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. 2023 అక్టోబరులో మంత్రిగా ఉన్న రోజాపై టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అప్పట్లో రమ్యకృష్ణ, కుష్బూ, నవనీత్ కౌర్ తదితర నటీమణులు స్పందించారు. ఆ స్పందనలనే రోతపత్రిక తిరిగి మక్కికి మక్కీ అచ్చేసిందంటూ ఆధారాలతో సహా నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో ఎండగడుతున్నారు. అప్పటి కథనంలో ఉన్న బండారు పేరును గాలి భానుప్రకాశ్ పేరుతో, మంత్రి రోజా పేరును మాజీ మంత్రి రోజా అని మార్చి మిగతాదంతా యథాతథంగా ఉంచేశారు. అప్పట్లో రమ్యకృష్ణ స్పందనలో.. భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పారు. ఇప్పుడు దాన్ని కూడా మార్చకుండా అలాగే రాశారు. ప్రస్తుతం ఇండియా 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. దీన్ని అలాగే వదిలేయడంతో పక్కాగా దొరికిపోయారు. అప్పట్లో ఆ నటీమణులంతా రోజాకి సంఘీభావంగా వీడియో స్టేట్‌మెంట్లు కూడా ఇచ్చారు. కానీ ఇప్పుడు అసలు స్టేట్‌మెంట్లు ఇచ్చిన దాఖలా లేదు.

నాడు బూతులు.. నేడు నీతులు..

గాలి భానుప్రకాశ్ తన గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ రోజా శాపనార్థాలు పెడుతున్నారు. అయితే గతంలో వైసీపీ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌ను వాడువీడు అంటూ ఏకవచనంతో ఇష్టారాజ్యంగా మాట్లాడిన విషయాన్ని విస్మరిస్తున్నారు. విషయం తనవరకు వచ్చేసరికి రోజా నోటి వెంట నీతిపురాణం రావడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

సామాజిక మాధ్యమాల్లో తీవ్రంగా ట్రోలింగ్

▸▸ జగన్ పత్రిక అచ్చేసిన కథనంపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో ట్రోలింగ్ నడుస్తోంది. దీనిపై కొందరు నెటిజన్ల వ్యాఖ్యలు పెద్దఎత్తున షేర్ అవుతున్నాయి.

▸▸ 'వాళ్లతో ఆగిపోయావేం.. హాలీవుడ్, బాలీవుడ్ నటీమణులు కూడా మీ కలలోకి వచ్చి ఏమన్నారో ఫొటోలతో సహా వేసి రాసేసి, అచ్చేస్తే జనాలు చదువుకుని ఖాండ్రించి ఉమ్మేసే వాళ్లు కదా..!'

▸▸ 'థూ.. ఇంత గాలి జర్నలిజం ఏంట్రా అయ్యా 2023 నాటి వార్తను 2025 జూలైలో వార్తలా ప్రచురించి, మసిపూసి మారేడు కాయ చేశారా.. మీ బతుకే నిరతర అబద్ధపు స్రవంతి. టిష్యూ పేపర్ కూడా సిగ్గుపడుద్దిరా సామీ.. మీ దిగజారుడుతనం చూసి..'

▸▸ 'మమూలు ఫేక్ కాదు.. మోసాలకే మోసం.. అది కూడా మెయిన్ పేపర్లో. 2023లో రమ్యకృష్ణ, నవనీత్ కౌర్, తదితరులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్‌ని జూలై 19న మళ్లీ తాజాగా అచ్చేశారు...' అంటూ అప్పటి జగన్ పత్రికలో వచ్చిన కథనం, ప్రస్తుతం అచ్చేసిన కథనం క్లిప్‌లను పోస్టు చేస్తూ మరో నెటిజన్ మండిపడ్డారు.

దొనకొండలో క్షిపణి తయారీ యూనిట్..?

▸▸ భూములు పరిశీలించిన డీఆర్‌డీవో ప్రతినిధులు



దొనకొండలో విమానాశ్రయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో ప్రతినిధుల బృందం

దొనకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దొనకొండ ప్రాంతంలో దాదాపు వంద ఎకరాల్లో క్షిపణి తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. భారత రక్షణకు శాఖ చెందిన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ప్రతినిధుల బృందం ఆదివారం ఈ ప్రాంతంలో పర్యటించింది. ఈ బృందానికి కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్ దొనకొండలోని బాదాపురం రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూములను చూపించారు. సరిహద్దులు, ఇక్కడ లభ్యమయ్యే మౌలిక సదుపాయాలు, ఇతర వివరాలను మ్యాపుల ద్వారా వివరించారు. అనంతరం డీఆర్‌డీవో ప్రతినిధులు దొనకొండలో బ్రిటిష్ కాలంలో ఏర్పాటై.. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయాన్ని సందర్శించారు. విమానాశ్రయం మొత్తం ఎంత విస్తీర్ణంలో ఉంది, అప్పట్లో రన్‌వే ఏవిధంగా ఉండేది.. తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఈడీబీ అధికారిణి ఐశ్వర్య, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం బ్రహ్మోస్ క్షిపణుల తయారీని పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే దొనకొండలో రక్షణశాఖ ఆధ్వర్యంలో మిస్సైల్ తయారీ యూనిట్ నెలకొల్పేందుకు ఈ భూములను పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం.

సముద్రతీర గస్తీకి రోబోలు!

▸▸ పుదుచ్చేరిలో ట్రయల్‌రన్ విజయవంతం



పుదుచ్చేరి, జూలై 20(ఆంధ్రజ్యోతి): సముద్రతీర గస్తీ విధుల్లో పోలీసులకు సాయంగా మొట్టమొదటిసారిగా రోబోలు పాల్గొననున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీ భవనం సమీపంలోని సముద్రతీరంలో ఆదివారం పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో రోబోలతో ట్రయల్‌రన్ నిర్వహించారు. సముద్రతీరంలో సేదతీరేందుకు వస్తున్న స్వదేశీ, విదేశీ పర్యాటకులకు మరింత భద్రత కల్పిస్తూ సుమారు 2 కిలోమీటర్ల మేర పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ విధుల్లో పోలీసులకు సహకరించే విధంగా ఆధునిక సాంకేతికతతో రూపొందించిన రోబోల సేవలను వినియోగించుకోవాలని పుదుచ్చేరి పోలీసుశాఖ నిర్ణయించింది. దీనికోసం చెన్నైలోని ఓ ప్రైవేటు ఐటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని రోబోలను తయారు చేయించారు. ఆ రోబోల పనితీరును తెలుసుకునేందుకు డీఐజీ సత్యసుందరం నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ రోబోలలో పొందుపరిచిన ఆధునిక కెమెరాల ద్వారా సముద్రతీరంలో గస్తీ పనులను పర్యవేక్షిస్తారు.

కొకైన్‌తో కామిక్ పుస్తక ముఖచిత్రం

▸▸ బెంగళూరు ఎయిర్‌పోర్టులో రూ.40 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత



సేకరించిన కొకైన్



పుస్తకాలపై పౌడర్

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొకైన్ సరఫరాకు ఎవరూ ఊహించని మార్గాన్ని ఎంచుకున్నాడు ఓ అక్రమ రవాణాదారుడు. కొకైన్‌తో కామిక్ బొమ్మలు డిజైన్ చేసి, ముఖచిత్రాన్ని రూపొందించాడు. దానిపై అట్టవేశాడు. అలా కొకైన్ రవాణా చేస్తున్న వ్యక్తిని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు అరెస్టు చేశారు. ఈనెల 18న తెల్లవారుజామున దోహా నుంచి బెంగళూరుకు వచ్చిన ప్రయాణికుడిపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉండే కామిక్స్ లిమిటెడ్ ఎడిషన్ పుస్తకంలో తెల్లటి పౌడర్‌ను గుర్తించారు. దానిని పరిశీలించగా కొకైన్‌గా నిర్ధారణ అయింది. అలా కొన్ని పుస్తకాల్లో సుమారు 4 కిలోల కొకైన్‌ను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో దాని విలువ రూ.40కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

వేడుకగా తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవం



అరవింద్ శ్రీనివాసన్‌కు ప్రెసిడెంట్ గోల్డ్‌మెడల్ అందజేస్తున్న సజ్జన్ జిందాల్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ

ఏర్పేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ 7వ స్నాతకోత్సవం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు క్రియా యూనివర్సిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ పాల్గొన్నారు. ఈ ఏడాదిలో కోర్సులు పూర్తి చేసుకున్న 417 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. 2025లో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థుల్లో ప్రతిభ కనబరచిన అరవింద్ శ్రీనివాసన్ ప్రెసిడెంట్ గోల్డ్‌మెడల్ అందుకున్నారు. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలిచిన మేఘవర్షిని గవర్నర్ ప్రైజ్‌ను పొందారు.

'ఔషధ నిరోధకత'పై ఉన్నతస్థాయి కమిటీ

▸▸ మంత్రి సత్యకుమార్... ఏఎంఆర్‌పై రిసెర్చ్ స్టడీకి ఎంవోయూ



మంత్రి సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకుంటున్న నందకిశోర్, సందీప్

గుంటూరు మెడికల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంరక్షణకు ఔషధ నిరోధకత(యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్-ఏఎంఆర్) సవాల్‌గా మారుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఔషధ నిరోధకత కట్టడి చర్యలకు, యాంటీ బయోటిక్ మందుల విచ్చలవిడి వినియోగం తగ్గించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యనిపుణులతో కలిపి ఉన్నతస్థాయి కమిటీని నియమించనున్నట్లు మంత్రి ప్రకటించారు. గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఆదివారం ఏఎంఆర్ ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా యాంటీ బయోటిక్ ఔషధ నిరోధకత ఏ మేరకు ఏర్పడిందో తెలుసుకునేందుకు గుంటూరు రిఫరల్ లేబొరేటరీ కేంద్రంగా అధ్యయనం చేసేందుకు మంత్రి సమక్షంలో ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్‌తో సైంటిస్ట్ సందీప్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. తన సొంత ఖర్చులతో ఈ రిసెర్చ్ స్టడీ చేసేందుకు ముందుకు వచ్చిన దాత, సైంటిస్ట్ సందీప్‌ను మంత్రి సత్యకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ(సిడ్స్)రాష్ట్ర అధ్యక్షుడు, రిసెర్చ్ స్టడీ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె. కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో ఎంపిక చేసిన రోగుల నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను గుంటూరులోని తమ రీసెర్చ్ ల్యాబ్‌లో పరీక్షిస్తామన్నారు. మూడు నెలల వ్యవధిలో ఈ ల్యాబ్ టెస్టులు పూర్తి చేసి వచ్చిన ఫలితాలపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. డాక్టర్ నందకిశోర్ మాట్లాడుతూ కేరళలో యాంటి బయాటిక్ మందుల వినియోగాన్ని 20 శాతం తగ్గించారని, అదే మోడల్‌ను మన రాష్ట్రంలో అమలు చేద్దామని సూచించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, ఏఎంఆర్ కమిటీ చైర్మన్ పి. శర్మ, ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ వై. సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

9-14 ఏళ్ల లోపు పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

రాష్ట్రంలో 9 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరికీ సర్వైకల్, మెడ క్యాన్సర్ నివారణకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌లు ఉచితంగా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దేశంలో ప్రతిరోజూ 1,600 మంది మహిళలు గర్భస్థ ముఖద్వార క్యాన్సర్‌తో మృతి చెందుతున్నట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ క్యాన్సర్ నివారణ కోసం రాష్ట్రంలో 9-14 ఏళ్లలోపు పిల్లలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బొమ్మలు: అక్బర్

కొత్త సాహిత్య వారధి 'విదేశీ సిరీస్'



ఛాయా పబ్లికేషన్స్ సంస్థ 'విదేశీ సిరీస్' పేరుతో రానున్న రెండున్నర ఏళ్ళలో పదిహేను అంతర్జాతీయ భాషల నుంచి 25 పుస్తకాలను తెలుగులోకి అనువదించి తేనుంది. ఇప్పటికే ఆయా ప్రచురణకర్తలతో ఒప్పందాలు పూర్తయ్యాయి. ఈ సిరీస్‌లో ఒర్హాన్ పాముక్, హాన్ కాన్ వంటి నోబెల్ గ్రహీతల పుస్తకాలతోపాటు, బుకర్ ప్రైజ్ పొందిన రచయితల పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ ప్రయత్నం గురించి ఛాయ పబ్లికేషన్స్ సంస్థ సీఈవో **అరుణాంక్ లత**తో వివిధ జరిపిన సంభాషణ ఇది:

ఈ 'విదేశీ సిరీస్' ఆలోచన ఎలా కలిగింది, దీని ఉద్దేశం ఏమిటి?

సమకాలీన ప్రపంచ సాహిత్యం తెలుగులోకి రావడం ఆగిపోయి దశాబ్దాలు గడుస్తోంది. ఈ లోటును తీరుస్తూ ఆ సాహిత్యాన్ని సామాన్య పాఠకులకు చేరువ చేసే ఉద్దేశ్యంతో ఈ సిరీస్‌ను ప్రారంభించాము. కొందరికే అందుబాటులో ఉండే ప్రపంచ సమకాలీన సాహిత్యాన్ని మారుమూల తెలుగు పాఠకులకు చేరవేయడం దీని లక్ష్యం.

ఇందులో పుస్తకాల్ని, రచయితల్ని ఏ ప్రాతిపదిక మీద ఎంపిక చేసుకున్నారు?

ఒకే జాన్రా కాకుండా వేర్వేరు థీమ్స్ జాన్రాల నుండి తీసుకున్నాం. రచయితలూ, అనువాదకులూ అందరూ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలున్నవారే. ముఖ్యంగా ఈ జాబితాలో బుకర్, బుకర్ ఇంటర్నేషనల్ బహుమతి పొందిన పుస్తకాలు, నోబెల్ బహుమతి పొందిన రచయితలూ ఉండేలా చూసుకున్నాం. వీటిలో బుకర్ బహుమతి పొందిన ఇంగ్లీష్ నవల 'ప్రొఫెట్ సాంగ్' (2023); మూడు బుకర్ ఇంటర్నేషనల్ బహుమతులు పొందిన నవలలు: కొరియన్ నవల 'ది వెజిటేరియన్' (2016), డచ్ నవల 'డిస్‌కంఫర్ట్ ఆఫ్ ది ఈవెనింగ్' (2020), జర్మన్ నవల 'కైరోస్' (2024); అలాగే, ముగ్గురు నోబెల్ రచయితల పుస్తకాలు: నార్వేజియన్ రచయిత యాన్ ఫోసే నవల 'షైనింగ్' (2023), టర్కిష్ రచయిత ఒరాన్ పాముఖ్ నవల 'మై నేమ్ ఈజ్ రెడ్' (1998), కొరియన్ రచయిత హాన్ కాంగ్ నవలలు 'ది వెజిటేరియన్' (2016), 'వీ డు నాట్ పార్ట్' (2025) ఉన్నాయి. వీటిలో రెండు పుస్తకాలు మినహాయిస్తే మిగతావన్నీ గడచిన ఇరవై ఏళ్ళలో వచ్చినవే.



ప్రచురణకర్తలతో ఒప్పందాలు సులభం గానే జరిగాయా? ఆయా ప్రచురణకర్తలు ఇలాంటి ఒప్పందాల విషయంలో ఏ అంశాలపై దృష్టి పెడతారు, ఇందులో ఆయా రచయితల పాత్ర ఎంతవరకు?

హక్కులు అనేది కాస్త క్లిష్టమైన వ్యవహారమే. ఒక పుస్తకం మనం తీసుకోవాలి అని అనుకున్న తరువాత దాన్ని డీల్ చేసే సంస్థ ఏది అనేది వెతుక్కోవడం కూడా పెద్ద విషయమే. ఎక్కువగా విదేశీ రచయితలకు లిటరరీ ఏజెంట్స్ ఉంటారు. కొందరిని లిటరరీ ఏజెన్సీలు రిప్రజెంట్ చేస్తాయి. ఆ ఫలానా ఏజెన్సీలో తనను రిప్రజెంట్ చేసే ఏజెంట్ ఒకరు ఉంటారు. ఇవన్నీ కనుక్కుని వాళ్ళ ఈమెయిల్ ఐడీ తీసుకున్నాక వారికి రాసిన మెయిల్‌కి స్పందిస్తారని లేదు. వాళ్ళు చాలామందిని చూసుంటారు గనుక ఎక్కువ మంది మొదటి మెయిల్‌కే స్పందించరు. దానికి తోడు, మనం వేసే పుస్తకాల సంఖ్యా, మనం ఆఫర్ చేసే డబ్బులూ వాళ్ళకి పెద్ద విషయంలా అనిపించదు. రిపీటెడ్‌గా రాస్తే తప్ప ఈ ప్రపోజల్స్ వర్కవుట్ అవ్వవు. ఇందులో ఒకటీ రెండు ఈమెయిల్స్‌కే ఒప్పుకున్న వాళ్ళున్నారు, పదుల సంఖ్యలో ఈమెయిల్స్ రాస్తే తప్ప స్పందించనివాళ్ళూ ఉన్నారు.

వాళ్ళు ప్రధానంగా ఎన్ని పుస్తకాలు వేస్తున్నారు, ఏ రకంగా వేస్తున్నారు అనే దానిపై దృష్టి పెడతారు. పుస్తకం పేపర్ బ్యాక్, హార్డ్ బౌండ్, ఆడియో రైట్స్ వేటికవే ప్రత్యేకంగా హక్కులు తీసుకోవాల్సిందే. ప్రచురణ సంస్థ గురించిన ఒక సవివరమైన పరిచయం కూడా వాళ్ళు తెలుసుకునేందుకు ఇష్టపడతారు.

ఈ మొత్తం ప్రక్రియలో రచయితల పాత్ర దాదాపు ఉండదు అనే చెప్పొచ్చు. వారి తరఫున ఇదంతా నెగోషియేషన్స్ ఏజెంట్స్ నిర్వహిస్తారు. కాంట్రాక్ట్‌లో సంతకం చేయడం మాత్రమే రచయిత పని. ఎందుకంటే గత ఏడాది బుకర్ ఇంటర్నేషనల్ వచ్చిన రచయిత్రి జెన్నీ ఎర్పన్‌బెకనీ, 2023 బుకర్ వచ్చిన పాల్ లించ్‌నీ ప్రత్యక్షంగా కలిసినా కూడా వాళ్ళు తమ ఏజెంట్స్ తోనే మాట్లాడమని చెప్పారు.

ఈ పాతిక పుస్తకాలలోనూ పదహారు పుస్తకాలు 'లిటరరీ ఫిక్షన్' జాన్రాకు చెందినవే ఉన్నాయి, ఎందుకు?

ఛాయ పబ్లికేషన్స్‌కు ముందు నుంచీ సీరియస్ పుస్తకాలు వేస్తుందనే పేరు ఉన్నది కనుక ఈ 'విదేశీ సిరీస్'తో దాన్ని ఇంకాస్త ముందుకు తీసుకుపోవాలి అనుకున్నాం. ఇందులో భాగంగా తెస్తున్న పుస్తకాలు వివిధ థీమ్స్‌కి సంబంధించినవి, కొన్ని పాపులర్ ఫిక్షన్ స్టైల్‌లో ఉన్న లిటరరీ ఫిక్షన్. వీటిని యువ రచయితలూ, రాబోయే తరం అందిపుచ్చుకుంటుందనీ, ఈ అనువాద సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేస్తుందనీ మా ఆశ.

ఈ సిరీస్‌లో అరబిక్, ఫినిష్, ఐస్‌లాండిక్, కొరియన్, నార్వేజియన్, రష్యన్ తదితర భాషల పుస్తకాలు ఉన్నాయి. వీటన్నిటి అనువాదమూ వయా ఇంగ్లీష్ అనువాదాల నుంచే జరుగుతున్నదా?

రెండు పుస్తకాలు మినహా మిగతావన్నీ వయా ఇంగ్లీష్ నుంచి చేస్తున్నవే. అయితే, ఇంగ్లీష్ అనువాదకుల నుంచి వారి అనువాదాన్ని వాడుకునేందుకు హక్కులు తీసుకుంటున్నాం. ఇలా వాళ్ళని సంప్రదించడం చాలా అరుదైన విషయమనీ, చాలా భాషల్లోకి వారి అనువాదాలను ఉపయోగించే చేస్తున్నా కనీసం వారి పేరు కూడా పేర్కొనడం లేదని వారు అన్నారు. తమ అనువాద హక్కుల గురించి ఇప్పుడు వారంతా బయటకి వచ్చి సంఘటితం అవుతున్నారు.

రెండు తప్ప వీటిలో ఏ నవలా మూల భాష నుంచి నేరుగా రానప్పుడు తెలుగు అనువాదం మూలానికి మరీ దూరంగా జరిగే అవకాశం లేదా?

మూలం నుండి దూరం జరగకూడదు అనే ఉద్దేశ్యంతో ప్రముఖ ప్రచురణ సంస్థలు వేసిన పుస్తకాలను, అనువాదకుల ప్రొఫైల్‌ని గమనంలో పెట్టుకునే పుస్తకాలను ఎన్నుకున్నాం. వీరంతా ప్రతి పుస్తకం ఐదారు సార్లు, కొందరు ఇంకా ఎక్కువ సార్లు ఎడిట్ చేస్తారు. తరచి తరచి చూసిన తర్వాతే ఈ పుస్తకాలు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ లోకి వచ్చేటప్పుడు 'ట్రాన్స్‌లేషన్ లాస్' తక్కువ గనుక తెలుగులో ఆ సమస్య ఉండదనే అనుకుంటున్నాం.

తెలుగు అనువాదకుల ఎంపిక ఎలా జరుగుతోంది? అనువాదాల శైలి విషయంలో ఏమైనా నియమాలు విధించుకున్నారా?

ఈ సిరీస్ ద్వారా కొత్త అనువాదకులను పరిచయం చేస్తున్నాం. ఇప్పటికే అనువాదం చేసిన నలుగురు అనువాదకుల అనువాదాలను చూసి వారికి కొన్ని పుస్తకాలు ఇచ్చాం. అయితే, ఈ సిరీస్‌కి ముగ్గురు సంపాదకులను కేటాయించాం. వారు ఇంగ్లీష్ – తెలుగు అనువాదం చూడటం, మూలానికి దూరం కాకుండాను, అట్లే రీడబిలిటీ ఉండేలాను చూస్తారు. అంతేగాక రీడర్ రివ్యూ అనే పద్ధతినీ పాటిస్తున్నాం. ఎంపిక చేసిన పాఠకులకు అచ్చుకు ముందే పుస్తకాలు పంపించి ఎలా ఉందో రివ్యూలు తీసుకుంటున్నాం.

ప్రస్తుతం భారతీయ/ తెలుగు రీడర్‌షిప్ విషయంలో విదేశీ ప్రచురణకర్తల దృక్పథం ఎలా ఉంది?

భారతీయ రీడర్‌షిప్ అంటే వారి దృష్టిలో ఇంగ్లీష్ రీడర్‌షిప్ మాత్రమే. ఒక్క మలయాళం మినహా మిగతా భారతీయ భాషల్లో అనువాద సాహిత్యం వేల కాపీలు అమ్ముడుపోయేదీ తక్కువే. భారతీయ భాషలు సంఖ్య ప్రకారం పెద్దవేగానీ రీడర్‌షిప్ ప్రకారం చిన్నవి. వారు ఈ విషయం చెబితే అర్థం చేసుకుంటున్నారు. ఒక కొత్త భాషలోకి పుస్తకం వెలుతుందిలెమ్మనే అభిప్రాయంతో ఉన్నారు. బహుశా ఈ పుస్తకాలు కొత్త మార్కెట్‌కి దారులు వేస్తాయేమోనన్న దృక్పథంతోనూ ఉన్నారు.

ఈ 'విదేశీ సిరీస్' ప్రయాణంలో 15 భాషల నుంచి పుస్తకాలు తెస్తున్నాం గనుక, కేవలం మనం తేవడంతోనే ఆగిపోకుండా మన సాహిత్యాన్ని అటువైపు తీసుకుపోయే ప్రయత్నం కూడా చేస్తున్నాం. త్వరలో మన పుస్తకాలూ ఫ్రెంచ్ వీధుల్లోనో, జర్మన్ బుక్ షాప్స్‌లోనో, అమెరికన్ మాల్స్‌లోనో... ఆయా భాషల్లో కనిపించొచ్చు. ■

నా మొదటి పుస్తకం

ముఖచిత్రంపై ఇప్పటికీ అసంతృప్తి

ఎస్. ఎ. రవూఫ్

1983. కాకినాడ 'రంగరాయ' కాలేజీలో నేను మెడిసిన్ మొదటి సంవత్సరం చదువుతున్న రోజులవి. అప్పుడు నేను తొమ్మిది, పది, ఇంటర్ తరగతులు చదివే కాలంలో రాసిన కవితల్ని కంపైల్ చేసి ప్రచురించిన నా మొదటి కవితా సంపుటి 'అంతర్నేత్రం'. ఈ పుస్తకం ప్రింటింగ్ ప్రెస్‌కి వెళ్ళే క్రమంలో నేను ఇంటర్ చదువుకున్న సర్వోదయా కళాశాలలో మాకు తెలుగు, బోటనీ చెప్పిన అధ్యాపకులు, సాహిత్యం పట్ల విశేషమైన ఆసక్తి కలిగిన కాళిదాసు పురుషోత్తం గారు, సత్యా గారు ముక్త కంఠంతో, "తొందరపడి పుస్తకాన్ని అప్పుడే అచ్చు వేయకు. తేడా కొడితే విమర్శకులు చీల్చి చెండాడుతారు" అని హెచ్చరించారు. నా కవిత్వం మీద నాకు గట్టి నమ్మకంతో మా లెక్చరర్ల మాటల్ని లెక్కచేయక మొండిగా అడుగు ముందుకు వేశాను. ఆ మొండి ధైర్యం తోనే అప్పట్లో సమకాలీన తెలుగు కవిత్వానికి దీపధారిగా నిల్చిన కవి ఇస్మాయిల్‌ని కాకినాడ లచ్చిరాజు వీధి లోని వారి ఇంట్లో కలిశాను. పరిచయాలూ, ఉపోద్ఘాతాలూ ఏమీ లేకుండా నా కవిత్వపు కాగితాల బొత్తిని ఇస్మాయిల్ గారి చేతుల్లో పెట్టి, "పుస్తకం వేస్తున్నాను. మీరు ముందుమాట రాయాలి," అన్నాను. నా మాటలకి ఆయన విస్తుపోయి నా వంక ఎగాదిగా చూసి నిష్కర్షగా, "ముక్కూమొహం తెలియనివాళ్ళకి నేను పీఠికలూ, పరిచయాలూ రాయను" అన్నారు. "మీకు కుదిరినప్పుడే చదివి, నచ్చితేనే రాయండి" అని వచ్చేశాను. మొదట రాయనన్న ఇస్మాయిల్ గారే వారంలోపే అద్భుతమైన పరిచయం రాశారు. నా కవిత్వాన్ని జెన్, హైకూ జపనీయ పద్యాలతో పోల్చుతూ, "రవూఫ్‌వి తెరుచుకున్న పద్యాలు! పద్యం పరిధిని మించి విస్తృతార్థాన్ని ఇస్తాయి. సార్వజనీన, సార్వత్రిక సత్యాల్ని ఆవిష్కరిస్తాయి," అని రాశారు. ఒక యువకవి కవిత్వ పుస్తకానికి ఇస్మాయిల్ ముందుమాట రాయటం నాతోనే మొదలు. నాకు అది ఒక విశిష్ట అనుభవం!



> పరిచయాలూ, ఉపోద్ఘాతాలూ ఏమీ లేకుండా నా కవిత్వపు కాగితాల బొత్తిని ఇస్మాయిల్ గారి చేతుల్లో పెట్టి, "పుస్తకం వేస్తున్నాను. మీరు ముందుమాట రాయాలి," అన్నాను. నా మాటలకి ఆయన విస్తుపోయి నా వంక ఎగాదిగా చూసి నిష్కర్షగా, "ముక్కూ మొహం తెలియనివాళ్ళకి నేను పీఠికలూ, పరిచయాలూ రాయను" అన్నారు.

అంతర్నేత్రం పుస్తక ప్రచురణ అప్పుడే ప్రింటింగ్ రంగంలోకి దిగిన నరసరావుపేటలోని వాసవి ప్రింటర్స్‌లో జరిగింది. నన్ను అమితంగా ప్రేమించే మా మేనమామ సుభాని ప్రచురణ బాధ్యతని తలకెత్తుకున్నారు. కవర్ పేజీపై ముఖచిత్రం, టైటిల్ అక్షరాలు మా పెదనాన్న జైనుల్ ఆబెదిన్ గారివి.



కవర్ పేజ్ అనుకున్నట్టు రాలేదు. అదే అసలు లోపం. ఆ అసంతృప్తి నాలో ఇప్పటికీ ఉంది. ఈ పుస్తకాన్ని అమ్మా నాన్న (సమీవున్నీసా, నూర్ అహమద్) లకి అంకితం ఇచ్చాను. పుస్తకం ప్రెస్ లోంచి బైటికి వచ్చినప్పుడు నాకు కలిగిన అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఏనుగెక్కినంత సంబరం!

'అంతర్నేత్రం' పుస్తకావిష్కరణ కాకినాడలోనే జరిగింది. అక్కడి ప్రభుత్వ గ్రంథాలయంలో ఆర్. ఎస్. సుదర్శనం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, 'ప్రామిసింగ్ పొయెట్' అన్నారు. అదే సభలో 1980 లో 'కొత్త కలాలు' శీర్షికన నన్ను పరిచయం చేసిన ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు 'రవూఫ్‌ని డిస్కవర్ చేసింది నేనే' అన్నారు. సభలో ఇస్మాయిల్, స్మైల్, గోదావరి శర్మ, జానకీ జాని గార్లు పాల్గొనటం నా సుకృతం!

నా మొదటి కవితా సంపుటి 'అంతర్నేత్రం' నాకు తెచ్చిన పేరు అంతా ఇంతా కాదు. రాత్రికి రాత్రే కాలేజ్ క్యాంపస్ లోనూ, బైట కూడా సెలబ్రిటీని అయిపోయాను. ఆనాటి నించి నా పేరు 'అంతర్నేత్రం రవూఫ్'గా స్థిరపడిపోయింది. అదే సంవత్సరం జరిగిన రంగరాయ వైద్య కళాశాల రజతోత్సవాలకి విచ్చేసిన, అప్పటికే రచయితగా ప్రసిద్ధులైన, డాక్టర్ పరుచూరి రాజారామ్ నా 'అంతర్నేత్రం' పుస్తకాన్ని పట్టుకొని "ఇక్కడ రవూఫ్ అంటే ఎవరు?" అంటూ మా మెన్స్ హాస్టల్‌కి నన్ను వెతుక్కొంటూ రావటం నాకు దక్కిన గొప్ప గౌరవం! ■



వలస పక్షులు

రెండు జల్లుల తెరిపిలో
బట్టలారేసుకున్నట్టు
కాలం తీగెలపై
బతుకులు ఆరేసుకోవాలి
కన్నీటిలోనూ
రంగులు వెతుక్కునే
ఆశలు మనవి

ఎన్ని తెరచాపలు కట్టినా
చెమట సంద్రంలోని
ఆకలి నావ నడక
కుదుటపడదు
కంటి నుండి కంటికి
కన్నీటిని రాజేసే
తడి నిప్పు ఆరదు

సాలెగూడులో చిక్కిన
పురుగుల్లా
గడియారంలోని
ముళ్ళు పెట్టే మూల్గులకు
చీకటి కిటికీ

రెప్పలు చాచగానే
తూరుపు బండి
వేకువ కూత పెడుతుంది

ఇంకో కొత్త రోజుకి
రెక్కలివ్వడానికి
నిద్రకన్ను గుడ్డిలాంతరులా
తెరుచుకుంటుంది

ఆకుల్లేని కొమ్మల్లో
వసంతాన్ని వెదుక్కుంటూ
విరిగిన బతుకుతెరువుకి
ఊతకర్రలు కట్టి
ఆకలి కడుపు దాకా
మెతుకులను ఎగదోస్తున్నా
మన కలలన్నీ వలసపక్షులే
కన్ను చూపే నిజమేమో
ఓ ఎండిన సరస్సు

■ మిరప మహేష్
99480 39026

పాలపిట్ట తెలంగాణ ప్రత్యేక సంచిక

తెలంగాణ ఏర్పడి పుష్కర కాలం అవుతున్న సందర్భంగా పాలపిట్ట తెచ్చిన తెలంగాణ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ జూలై 26 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత రూప్ కుమార్ డబ్బీకార్, ఆవిష్కర్త ఏనుగు నరసింహారెడ్డి. సభలో నామోజు బాలాచారి, మామిడి హరికృష్ణ, పొట్లపల్లి శ్రీనివాసరావు, ఎం. నారాయణశర్మ, గుడిపాటి, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ ప్రసంగిస్తారు.

పాలపిట్ట బుక్స్

చలసాని ప్రసాద్ వర్ధంతి

విరసం నాయకులు చలసాని ప్రసాద్ పదో వర్ధంతి సభ జూలై 27 ఉ.10గం.లకు విశాఖ పౌర గ్రంథాలయంలో జరుగుతుంది. ఈ సందర్భంగా చలసాని ప్రసాద్ డిజిటల్ లైబ్రరీని విరసం సీనియర్ సభ్యురాలు కృష్ణాబాయి, అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ ఆవిష్కరిస్తారు. సత్యనారాయణ మూర్తి, మల్లీశ్వరి, ఇప్టూ ప్రసాద్, బాల సుధాకర్ మౌళి, సీఎస్ఆర్ ప్రసాద్, రివేరా తదితరుల ప్రసంగాలు ఉంటాయి.

రివేరా

'మహా పాదయాత్ర' దీర్ఘ కవిత

అడపా రామకృష్ణ దీర్ఘ కవిత 'అమరావతి మహిళల మహాపాదయాత్ర' ఆవిష్కరణ సభ జూలై 27 ఉ.10గం.లకు ఎస్‌హెచ్‌ఒ మీటింగ్ హాల్, 2/1 బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. స్వాగతం బండికల్లు జమదగ్ని, సభాధ్యక్షత తూములూరి రాజేంద్రప్రసాద్, ముఖ్యఅతిథి జాస్తి వీరాంజనేయులు, ఆత్మీయ అతిథి శిరేలా సన్యాసిరావు.

పట్టాభి కళాపీఠము

'విశ్వంభర' సినారె పురస్కారం

సి. నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణ రెడ్డి సాహిత్య పురస్కారాన్ని అస్సామీ కవి నీలిమ్ కుమార్ స్వీకరిస్తారు. ఈ కార్యక్రమం జూలై 29 సాయంత్రం రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కార గ్రహీతను రూ.5లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరిస్తారు.

జె. చెన్నయ్య

కథా సంపుటాలకు ఆహ్వానం

'ఎన్జీరంగా సాహిత్య పురస్కారాలు 2025'కు ప్రత్యేకంగా రచయిత్రుల నుండి కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. మొదటి, రెండవ బహుమతులు వరుసగా: రూ.10వేలు, రూ.5వేలు. రచయిత్రులు 2021–2024 మధ్య ప్రచురితమైన తమ కథా సంపుటాలు 4 ప్రతులను ఆగస్ట్ 9 లోపు చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202 శ్రీవెంకటసాయి రెసిడెన్సి, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు – 523 002కు పంపాలి. ఫోన్: 9849799711.

జక్కంపూడి సీతారామారావు

నాగభైరవ సాహిత్య పురస్కారం

నాగభైరవ సాహిత్య పురస్కారానికిగాను అనువాద సాహిత్యంలో రూ.10వేల మొదటి బహుమతికి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అనువాద నవల 'నెత్తురు నది', రూ.5వేల రెండవ బహుమతికి కోనేరు కల్పన అనువాద కథల సంపుటి 'దర్పణం' ఎంపిక అయ్యాయి. ఆగస్ట్ 17న ఒంగోలులో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం ఉంటుంది.

నాగభైరవ ఆదినారాయణ



పాఠకదేవుళ్ళకు...

చక్కగా టేకాఫ్ అయిన రచయిత
ఎక్కడెక్కడో గగనసీమల్లో తిరిగి తిరిగి
మరలా ల్యాండయ్యేందుకు
ఒక్క దయామయుడైన పాఠకుడుండాలి
కారుమబ్బులకు కొండలున్నట్లు
కారే మేఘాలకు నేల అండ ఉన్నట్లు

పాఠకుడు ఒక పిడికెడు మట్టి
కవులు విత్తనాలై విస్తరిస్తారు
పాఠకుడు ఓ చమురు ప్రమిద
రచయితలు వత్తులై వెలిగిపోతారు

ఆఖరున...
సృజనకారుల చేత ఊపిరిపోసుకున్న
రసభరితమైన పసి రచన
పాఠకుడు ఊయలై
హాయిగా తననెపుడు
ఊపుతాడా అని ఎదురుచూస్తుంది

■ నలిమెల భాస్కర్

చదువు ముచ్చట

మానస ఎండ్లూరి

ముందు తరం నమ్మకాన్నీ ధైర్యాన్నీ ఇచ్చింది

రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

కొత్త తరం రచనలు, కొత్త రకం రచనలు ఎన్నో వస్తున్న కాలం ఇది కాబట్టి ఒక పుస్తకమంటూ చెప్పడం కష్టమే. ఎక్కువ కథలు చదవడానికి ఇష్టపడతాను. స్ఫూర్తి కందివనం కథలు 'డిమ్కి', పసునూరి రవీందర్ కథలు 'అవుట్ ఆఫ్ కవరేజ్ ఏరియా', రూబీనా పర్వీన్ కథలు 'జమిలి పోగు', కరుణ కుమార్ కథలు 'సవర్లకొండ', సురేంద్ర శీలం నవల 'నడూరి మిద్దె', మహి బెజవాడ కథలు 'గన్స్ అండ్ మాన్సూన్స్', బూదూరి సుదర్శన్ నవల 'కెమిస్ట్రీ', ఉషజ్యోతి బంధం కవిత్వం 'ఉన్మత్త'... ఇవి ఈ మధ్యకాలంలో నేను పూర్తిగా చదివి ఇష్టపడినవి.



బాల్యంలో/ యవ్వనంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

నా పదవ ఏట రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో చలం 'మైదానం' నవల చదివిన గుర్తు. అప్పుడేం అర్థం కాలేదు గాని ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకి మళ్ళీ చలం సాహిత్యమే నన్ను బాగా కట్టిపడేసింది. డిగ్రీ సిలబస్‌లో భాగంగా చదివిన హెన్రీ డేవిడ్ థోరో రాసిన 'వాల్డెన్' పుస్తకం నన్ను ఎందుకో కుదిపేసింది. ఆయన ప్రతిపాదించిన జీవన విధానాలు; ప్రకృతిని, జీవితాన్ని గురించి ఆయన చెప్పే తత్వపు విశేషాలతో, ప్రకృతికి దగ్గరగా అతితక్కువలో జీవిస్తూ ఉండడం గురించి రాసిన పుస్తకం ఇది. చదవడంలో ఉండే ఒక గొప్ప అనుభూతిని ఇచ్చిన పుస్తకం ఇది. ఆ తర్వాత స్మైల్ బాబా రాసిన 'బేచారే' కథలు ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు.

మీ పఠనంపై ఇంట్లో తల్లిదండ్రుల ప్రభావం?

అమ్మ డా. పుట్ల హేమలత, నాన్న డా. ఎండ్లూరి సుధాకర్‌లు ఇద్దరూ రచయితలు, విరివిగా చదివిన వారిగా ఇంట్లో పుస్తకాలు ఎప్పుడూ అందుబాటులోనే ఉండేవి. ఫలానాది చదవకూడదు అనే మాటే ఉండేది కాదు. పురాణాల నుండి నేటి ప్రతి పుస్తకం దాకా చదవాలని నాన్న ఎప్పుడూ చెప్పేవారు. అమ్మ ఎక్కువ అనువాదాలను, వాటి అసలు రచనలను చదవమని చెప్తుండేవారు. భాష మీద, అర్థాల మీద పట్టుని ఇష్టపడేవారు.

మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?


నాకంటే ముందు రాసిన ప్రతి రచయిత– అని చెప్తాను. నేను రాస్తున్న క్రైస్తవ, దళిత, స్త్రీ అస్తిత్వ కథల నుంచి ప్రేమ కథల వరకు సంఘటన, సందర్భం బట్టి వాటిని నేను చూసే తీరు మారినా, ప్రతి అస్తిత్వానికి ముందు తరం రచయితలు నిర్దిష్టమైన దారులు వేశారు. ఒక నమ్మకాన్ని, ధైర్యాన్ని తర్వాతి వారికి ఇచ్చారు.

మీరు రాసిన కథల్లో మీకు బాగా నచ్చిన పాత్ర?

నేను రాసిన 'బొట్టు భోజనాలు' కథ లోని కథా నాయిక పాత్రను గురించి ఇప్పటికీ పాఠకులు గుర్తు చేస్తుంటారు. అప్పటివరకు స్నేహితులుగా కలసిమెలసి ఉండే ఆఫీస్ కలీగ్స్ పండక్కి తన ఆహ్వానాన్ని నిరాకరించినప్పుడు ఆ పాత్ర వండిన ఆ వంటకాలని, ఆ పరిస్థితిని హ్యాండిల్ చేసిన విధానాన్ని వివక్షను అర్థం చేస్కున్న ఏ ఒక్కరూ మర్చిపోలేరు.

ఏ గత కాలం రచయితనైనా కలవగలిగితే ఎవరిని కలుస్తారు?

మొట్టమొదటి తెలుగు దళిత కథా రచయిత్రి తాడి నాగమ్మను కలుస్తాను. ఈ ఊహ తల్చుకోడానికే ఆనందంగా ఉంది. ఆమె 1930లలో కథలు రాశారు. నిజానికి ఆమె పెద్దగా దళిత కథలు రాయలేదు. ఆమె అభిరుచి అంతా అంతర్జాతీయ రాజకీయాలు. ఆమె అభివ్యక్తి వేరు. ఆమె రాసిన 'మొదటి ముద్దు' కథపై ఇప్పటికీ విశ్వవిద్యాలయాల్లో చర్చలు చేస్తుంటారు. ఆమె టీచర్‌గా పని చేస్తూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు వైద్యం కూడా చేసేవారు. ఆమెను గురించి పూర్తి వివరాలు, కథలతో రచయిత, చరిత్రకారులు సంగిశెట్టి శ్రీనివాస్ పుస్తకం తెచ్చారు. ఆమెను కలిస్తే అప్పటి దళిత స్త్రీ స్థితిగతులు, దళిత కులాలలోని వ్యత్యాసాలు, రాజకీయ అభివృద్ధి గురించి మాట్లాడతాను.



రచన విషయంలో మీకు మీరు అర్థం చేసుకున్న ఏదైనా అంశం?

నా వరకు ఒక మంచి కథ రాయడమంటే కొన్ని రోజులు మనసు అతలాకుతలం అవుతుంది. మరింక దేనికీ చోటుండదు. కొన్ని సంకలనాల కోసమని నన్ను నేను తొందర పెట్టుకుని రాసిన కథలు పాఠకుల ప్రశంసలు పొందినా నాకు సంతృప్తి లేకుండా చేశాయి. అప్పుడే గాఢంగా అనుకున్నాను– మన దగ్గర బ్రహ్మాండమైన వస్తువు సిద్ధంగా ఉన్నా, బలవంతంగా రాయలేం అనీ, రాయకూడదు అని. ఆలస్యం చేసే నష్టం కంటే, తొందరపాటు తెచ్చిపెట్టే తంటా ఎక్కువ.

(మానస ఎండ్లూరి కథల సంపుటి 'మిళింద' 2018లోను, శరణ్ కుమార్ లింబాలే మరాఠీ నవలకు మానస తెలుగు అనువాదం 'ఊరికి దక్షిణాన' 2021లోను వచ్చాయి.)



నడికూడి గ్రామ పంచాయతీ సమీపంలో నిలిచిన లారీలు



అంబరం.. బోనాల సంబరం

- మహంకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు
- కిటకిటలాడిన ఆలయం

దుగ్గిరాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన కంఠంరాజుకొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి బోనాల సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. మేళతాళాలు, కనక తప్పెట్లు, మంగళ వాద్యాలు, అమ్మవారి, శివపార్వతుల వేషధారణల నృత్యాలతో ఆలయ ఆవరణలో సందడి నెలకొంది. బోనాల ఉత్సవ శాశ్వత దాత డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సహకారంతో 400 మందికి పైగా మహిళలకు పొంగలి కిట్లను పంపిణీ చేశారు. ఉదయం 6 గంటల నుంచి మంగళగిరి, తెనాలి, గుంటూరు, విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మంత్రి లోకేశ్ ఆదేశాలతో కొత్తగా రోడ్డు వేయడంతో భక్తులకు ప్రయాణ కష్టాలు తప్పాయి. మహిళలు శిరస్సుపై బోనాలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ఆవరణలో శాంతి హోమం నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ మండలాధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గడ్డిపాటి అపర్ణ తదితర తెలుగు మహిళలు బోనాలు సమర్పించారు. వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కోగంటి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆగని గ్రానైట్ దందా

జీరో బిల్లులతో అక్రమ రవాణా

- నాడు ఆందోళనలు.. నేడు నేతల అండ
- గత ప్రభుత్వ తరహాలోనే అడ్డగోలు దోపిడీ
- వాటాల్లో తేడాలు.. ఆధిపత్య పోరుతోనే లారీల పట్టివేత

(బాపట్ల, మార్టూరు, దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో యథేచ్ఛగా గ్రానైట్ దందా సాగింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ దందాపై ఎడతెగని పోరాటమే చేసింది. ప్రభుత్వం మారి అధికారం టీడీపీకి చేతి కొచ్చింది. కానీ ఈ గ్రానైట్ దందాలో మాత్రం మార్పు రాలేదు. పైగా ఇది మరో స్థాయికి చేరుకుంది. అప్పుడు పెడబొబ్బలు పెట్టిన నేతల అనుయాయులే ఇప్పుడు సూత్రధారులయ్యారు. ప్రైవేట్ సైన్యం కూడా సేమ్ టూ సేమ్. గ్రానైట్‌ను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా ఎంత సంపాదించవచ్చో అప్పటి నేతలు దారి చూపగా, దానిని అందిపుచ్చుకున్న ప్రస్తుత నేతలు ఇప్పుడూ అదేమార్గంలో దూసుకెళుతున్నారు. మైనింగ్, రెవెన్యూతో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పాత్ర ఈ అడ్డగోలు దందాలో ఉండగా, కీలకపాత్ర మాత్రం అధికార పార్టీ నేతల అనుచరులదే అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

బాపట్ల జిల్లాలోని మార్టూరు, సంతమాగులూరు, బల్లికురవ మండలాల నుంచి గ్రానైట్ పలకలతో పాటు ముడిసరుకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. బాపట్ల జిల్లా నుంచి పల్నాడు జిల్లా మీదగా తెలంగాణలోకి ప్రవేశించాల్సి ఉంది. ఈ క్రమంలో మైనింగ్ సీనరేజ్‌కు సంబంధించి ఓ ప్రైవేటు ఏజెన్సీ (మిగతా 6వ పేజీలో)

బర్లీ కొనుగోళ్లు.. సెప్టెంబరు వరకు

- రెండు నెలలు అందుబాటులో కేంద్రాలు
- అధికారులకు సమాచారం ఇచ్చిన మార్క్‌ఫెడ్

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మిగిలి పోయిన హెచ్‌డీ నల్లబర్లీ పొగాకుని సెప్టెంబరు నెల వరకు కొనుగోలు చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం ఆ శాఖ నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలకు పైగానే మార్క్‌ఫెడ్ ప్రారంభించిన పొగాకు కొనుగోలు కేంద్రాలు రైతులకు



అందుబాటులో ఉంటాయని అధికారవర్గాలు తెలిపాయి. ఈ దృష్ట్యా పొగాకు రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కేంద్రాలకు తీసుకొచ్చి పొగాకుని విక్రయించుకోవాలని సూచించాయి. కేంద్రం నుంచి సహకారం లేకపోయినా బర్లీ పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసింది. అయితే వివిధ కారణాలతో ఇప్పటివరకు కేవలం రూ.44 కోట్ల పొగాకును మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద భారీ మోతాదులో పొగాకు నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల వ్యవధిని సెప్టెంబరు వరకు పొడిగిస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకున్నది. రైతులు తేమ 20 శాతం లోపు ఉన్న బేళ్లను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక రోజు ముందుగానే తమ బేళ్లను తనిఖీ చేయించుకోవాలని సూచించింది.

తిరస్కరించే బేళ్లు

నల్ల బొగులు, పచ్చగొగులు, పండుగుల్ల, ధ్వంసమైన బేళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో అనుమతించమని ఆ శాఖ అధికారులు తెలిపారు. రైతులకు అనుకూలంగా కొనుగోలు ప్రక్రియ సులభతరంగా జరిగేలా సీఎంయాప్, ఏపీఏఐఎంఎస్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫాంలను సంస్థ నిర్వహిస్తుందని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే రైతులు మార్క్‌ఫెడ్/వ్యవసాయ అధికారులను సంప్రదించొచ్చని సూచించారు.



నిండకుండలా సాగర్ జలాశయం

పరవళ్లు నారుమళ్లు!



కొనసాగుతున్న కృష్ణానదిలో వరద ప్రవాహం

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు అన్ని జలాశయాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం సాగర్ జలాశయం నీటి మట్టం 567 అడుగులకు చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో మరో వారం రోజుల్లో డ్యాం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో పది రోజుల్లో సాగర్ కుడి కాల్వకు సాగు నీటి సరఫరాకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. సాగు నీటి విడుదల సమాచారం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. దీంతో వరి నారు మళ్లు పోసే పనిలో నిమగ్నమయ్యారు.

- నిండుకుంటున్న జలాశయాలు
- 567 అడుగులకు చేరిన సాగర్ డ్యాం నీటి మట్టం
- పది రోజుల్లో కుడి కాల్వకు సాగు నీటి విడుదల
- వరి సాగుకు అన్నదాతలు సమాయత్తం
- నీటి వనరుల ప్రాంతాల్లో వరి నారుమళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువులు, వాగులు, బావులు, మోటార్లు ఇలా నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి నారు మళ్లు పోస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేసిన వెంటనే నాట్లు వేసేలా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎక్కువ శాతం మంది రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేశారు.

నిండుకుంటున్న సాగర్ జలాశయం

సాగర్ జలాశయానికి 67,525 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. శ్రీశైలం జలాశయానికి.. వరద ప్రవాహం పెరిగింది. 1,56,516 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో సాగర్‌కు శ్రీశైలం నుంచి నీటి విడుదల పెంచనున్నారు. ఇదే తరహాలో నీటి ప్రవాహం కొనసాగుతుందని జలవనరుల (మిగతా 6వ పేజీలో)



ఈపూరు: ఎర్రబాలెంలో వరినారుకు విత్తనాలు చల్లుతున్న రైతులు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే గళ్లా మాధవి

95 శాతం ప్రజల్లో సంతృప్తి

- తొలి అడుగులో మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై 95 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక 43వ డివిజన్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు(నాని)తో కలిసి ఆదివారం 'సుపరిపాలన - తొలి ఏడాది' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాభిప్రాయాలను ఆయన స్వయంగా సేకరించారు. వీధికుక్కల సమస్యపై చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాల సమస్యల విషయంలో ఎమ్మెల్యే సహకారంతో త్వరితంగా పరిష్కారం తీసుకువచ్చేలా కృషి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ దీపాల సమస్యలపై ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, ఈరంటి వరప్రసాద్, నూకవరపు బాలాజీ, మూల్పూరి పేరయ్య, సింహాద్రి కనకాచారి, మద్దిరాల మ్యాని, ముప్పా వేణుబాబు, గుర్రం ప్రసాద్, తాళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య భారతి జాతీయ నాయకులను సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

యోగాతో మానవ జీవితం స్వచ్ఛం

- ఆరోగ్య భారతి అభ్యాసవర్గ కార్యక్రమంలో మంత్రి సత్యప్రసాద్

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు లేకుండా మనిషి జీవితం స్వచ్ఛంగా ఉండాలంటే యోగా ఒక్కటే మార్గమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక హిందూ ఫార్మసీ కళాశాలలో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య జీవన విధానం అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించి ఆయుర్వేద వైద్యులను సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2030 నాటికి హెర్బల్ ఉత్పత్తుల ఎగుమతిలో ప్రపంచ దేశాల్లో భారత్ ప్రథమస్థానంలో ఉంటుందన్నారు. ఆహార లోపాలతో క్యాన్సర్ రోగాలు వస్తున్నాయన్నారు. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మూత్రపిండాలు, లివర్ వ్యాధుల బారిన పడిన వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. యాంటీ బయాటిక్స్ ఎక్కువ వాడటం వల్ల మరణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ఆరోగ్య భారతి స్ఫూర్తితో ప్రతి వారంలో ఒకరోజు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయుష్ ఆస్ప త్రులకు కేంద్రం పెద్ద పీట వేసి నిర్మాణాలు చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయుష్ నిధులను తీసుకోకుండా సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబ ఆరోగ్య రక్షణ తన బాధ్యతన్నారు. రాష్ట్రంలో భ్రష్టుపట్టిన ఆరోగ్య శాఖను గాడిలో పెట్టేందుకు ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ జాతీయ సంఘటన కార్య దర్శి డాక్టర్ అశోక్‌కుమార్, జాతీయ సహ సంఘటనా కార్యదర్శి చెన్నై డాక్టర్ మురళీకృష్ణ, సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎన్‌చారి, క్షేత్ర సంయోజకులు కుమారస్వామి, ఏపీ సంఘటన కార్య దర్శి డాక్టర్ కాకాని పృథ్వీ రాజు, శంకర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఏటి అగ్రహారంలో నిలిచిన వర్షపు నీరు

కుండపోత..



అరండల్‌పేట బ్రిడ్జి వద్ద వర్షపు నీరు

మధ్యాహ్నం వరకు ఎండ.. ఆపై కమ్ముకొచ్చిన మేఘాలతో అర్ధరాత్రి వరకు అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం వేళ కురిసిన భారీ వర్షంతో గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

- గుంటూరు

జడ్పీ ఫైల్స్



బిల్లుల చెల్లింపుల్లో మీన మేషాలు


- చర్చనీయాంశంగా 'విద్యాజ్యోతి' బిల్లుల చెల్లింపు
- 9 నెలల నుంచి రూ.80 లక్షల ఫైల్ పెండింగ్
- పర్సంటేజీ తేలందే ముందుకు కదలని వైనం?
- మెటీరియల్ క్వాలిటీ పరీక్ష ఒకే.. అయినా వేధింపులు



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు అందజేసిన మెటీరియల్

నాకేంటి.. ఆహా నాకేంటి అంట.

ఇదీ బిల్లుల చెల్లింపు సమయంలో.. కాంట్రాక్టర్లకు జిల్లా పరిషత్ అధికారుల నుంచి వస్తున్న ప్రశ్న. పర్సంటేజీలు తేలందే.. కొన్ని ఫైల్స్ ముందుకు కదలడం లేదన్న విమర్శలు జడ్పీలో ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా జడ్పీ హెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పథకం కింద స్టడీమెటీరియల్ అందజేసిన కాంట్రాక్టర్‌ను చూపుతున్నారు. తొమ్మిది నెలలు దాటినా సదరు గుత్తేదారును కీలక అధికారి బిల్లుల చెల్లింపు విషయంలో వేధింపులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పర్సంటేజీ తేలందే ఫైల్ ముందుకు కదలదని ఉన్నతాధికారి భీష్మించుకున్నట్లు చర్చ నడుస్తోంది.



క్వాలిటీ పరీక్షలో ఓకే

గుంటూరు సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూ రు జిల్లా పరిషత్‌లో ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. కొన్ని ఫైల్స్‌ను కీలక అధికారు లు అర్థంతరంగా తొక్కి పెడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో ఫైల్‌ను నెలల తర బడి పెండింగ్‌లో పెడుతూ ఉండడం అత్యంత వివాదాస్పదమవుతుంది. తాజాగా విద్యా జ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు పుస్తకాలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌కు సుదీర్ఘ కాలం బిల్లులు చెల్లించని వైనంపై దుమారం రేగుతోంది. తొమ్మిది నెలలు గడచినా.. కీలక అధికారి మీనమేషాలు లెక్కిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. బిల్లు చెల్లింపులు కోసం భారీ మొత్తంలో ఆశించి.. ఫైల్‌ను నెలలు తరబడి తొక్కి పెట్టడంతో బాధితులు రోడ్డెక్కే పరిస్థితి దాపురించింది.

విద్యాజ్యోతి సంగతి ఇదీ..

జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఏటా జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ పథకానికి విద్యా జ్యోతి అని నామకరణం చేశారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఈ స్టడీ మెటీరియల్ తయారు చేయడం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుంది. ఈ మెటీరియల్ చదవడం వల్లే 10 తరగతి పరీక్ష ఫలితాల్లో తనకు 596 మార్కులు వచ్చాయని కారంపూడి మండలానికి చెందిన విద్యార్థిని (మిగతా 6వ పేజీలో)

మూడు జిల్లాలకు.. 35 వేల పుస్తకాలు

విద్యాజ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు 2024-25 సంవత్సరానికి మొత్తం 35 వేల పుస్తకాలు సరఫరా చేశారు. గుంటూరు జిల్లా కు 11,806, పల్నాడు జిల్లాకు 17,657, బాపట్ల జిల్లాకు 5,284 చొప్పున తెనాలి కి చెందిన సంస్థ సరఫరా చేసింది. సుమారు 550 పేజీలకు పైగా ఉన్న ఒక్కో పుస్తకం ఖరీదు రూ.177గా ఉంది. పేద విద్యార్థులకు అవసరమయ్యే.. మెటీరియల్ కావడంతో అతి తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

పుస్తకాల ముద్రణ, పేపర్ నాణ్యతకు సంబంధించి హైదరాబాద్‌లోని ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా పరిషత్ అధికారులు లేఖ రాశారు. మార్చి 19న సదరు ఫైల్‌ను హైదరాబాద్‌కు పంపారు. అదే నెల 25న హైదరాబాద్ ప్రభుత్వ రంగ సంస్థ విద్యాజ్యోతి పుస్తకాల నాణ్యతను నిర్ధారిస్తూ సర్టిఫికెట్ మంజూరు చేసింది. అది వచ్చిన తర్వాత కూడా జడ్పీ అధికారులు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఫైల్ ను పెండింగ్ పెట్టడం వెనుక మర్మం ఏంటన్న ప్రశ్నలు వస్తున్నాయి.

ఆగని గ్రానైట్ దందా

(5వ పేజీ తరువాయి)

వసూళ్ల టెండర్ గత ప్రభుత్వంలోనే దక్కించుకుంది. అనధికారిక రవాణా విషయంలో ఈ సంస్థ ఇచ్చే టోకెన్ కూడా సరిహద్దుల దగ్గర పనిచేస్తున్నాయని సమాచారం. ఇది కాకుండా జీఎస్టీ కూడా గ్రానైట్ వ్యాపారులు చెల్లించాలి. ఒక్కో లారీకి రూ.70,000 నుంచి లక్ష వరకు వివిధ రూపాలలో ప్రభుత్వానికి ఆదాయం లభించే అవకాశం ఉంది. నిబంధనలకు పాతరేసి లారీకి రూ.35,000 నుంచి రూ.45,000 కప్పం చెల్లిస్తే చాలు దర్జాగా సరిహద్దులు దాటిస్తు న్నారు. అలా వసూలు చేసిన మొత్తాల్లోనే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి కొం త, వ్యవస్థలకు కొంత, సింహభాగం మాత్రం అధికార పార్టీ నేతల అనుచరగణానికే. ఈ అడ్డగోలు దందాలకు ఆపితే ప్రభుత్వ ఖజానాకు నెలకు అక్షరాల పది కోట్లు ఆదాయం సమకూరుతుంది.

ఆధిపత్యపోరుతోనే..

పన్నులు చెల్లించకుండా మార్టూరు ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న 11 గ్రానైట్ లారీలను జూన్ 24న పల్నాడు జిల్లాలోని సరిహద్దుల వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. శనివారం పల్నాడు జిల్లా తంగెడ వద్ద మరో 14 లారీలను పట్టుకున్నారు. లారీలను పట్టుకున్న అధికారులపై ప్రైవేటు సైన్యం వాగ్వాదానికి దిగిందనే ప్రచారం ఉంది. ఈ రెండు ఉదంతాలకు సంబంధించే జరిమానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు రూ.60 లక్షలకు పైగా జమైంది. దీనిని బట్టి గ్రానైట్ రవాణాలో మాఫియా పాత్ర లేకపోతే ప్రభుత్వ ఖజానాకు కాసుల గలగలే. ఈ మొక్కుబడి పట్టివేతలు ఆధిపత్య పోరులో భాగంగానే అనే ప్రచారం జోరుగా నడుస్తోంది. వాటాల పంపకాలలో నేతల అనుచరుల మధ్య వచ్చిన తేడాల్లో భాగంగానే తమ పరిధిలో ఉన్న అధికారులను ప్రయోగించి దారికి తెచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని గ్రానైట్ వ్యాపారులు చెబుతున్నారు.

జడ్పీ 'ఫైల్స్'!

(5వ పేజీ తరువాయి)

వెల్లడించింది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ మెటీరియల్‌ను తెనాలికి చెందిన ప్రముఖ ప్రింటర్స్ కారు చౌక ధరకు ముద్రించి.. పేద పిల్లలకు అందజేస్తున్నారు.

9 నెలలు దాటినా

విద్యాజ్యోతి మెటీరియల్ టెండర్లు ముగిసి తొమ్మిది నెలలు దాటింది. 35 వేల పుస్తకాలు పంపిణీ చేసినందుకు రూ.80 లక్షలు వరకు బిల్లులు చెల్లించాలి. జడ్పీ అధికారులు మాత్రం ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

పర్సంటేజ్ కోసం పట్టు?

కొన్ని కీలకమైన ఫైళ్ల నెలల తరబడి పెండింగ్ ఉండటం వెనుక అసలు సంగతి వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు తమకు రావాల్సిన పర్సంటేజ్ ఫైనల్ అయిన తర్వాతే కొన్ని ఫైళ్ల పరుగులు పెడుతున్నట్లు చెబుతున్నారు. విద్యా జ్యోతి ఫైల్ కూడా అందుకే పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతుంది.

పరవళ్లు.. నారుమళ్లు !

(5వ పేజీ తరువాయి)

శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 247 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో కుడి కాలువ ఆయకట్టులో సాగుకు భరోసా వచ్చింది.

రాయితీ విత్తనం మాటేంటి?

సాగర్ కుడి కాల్వకు సాగు నీటిని విడుదల చేసేందుకు ఒకవైపు జలవనరుల శాఖ సమాయత్తమవుతుండగా.. వ్యవసాయ శాఖ మాత్రం సాగుపై ఇంకా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే వరి విత్తనాల నిల్వలు సిద్ధం చేసి.. రైతులకు రాయితీపై సరఫరా చేయాల్సి ఉంది. కానీ, వ్యవసాయశాఖ విత్తన పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి రైతులు విత్తనం కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తన రాయితీని వారు కోల్పోతున్నారు. జిల్లాలో 1,33,400 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. ఈ మేరకు వరి విత్తనం సిద్ధం చేయలేదు. జిల్లాలో 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బీపీటీ-5204, జేజీఎల్ -354, కేఎన్ఎం-1638, ఎన్ఎల్ఆర్-34449,అంకుర్ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ-2782, బీపీటీ-2846 రకాల విత్తనాలు సరపడా నిల్వలు డీలర్ల వద్ద ఉంచాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలో చర్యలు కానరావడం లేదు.



శాకంబరిగా భ్రమరాంబకు పూజలు



● అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు

పెదకాకాని, జూలై 20(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భ్రమరాంబ అమ్మవారికి శాకంబరిగా అలంకరణ చేశారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్‌తో వైభావోపేతంగా అలంకరించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దంపతులు దేవస్థానానికి మేళతాళాల మధ్య చేరకుని అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు.



అమ్మవారికి ఆషాఢ సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు

అర్చకులు మల్లేశ్వరస్వామికి, భ్రమరాంబకు నరేంద్రకుమార్ దంపతులతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించారు. అనం తరం వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాకంబరీ దేవి అలంకరణలో భ్రమరాంబ అమ్మవారని వేలాది మంది భక్తులు దర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు బోయపాటి రామ్మోహన్‌రావు, మహిళలు పాల్గొన్నారు.

జగన్ ఆలోచనలు సమాజానికి ప్రమాదకరం

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): హింస, అవినీతితో రాజకీయాల్లో రాణించాలనే జగన్ ఆలోచనలు రాష్ట్రానికి ప్రమాదకరంగా మారుతు న్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు విద్యానగర్‌లో ఆదివారం జరిగిన విలేకరు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత విమర్శలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు వంటి కొత్త సంస్కృతిని జగన్ తీసుకువచ్చాడని మండిపడ్డారు. పేర్ని నాని లాంటి నాయకులు హింసను ప్రోత్సహిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. మహా భారతంలో ధర్మరాజుకు కోపం వస్తే ఏమి జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తో పాటు కూటమి నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను గమనించి ఆ పార్టీకి, జగన్‌కు దూరంగా ఉండాలని హితవు పలికారు. పరామర్శ పేరుతో జగన్ బల ప్రదర్శన చేస్తున్నాడని.. ఏ సీజన్‌లో ఏ పంటలు పండిస్తారో తెలియని అతను న్యాయం చేస్తాడని రైతులు అనుకోవడం లేదన్నారు. గంజాయి తప్ప ఇతర పంటలపై జగన్‌కు అవగాహన లేదని యరపతినేని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం, ఇతర కుంభకోణాలపై విచారించి నిందితుల్ని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. విషపు రంగు నీళ్లు అమ్మి పేదల రక్తాన్ని జలగల మాదిరి పీల్చిన వారిని ఎందుకు వదిలి పెట్టాలని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో గురజాల నియోజకవర్గంలో 11 మంది టీడీపీ కార్యకర్తలను చంపారని, మైనింగ్ గుంతల్లో ఆరుగురు చిన్న పిల్లలు చనిపోయారని.. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని చెప్పారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన రూ.1,200 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. పల్నాడు ప్రాంతంలో మరో రెండు సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. గురజాల, ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన కోరారు.

పోరాట యోధుడు శేషగిరిరావు : ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో పాలువాయిగేటులో పోలింగ్ రోజున వైసీపీ అల్లరి మూకలు దాడి చే



సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి,యరపతినేని నిఖిల్

స్తున్నా అదరకుండా బెదరకుండా వారి అరాచకాలు, దౌర్జన్యకాండకు ఎదురొడ్డి నిలబడిన పోరాట యోధుడు నంబూరి శేషగిరిరావని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యువనేత యరపతినేని నిఖిల్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం శేషగిరిరావు మృతదేహాన్ని సందర్శించి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పార్టీ కోసం పని చేసిన శేషగిరిరావు గురించి చెప్పాలంటే మాటలు రావడం లేదని చెమర్చిన కళ్లతో పేర్కొన్నారు. మే 13, 2024న శేషగిరిరావుపై దాడి జరిగిన తీరును తెలుసుకున్న తాను పాలువాయిగేట్‌కు వచ్చానని, దెబ్బలంటే లెక్క లేదు కానీ, సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా తాను గెలవాలని శేషగిరిరావు కోరినట్లు బ్రహ్మారెడ్డి గుర్తు చేశారు. ఓ వైపు రక్తం కారుతున్నా బాధను పంటిబిగువున పెట్టుకుని పార్టీ కోసం పరితపించిన వ్యక్తి శేషగిరిరావన్నారు. వారి కుటుంబ సంక్షేమానికి పార్టీ ఇతోధికంగా సాయం అందిస్తుందన్నారు.

వెబ్ ఆప్షన్స్ గడువు పొడిగింపు

లాంఫాం(తాడికొండ)జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్లమా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు.. వెబ్ ఆప్షన్స్ గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం తిరుపతి కళాశాలలో అగ్రికల్చర్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి అనుమతించటం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, జూలై 20, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని నూజండ్ల రైల్వే గేటు వద్ద ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై శ్రీనివాసరావు వివరాల మేరకు.. మండలంలోని పిట్టబండ గ్రామానికి చెందిన జక్కంపూడి రామారావుకు(29) కొంత కాలంగా మతి స్థిమితం లేదు. వినుకొండలోని కుమ్మరి బజారులో ఉన్న అన్న వద్ద ఉంటున్నాడు. తెల్లవారు జామున బహిర్భూమికి రావడంతో రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి.. సెల్‌ఫోన్‌తో పరార్

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూలై20(ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడమే కాకుండా.. వాహనదారుల సెల్‌ఫోన్, బైక్ తాళం లాక్కొని పారిపోయిన ఘటన చేబ్రోలు - నారాకోడూరు ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. బాధితులు వివరాల మేరకు.. తెనాలి మండలం పెదరావూరుకు చెందిన పుట్టపు పిచ్చియ్య, గాజులవర్తి కిషోర్ చేబ్రోలులోని బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమానికి ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నారు. చేబ్రోలు- నారాకోడూరు మధ్య ఓ పెట్రోల్ వద్ద వీరిని వెనుక నుంచి ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడడంతో వారికి గాయాలయ్యాయి. అంతలోనే కారు నుంచి దిగిన యువకులు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం తాళం లాక్కుని అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పిచ్చియ్య, కిషోర్‌ను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

నరెడ్కో క్యాపిటల్ జోన్
గుంటూరు అధ్యక్షుడిగా అంకారావు

● ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు కార్పొరేషన్, జూలై20 (ఆంధ్రజ్యోతి): నరెడ్కో క్యాపిటల్ జోన్ గుంటూరు అధ్యక్షుడిగా సీహెచ్ అంకారావును ఎన్నుకున్నారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరు క్లబ్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పెరవలి నాగవంశీ, అధ్యక్షుడిగా కె.సి.అంకారావు, కార్యదర్శిగా మాదాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్న తిరుపతయ్య, వైస్ ప్రెసిడెంటుగా శ్రీనాథ్, యోగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథి, ప్రధాన సలహాదారు చుక్కపల్లి రమేష్ నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.



నూతన కమిటీ

రచయితలు బైరాగి, శారద శత జయంతి



శత జయంతి సభలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్

తెనాలి అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రముఖ రచయితలు ఆలూరి బైరాగి, శారద శత జయంతి కార్యక్రమం ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. సాహిత్య అకాడమీ, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన సభకు ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. సమాజాన్ని దిశా నిర్దేశం చేసే రచనలు రచయితలు అందించారన్నారు. ఐతానగర్‌లో బైరాగి విగ్రహం ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, రవిబాబు, శ్రీనివాసరావు, ఆదిత్య, గుజ్జర్లమూడి కృపాచారి, శారద కుమార్తె శారద ప్రసంగించారు.

రషీద్ హత్య కేసులో నిందితులుగా మరో నలుగురు

వినుకొండటౌన్ జూలై 20, (ఆంధ్రజ్యోతి): వినుకొండలో గత ఏడాది జూలై 17న రషీద్ అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో మరో నలుగురిని నిందితులుగా చేర్చాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు శనివారం ఆదేశించినట్లు వినుకొండ పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. హత్యానంతరం ప్రాథమిక దర్యాప్తు నివేదికలో నమోదు చేసిన 20 మంది నిందితుల్లో షఫీ, అర్షాఫ్ మస్తాన్, జానీ, సాయిబా పేర్లను పోలీసులు అభియోగ పత్రంలో తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ హతుడి సోదరుడు ఖాదర్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సాక్షులను విచారణ మేరకు మరో నలుగురుని ఈ కేసులో నిందితులుగా చేర్చాలని న్యాయస్థానం ఆదేశించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జి సీఐ సుభాషిని వివరణ కోరగా సోమవారం ఆర్డర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

పప్పెట్రీతో బోధన సులభతరం

● జాతీయ వర్క్‌షాప్‌లో రావెల ఉపాధ్యాయిని



రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయ బృందం

తాడికొండ(రావెల)జూలై 20(ఆంధ్రజ్యోతి): పప్పెట్రీ ద్వారా బోధన మరింత సులభతరం అవుతుందని, విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరని మండలంలోని రావెల ఏఎం స్కూల్ ఉపాధ్యాయురాలు బండి ఏస్తేరు రాణి పేర్కొన్నారు. కల్చరల్ అండ్ క్రాఫ్ట్ రిసోర్స్ సెంటర్ ఢిల్లీ, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అనుబంధంగా జూలై 3 నుంచి 17 వరకు "పప్పెట్రి ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఇన్ లైన్ విత్ ఎన్ఈపీ-2020" వర్క్ షాప్ జరిగింది. ఇందులో దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల నుంచి 68 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏపీ నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాగా..అందులో ఎస్తేరు రాణి ఒకరు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ఏస్తేరు రాణి మాట్లాడుతూ.. తను నేర్చుకున్న అంశాలను పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేస్తామని చెప్పారు.

మద్యం కేసులో తిమింగలానికి త్వరలో శిక్ష

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



కరపత్రం అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ జూలై 20, (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో అసలు తిమింగలానికి త్వరలోనే శిక్ష తప్పదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రస్తుతం సిట్ అరెస్టులన్నీ చిన్న చేపలవేనన్నారు. పట్టణంలోని కల్యాణ్‌పురి కాలనీలో ఆదివారం రాత్రి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం విలేకరులతో జీవీ మాట్లాడారు. సాగర్ ఆయకట్టు రైతులకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16,500



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం భట్టిప్రోలులోని పద్మశాలీయ బహోత్తమ సంఘం కార్యాలయంలో మార్కండేయ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించడంతో పాటు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి.. నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. పద్మశాలీయ సేవా సంఘం సేవలను కొనియాడారు. సంఘం సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, బట్టు మల్లికార్జునరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

● రాష్ట్ర శ్రేయస్సు కోసమే కూటమికి మద్దతు
● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



సంఘీభావం తెలియజేస్తున్న సంఘం నేతలు కేసన, క్రాంతికుమార్, శేషయ్య తదితరులు

గుంటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు స్పష్టం చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల జనగణన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీల రిజర్వేషన్ శాతాన్ని తేల్చాలని కోరారు. రాష్ట్రంలో ఓబీసీలకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఏ రాజకీయ పార్టీకైనా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాపులను బీసీల్లో చేరుస్తామనే అంశంపై నిరసన తెలియజేశామన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఓబీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓబీసీల రిజర్వేషన్ ఎంతో శాతమో తేల్చాలన్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మూడు అసెంబ్లీ స్థానాలను బీసీలకే కటాయించాలని కోరారు. హక్కుల సాధనకు త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తా మన్నారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రాంతికుమార్

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమ్మర క్రాంతికుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ నిమ్మల శేషయ్య, సంఘం నేతలు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	119, 127, 137
చికెన్ విత్ స్కిన్(కిలో)	226.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	236.00

మహిళకు వేధింపులు.. వీఆర్వోపై కేసు

బెల్లంకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన వీఆర్వో వెంకయ్యపై బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ.. తల్లికి వందనం పథకం కోసం సంతకం చేయాలని వీఆర్వో వద్దకు వెళ్లింది. అయితే వీఆర్వో వెంకయ్య కోరిక తీరిస్తేనే సంతకం పెడతానని వేధించడంతో.. బాధిత మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జాస్తి రామారావు తదితరులు

జీఎంసీకి అవార్డుపై చంద్రబాబు అభినందన

గుంటూరు కార్పొరేషన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత పోటీల్లో గుంటూరు నగరపాలక సంస్థ 'సూపర్ స్వచ్ఛ్ లీగ్ సిటీస్ అవార్డు' గెలుచుకుంది. ఈ సందర్భంగా నగరపాలక సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించి రాష్ట్ర ప్రభుత్వ తరుఫున పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌లతో కలిసి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తిరుపతిలో జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ మిషన్ అవార్డు పొందిన గుంటూరు కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందిస్తున్నామన్నారు. రానున్న కాలంలో ప్రజలకు స్వచ్ఛత ప్రేరణనివ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం దీనికి అన్ని విధాల సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎంహెచ్ఓ జె.రామారావు, ప్రజారోగ్య విభాగ కార్మికులు హాజరయ్యారు.

చదరంగంతో మేధో వికాసం

● జేసీ భార్గవతేజ

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఏకాగ్రత పెరగడంతో పాటు మెదడు చురుగ్గా పని చేస్తుందని జాయింట్ కలెక్టర్ భార్గవతేజ అన్నారు. స్థానిక ఎల్వీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ క్లబ్ ఆవరణలో ఆదివారం అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చెస్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరంతర సాధనతో చెస్‌లో నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. ఎల్వీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎల్వీఆర్ క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శి యాగంటి దుర్గారావు, పోటీల ఆర్బిటర్లు ఎస్.సురేష్, పి.విజయకుమార్, ఎస్కే అబ్దుల్ నబీ, పి.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో జేసీ భార్గవతేజ, ఎల్వీఆర్ క్లబ్ సభ్యులు

విశ్వబ్రాహ్మణ సమాజం పునరుజ్జీవనానికి కృషి

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం పునరుజ్జీవనానికి కృషి చేస్తామని ఆ సమాజ నూతన అధ్యక్షుడు జంపని రాధాకృష్ణమూర్తి అన్నారు. శ్రీ దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలో ఆదివారం అంతర్జాతీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణం వద్ద మహాజన సభ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం జంపని రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ త్వరలోనే 36 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, హైకోర్టు న్యాయవాది అడవికొలను వేణుగోపాలకృష్ణ, యోగి మహేశ్వరానంద గురూజీ, విశ్వకర్మ వీరం వైస్ ఛైర్మన్ తుమోజు రామలక్ష్మణాచార్యులు, ఉపాధ్యక్షుడు కె.నంద వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస సుబ్రహ్మణ్యం పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న జంపని రాధాకృష్ణమూర్తి, పాల్గొన్న సంఘ సభ్యులు

నిరుపేద వాచ్‌మన్‌కు ఇస్త్రీ బండి అందజేత

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేద వాచ్‌మన్ పడుతున్న ఆర్థిక ఇబ్బందులను చూసి రోటరీ క్లబ్ గుంటూరు సెంటీనీయల్ సంస్థ ఆయన ఉపాధి కోసం ఒక ఇస్త్రీ బండిని ఉచితంగా అందజేసింది. ఆదివారం నగరంలోని ఒక సముదాయానికి కాపలాగా ఉంటూ నివసిస్తున్న వ్యక్తికి స్వయం ఉపాధి నిమిత్తం ఇస్త్రీ బండిని అందజేశామని క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వీర ఆతుకూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, అపార్టుమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలకు స్థానం

గుంటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలు నలుగురికి స్థానం కల్పించారు. వైసీపీ రాష్ట్ర కమిటీ ఆర్టీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవుతు శ్రీధర్‌రెడ్డి కాగా రాష్ట్ర కార్యదర్శులుగా గులాం రసూల్, మందపాటి శేషగిరిరావు, నిమ్మకాయల రాజనారాయణలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలానే రాష్ట్ర కార్యదర్శులను ఇతర జిల్లాల్లోని నియోజకవర్గాలకు పార్టీ పరిశీలకులుగా నియమించనున్నట్లు తెలిపారు.

పెన్షనర్లు శిరస్త్రాణం ధరించాలి

● ఈదర వీరయ్య

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు ఎన్నిసార్లు చెప్పినా ద్విచక్ర వాహనాలు నడిపే పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు శిరస్త్రాణం ధరించటంపై అలక్ష్యం వహిస్తున్నారని పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పెన్షనర్ కుమారుడు కొత్తగా కొనుక్కున్న బైక్ వేగంగా నడుపుతూ వాహనాన్ని తప్పించబోయి డివైడరును ఢీకొని ప్రాణాలు పోగొట్టుకున్నాడు. శిరస్త్రాణం (హెల్మెట్) ధరించి ఉంటే ఈ ప్రమాదంలో అతను బతికేవాడని ఆ దుర్ఘటనను చూసిన అనేక మంది ఆవేదన చెందారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నా ద్విచక్ర వాహనాలు నడిపేవారు శిరస్త్రాణం తలకెక్కించుకోవటంపై అలక్ష్యం వహిస్తున్నారన్నారు. వాహనం కొనుగోలు చేయటానికి ఇచ్చిన ప్రాధాన్యంలో జీవితానికి అత్యంత భద్రత ఇచ్చే శిరస్త్రాణం విషయంలో మాత్రం అలాంటి శ్రద్ధ కనబడటం లేదన్నారు. ఇంకొందరు రహదారులపై 150 రూపాయలకు కూడా అమ్మే నాశిరకం శిరస్త్రాణాలు కొనేస్తున్నారని, ఎప్పుడైనా నాణ్యమైనవి ఐఎస్ఐ ముద్ర ఉన్నవే తీసుకోవాలన్నారు. అయితే ఐఎస్ఐ ముద్ర ఉన్న వాటికి, లేనివాటికి ఒక్కోసారి తేడా పెద్దగా కనిపించదని, నాశిరకానికి చెందినది కూడా బరువుగా, పటిష్టంగా కనిపిస్తుందన్నారు. ఇది ప్రమాద సమయంలో రక్షించబడదని పరిశీలనల్లో తేలిందన్నారు. నాణ్యమైన వాటిలో సాగేతత్త్వం కల పాలీస్టిరీన్ వినియోగిస్తారని, ఇది కుషన్‌లా ఉపయోగపడుతుందని, ప్రమాదం జరిగిన సందర్భంలో తలకు దెబ్బ తగలకుండా ఇది కాపాడుతుందన్నారు. శిరస్త్రాణంతో వెన్ను, మెడనొప్పులు వస్తాయనే దానిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఎదురు వాహనాలు సరిగ్గా కనపడవని, శబ్దాలు వినపడవని అంటుంటారని, ఇది తప్పని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ పోలీసు వారి సూచనలు పట్టించుకొని ప్రమాదాల నుంచి తప్పించుకోవాలని వీరయ్య కోరారు.

ప్రజలకు అండగా సీఎం సహాయనిధి

● రూ.42.14 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన పెమ్మసాని



గుంటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): 'ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సాయం అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగు నింపుతోంది' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన రూ.42,14,861 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ సంక్షేమానికి నిదర్శనంగా నిలుస్తోందని, వైద్య అవసరాలు, ఆర్థిక సంక్షోభం వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఈ నిధులు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని లబ్ధిదారులు భావోద్వేగంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

← సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న పెమ్మసాని

చమత్కార కవిత్వం జన రంజక సారం

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చమత్కార కవిత్వం జన రంజక సారం అని ప్రముఖ కవయిత్రి నైనాల వాణిశ్రీ తెలిపారు. బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో 'అమరావతి సాహితీమిత్రులు' ఆదివారం ఉదయం నిర్వహించిన సాహిత్య సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై 'చమత్కార పద్యాలు' గురించి ప్రసంగించారు. శబ్ద చమత్కారం, అర్థ చమత్కారం అనే రెండు రకాల చమత్కారాలు గురించి సోదాహరణంగా వివరించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో ఆమె ప్రసంగిస్తూ ప్రాచీన పద్య కవుల పద్యాలతో పాటు ఆధునిక అవధానుల పద్యాలను కూడా తెలియజేసి చమత్కార పరిమళాల్ని సభలో పంచిపెట్టారు. 'ఈ మాసం కవి'గా చల్లా సత్యవతి పాల్గొని అనేక జాతీయ అంతర్జాతీయ అంశాల మీద చక్కని కవితలు వినిపించి సభను రంజింపజేసారు. 'జంతువులు' అనే అంశం గురించి 'నిక్కచ్చి కవిత' కవితా పఠనం పోటీలో గెలుపొందిన సంబరాజు రమణికి శాంతశ్రీ ట్రస్ట్ వారి రూ.500 నగదు బహుమతి అందజేశారు. 'ఈ మాసం కవి'గా పాల్గొన్న చల్లా సత్యవతిని సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు, ముఖ్య అతిథి నైనాల వాణిశ్రీ ఘనంగా సత్కరించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో పూసపాటి కృష్ణ సూర్య కుమార్, డాక్టర్ మైలవరపు లలిత కుమారి, యర్రగుంట్ల పాణిరావు, ఆర్.కుమారస్వామి, దుర్గం సునీత, ఎ.శంకర్, లంక మాధవి, సత్యవతి, రమణి, మన్నం వెంకట గురువు పాల్గొన్నారు.

ఎల్ఐసీ జోనల్ క్యారమ్ పోటీలకు న్యాయ నిర్ణేతగా జలీల్



షేక్ అబ్దుల్ జలీల్

గుంటూరు(తూర్పు) జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ క్యారమ్స్ పోటీలకు ముఖ్య న్యాయ నిర్ణేతగా నగరానికి చెందిన జాతీయ ప్యానల్ కోచ్ షేక్ అబ్దుల్ జలీల్ ఎంపికయ్యారు. దీనికి సంబంధించి ఎల్ఐసీ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ క్యారమ్ సంఘ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జలీల్‌కు ఆల్ ఇండియా క్యారమ్స్ సంఘ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, ఏపీ సంఘ చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు ప్రసాదు, ఎల్వీఆర్ సభ్యులు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

గుంటూరు (విద్య), జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.బాలచంద్రరావు విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని యోగి భవన్లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని నింపి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కే.దశపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, సిహెచ్ శ్రవణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేయడంతోపాటు ఉపాధ్యాయుల బకాయిలు సత్వరం విడుదల చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఎం.సురేష్, కే.శ్రీనివాసరావు వై.వీరబాబు పి.శ్రీనివాసరావు, జి.నాగార్జున, వైఆర్కే ప్రసాద్, మహిళా నాయకులు జి.పద్మ తదితరులు పాల్గొన్నారు

దాతల సహకారం మరువలేనిది

● కేజేఎస్ఎస్ అధ్యక్షుడు సామినేని

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జేకేసీ రోడ్డులో నిర్మిస్తున్న నూతన భవన సముదాయానికి దాతల ఆర్థిక తోడ్పాటు మరువలేనిదని కమ్మ జన సేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కుందులరోడ్డులోని వసతి గృహంలో నూతన భవన నిర్మాణానికి తెనాలికి చెందిన వీఎస్ఆర్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ అడ్డాల ఆంజనేయులు రూ.6 లక్షల చెక్కును ఆయనకు అందజేశారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ రెండు వేల మందికి వసతి కల్పించాలనే లక్ష్యంతో రూ.50 కోట్లతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. అడ్డాల ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న సమితి సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత వైస్ ఛాన్సలర్ దావులూరి రామకోటయ్య, విశ్రాంత ప్రొఫెసర్ వి.సాంబశివరావు, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, రాయపాటి గోపాలకృష్ణ, పెద్ది సాంబశివరావు, కడియాల బాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు

ఆటో కార్మికుల సమస్యలపై ఆందోళనలు

గుంటూరు(తూర్పు) జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ఇచ్చిన ప్రభుత్వ హామీపై దశల వారీ ఆందోళనలను నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా హామీల అమల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్లను వేధిస్తున్న ఆర్టీవో అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో 36ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో డ్రైవర్స్ యూనియన్ సీపీఐ శాఖ కార్యదర్శిగా మంగా శ్రీనివాస్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాస్, కూరాకుల రాంప్రసాదు, బాబర్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న సీపీఐ నాయకులు, ఆటో కార్మికులు

రుమటాలజీ సమస్యలకు అత్యాధునిక వైద్యం

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రుమటాలజీ సమస్యలకు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని రుమటాలజిస్టు డాక్టర్ ఏ.అలేఖ్య తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆమె ప్రసంగించారు. ముఖ్యంగా ఎముకలు, కీళ్ళకు వచ్చే సమస్యల గురించి వివరిస్తూ కాల్షియం శాతం ఎముకలలో తగిన మోతాదులో లేని కారణంగా ఆస్టియో పోరోసిస్ అనే వ్యాధికి గురవుతారని తెలిపారు. ఈ సమస్యల వల్ల చిన్న పాటి సమస్యలకు కూడా ఎముకలు విరిగే ప్రమాదముందన్నారు. శరీరానికి డి విటమిన్ అవసరమని, కనీసం 60 నిమిషాల పాటు శరీరానికి సూర్యరశ్మి తగిలే విధంగా వ్యాయమం చేయటం లేదా వాకింగ్ చేయటం మంచిదన్నారు. కీళ్ళు, కండరాల నొప్పులున్నప్పుడు వెంటనే రుమటాలజీ వైద్యులను సంప్రదిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, సుబ్బారావు, చల్లా అంజిరెడ్డి, రాంప్రసాద్, హేమంత్ తదితరులున్నారు.

విద్యార్థులకు జేఈఈ, నీట్ మెటీరియల్ పంపిణీ

గుంటూరు (విద్య), జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడవి తక్కెళ్ళపాడులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థులకు మదర్ థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో నీట్, జేఈఈ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంఘం వ్యవస్థాపకులు సముద్రాల చిన్న కోటేశ్వరరావు, ఆచార్య తుమాటి రవి, హైకోర్టు న్యాయవాది వట్టికొండ రామమోహన్, కుగ్లర్ ఫిసోథెఫి కరస్పాండెంట్ డాక్టర్ కర్రా బెంజిమాన్, డాక్టర్ చుక్కా నాగభూషణం పాల్గొన్నారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న సముద్రాల చిన్న కోటేశ్వరరావు తదితరులు

ప్రేమను నిరాకరించారని యువకుడి అదృశ్యం



విజయ్ కృష్ణ

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు ప్రేమను నిరాకరించారని ఓ యువకుడు అదృశమయ్యాడు. లాలాపేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు రూరల్ మండలం గాయవారిపాలెం గ్రామానికి చెందిన డొక్కు విజయ్ కృష్ణ (25) నగరంలోని పొన్నూరు రోడ్డులో ఒక రూమ్ అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ లక్ష్మీపురంలోని ఒక వస్త్ర దుకాణంలో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అదే వస్త్ర దుకాణంలో పని చేసే ఒక అమ్మాయిని ప్రేమించాడు. వారి వివాహానికి సంబంధించి అమ్మాయి ఇంటికి వెళ్లి మాట్లాడాలని తన తల్లిదండ్రులను కోరగా వారు నిరాకరించారు. దీంతో ఈనెల 17న సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన రూమ్ నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో తండ్రి డొక్కు లక్ష్మీ నరసింహ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయ్ కృష్ణ ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో తెలియ చేయాలని పోలీసులు కోరారు.



మిర్చి తొడాలు వలుస్తున్న వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● మూడో డివిజన్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని, అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మూడో డివిజన్లో ఆదివారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రజల వద్ద ఎమ్మెల్యే నసీర్ ఆరా తీశారు. సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. లక్ష్మీనగర్, సుద్దపల్లి డొంక ప్రాంతాల్లో దొంగలు హల్ చల్ చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేశారు. దొంగతనాలు పెరిగిపోయాయని, భయబ్రాంతులకు గురవుతున్నామని స్థానికుల చెప్పడంతో వెంటనే సీఐతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. అవసరమైన ప్రాంతాల్లో తన సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ వంటి వారి నాయకత్వం రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలికిందని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణం అభివృద్ధికి మైలురాయి అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదని, అభివృద్ధిపై అప్పటి నాయకులకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. అధికారం చేపట్టిన కొద్ది కాలంలో కొత్త టెండర్ల ప్రక్రియ నుంచి పనులు పునఃప్రారంభించే వరకు కృతనిశ్చయంతో ముందడుగు వేశామని తెలిపారు. ఆరు నెలల్లోనే బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. వర్షాలు పడుతున్నందుకు స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లవుల అశోక్, బట్టా రాజా, అల్లం బాజీ, కందుకూరి వెంకట్, కొలగాని సుబ్బారావు, ఐల శ్రీనివాస్, సంకోజి కొండలు, ప్రసాద్, కూరాకుల ప్రభాకర్, జాగర్లమూడి శ్రీనివాస్, దేవేల వెంకట్, తిరుమల రాజు, సైదా, పవన్ తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న ఆత్రేయీ కృష్ణా

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు) జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ కళావేదికపై ఆదివారం జరిగిన ప్రసిద్ధ గాయకురాలు ఆత్రేయీ కృష్ణా శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది. వీరికి వయోలిన్‌పై లక్ష్మి ఎస్.భట్, మృదంగంపై మల్లాది శివానంద్ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. త్యాగరాజ కృతులతో పాటు అనేక వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా గానం చేసి సంగీతాభిమానులను అలరించారు. తొలుత కార్యక్రమాన్ని డీ. శ్యామసుందరి ప్రారంభించగా, సంఘ ఉపాధ్యక్షుడు, ఎస్.గిరిజా శంకర్, సలహాదారు నేతి విశ్వేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ పర్యవేక్షించారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): షటిల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయిలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు అండగా నిలబడ్డారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రంగారావు, దామచర్ల శ్రీనివాస్ పాల్గొని క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న అరిగెల్ల భార్గవ్ రామ్, దివెనబోయిన స్రవంతి, దివెనబోయిన దీపిక, సాయి సోహేల్, కోటా సాయి సోహన్‌లతో పాటు కోచ్‌లకు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. షటిల్ క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి తీసుకురావాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సతీష్ చంద్ర, బండారు రాము, రమేష్, శ్రీమాన్, హరి తదితరులు పాల్గొన్నారు



నగదు ప్రోత్సాహకాలు పొందిన క్రీడాకారులతో దామచర్ల శ్రీనివాస్, రాయపాటి రంగారావు తదితరులు

నగరంలో కుండపోత వర్షం

● లోతట్టు ప్రాంతాలు జలమయం ● రోడ్లపై నిలిచిన నీరు

● రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం కుండపోతగా కురిసింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట తరువాత ఒక్కసారిగా చల్లని గాలులతో నగరంలో కుండపోతగా వర్షం ప్రారంభమైంది. దాంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే మూడు రోజులుగా వర్షాలతో తడిసి ముద్దయిన నగరం ఆదివారం కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా కాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వ్యాపార సమయాల్లో వర్షం పడటంతో వారంతా దిగాలు చెందారు. షాపింగ్‌లకు, వ్యాపార కొనుగోళ్ళకు బయటకు వచ్చిన ప్రజలు తిరుగుముఖం పట్టేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా నగరంలోని శివారు కాలనీల్లో ఇప్పటికే నీరు నిలిచి ఉండగా తాజాగా కురిసిన వర్షంతో అంతర్గత రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.



వర్షం నీరుతో చిరు వ్యాపారుల అవస్థలు



నగరంలో కురుస్తున్న వర్షం



జూట్ మిల్లు ఎదురు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



బ్రాడీపేట 2/12 లో నిలిచిన వర్షపు నీరు

SCHOLARSHIP ALERT

Unnati 2-Towards a Better Future Scholarship

Description: CNH Industrial (India) Private Limited invites applications from students who are currently studying in Class 8 to 10 or in first-year ITI/Diploma courses in Gurgaon, Delhi, and Noida.
Eligibility: The school-level scholarship is for applicants studying in Classes 8 to 10, who have scored at least 60% in the previous academic year.
● For the ITI/Diploma level scholarship, the student must be studying in the first year of the course.
● Students from Gurgaon, Delhi, or Noida whose total family income does not exceed 5 lakh are eligible to apply.
● Children of Buddy4Study and CNH Industrial (India) Private Limited employees are not eligible to participate.
Prizes & Rewards: Scholarships up to 12,000 per year for up to three years for school students.
● Scholarship up to 18,000 per year for two years for Diploma/ITI students.
Last Date to Apply: 17-08-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/UTBF3

HOPE Engineering Scholarship by Schaeffler India 2025



Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.
Eligibility: The scholarship is open to female students across India enrolled in the first year of an engineering program at any UGC or state-recognised college. Preference will be given to students with disabilities and those pursuing core engineering branches such as Automobile, Mechanical, Mechatronics, Electrical and Electronics, Electronics and Communication, Production, Instrumentation, Computer Science Engineering, and Information Technology. Applicants must have scored over 60% in Class 12 (Science) (40% marks for PwD) in the academic year 2024–25, with an annual family income of less than INR 5 lakh.
Prizes & Rewards: Scholarship of INR 50,000 per year for four years
Last Date: 30-07-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/SIHE16

ఐఐటీలు అందించే ఉచిత ఏరో ఇంజనీరింగ్ కోర్సులు

ఏరో స్పేస్ ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోని కొన్ని ఐఐటీలు ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు తమ రెగ్యులర్ కోర్సులతోపాటు వీటిని కూడా చేయవచ్చు.



దేశంలో ఏరో స్పేస్ ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఐఐటీలు ఈ ఉచిత ఆన్‌లైన్ కోర్సులను డెవలప్‌చేశాయి.

ఇంట్రడక్షన్ టు ఏరోస్పేస్ ఇంజనీరింగ్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ రంగం పట్ల బేసిక్ అవగాహన కల్పించడానికి ఈ కోర్సును ప్రారంభించారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఎయిర్‌క్రాఫ్ట్, వాటి ఫీచర్స్, కాన్ఫిగరేషన్ సెలెక్షన్, టైప్స్ ఆఫ్ లోడ్స్, ఆపరేషనల్ ఇష్యూస్ తదితారాలన్నింటినీ బోధిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఎలిమెంట్స్ ఆఫ్ మెకానికల్ వైబ్రేషన్: ఢిల్లీ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. వైబ్రేషన్ థియరీ ఫండమెంటల్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్‌పుల్స్ తదిరాలు ఇందులో ఉం టాయి. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్, ఫ్లైట్ టెస్టింగ్, ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్ తదితరాలను వివరిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఎయిర్ క్రాఫ్ట్ స్టెబిలిటీ అండ్ కంట్రోల్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్‌ప్లేన్ స్టెబిలిటీ, కంట్రోల్ విషయాలను బోధిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

డిజైన్ టు ఫిక్స్‌డ్ వింగ్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 జూలై చివరి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

యూఏవీ డిజైన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ప్రొపల్షన్ థియరీ, ప్రాక్టికల్స్‌పై క్లాసులు ఉంటాయి. ఎయిర్ క్రాఫ్ట్, రాకెట్ ఇంజన్ల డిజైన్, ఆపరేషన్, ఇన్‌స్టాలేషన్, రిపెయిర్, మెయింటెనెన్స్‌పై అవగాహన పెంచుతారు.

అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పేస్ ఫ్లయిట్ మెకానిక్స్: ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది.

దిక్సూచి

గేట్ స్కోరు లేకుండా గౌహతి ఐఐటీలో ఎంటెక్

ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై గౌహతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) కొత్త ఎంటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై పనిచేసే వారిని ఉద్దేశించి ఈ కోర్సును ప్రారంభించినట్లు ఐఐటీజీ తెలిపింది. ఈ కోర్సులో చేరడానిని గేట్ స్కోరు అవసరం లేదు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు. సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహించే ఈ కోర్సు చేరాలనుకునేవారికి కనీసం ఒక సంవత్సరం వాటర్ రిసోర్స్ సెక్టార్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. అలాగే కనీసం 6 జీపీఏతో నాలుగు సంవత్సరాల గ్రాడ్యుయేషన్ కోర్సు(సివిల్/ అగ్రికల్చర్ అనుబంధ ఇంజనీరింగ్ కోర్సులు చేసి ఉండాలి. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా హైబ్రీడ్ మోడల్‌లో జరుగుతుంది. ఆన్‌లైన్‌లో క్లాసులు ఉంటాయి. ల్యాబ్‌లు, ఫైనల్ పరీక్షలు క్యాంపస్‌లో నిర్వహిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 31
వెబ్‌సైట్: www.iitg.ac.in/oes/odp/mtech/fwrm

జాబ్ కార్నర్

ఏపీపీఎస్సీలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

ఖాళీలు 691

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 691 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ 256, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ 435 పోస్టులు ఉన్నాయి.

అర్హత: ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇస్తారు.

వయస్సు: 2025 జూలై 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనల మేరకు వయస్సు సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్స్, మెడికల్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్టు 5
వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

ఎయిమ్స్‌లో

ఖాళీలు 3,501

దేశ వ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో 3,501 పోస్టుల భర్తీకి న్యూఢిల్లీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవన్నీ కూడా గ్రూప్-బీ, గ్రూప్-సీ కేడర్ నాన్ ఫ్యాకల్టీ పోస్టులు.

పోస్టులు: డైటీషియన్, అసిస్టెంట్ డైటీషియన్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, స్టాఫ్ నర్స్ లాబ్ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్, అటెండెంట్, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్ టెక్నీషియన్, అటెండెంట్ తదితరాలు ఇందులో ఉన్నాయి.

అర్హత: పోస్టును బట్టి టెన్త్, ఇంటర్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఈ, డీఎంఎల్‌టీ, బీఎంఎల్‌టీ, బీఫార్మసీ తదితరాలు ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత డిపార్ట్‌మెంట్ అనుభవం కూడా ఉండాలి.

వయస్సు: పోస్టును బట్టి 18 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయస్సు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ తదితరాలు ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 31
సీబీటీ పరీక్ష తేదీలు: 2025 ఆగస్టు 25, 26
వెబ్‌సైట్: https://rrp.aiimsexams.ac.in/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో

ఖాళీలు 3,717



కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద 3,717 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

పోస్టులు: అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-11/ ఎగ్జిక్యూటివ్. మొత్తం 3717 పోస్టులు ఉన్నాయి. అందులో అన్ రిజర్వుడు 1537, ఈడబ్ల్యూఎస్‌లో 442, ఓబీసీ 946, ఎస్సీ 566, ఎస్టీ 226 పోస్టులు ఉన్నాయి. ఇది జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ సీ పోస్టు(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టిరియల్)

విద్యార్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 10 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనలు అనుసరించి వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది. టైర్-1 వంద మార్కులకు ఉంటుంది. ఇందులో కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు కట్ చేస్తారు.
● టైర్-1 డిస్క్రిప్టివ్‌గా ఉంటుంది. దీనికి 50 మార్కులు. ఎస్సే, ఇంగ్లిష్ కాంప్రిహెన్షన్, లాంగ్ ఆన్సర్ తరహా ప్రశ్నలు ఉంటాయి. టైర్-3 వంద మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్టు 10 **వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మన చరిత్ర చెప్పాలనే ప్రయత్నం

- అశ్విన్ కుమార్



పురాణాల్లోని దశావతారాల ఆధారంగా తెరకెక్కుతోన్న 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి యానిమేషన్ త్రీడీ చిత్రం 'మహావతార్ నరసింహ'. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్ నిర్మించారు. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు.

● నరసింహ స్వామి అవతారం కేవలం ఒకపురాణ గాథ కాదు. మన చరిత్ర. దాని గురించి ప్రతి తరానికీ చెప్పాల్సిన అవసరం ఉంది. నేటి బాలలకు మన సంస్కృతి గురించి అవగాహన కలిగించేలా ఈ సినిమా ఉంటుంది. ఇప్పటివరకూ చూడని విజువల్స్‌ను బిగ్‌స్ర్కీన్ మీద చూడబోతున్నారు. వార్ సీక్వెన్స్‌లు చాలా అద్భుతంగా ఉంటాయి. సరికొత్త అనుభూతిని పంచుతాయి.

● భారీ బడ్జెట్‌తో మంచి నిర్మాణ విలువలతో తీసిన సినిమా ఇది. చరిత్ర, సంస్కృతి, ధార్మిక అంశాల మేళవింపుగా తెరకెక్కించాం. గీతా ఆర్ట్స్ తెలుగులో విడుదల చేయడం ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తుంది.

● శ్రీ మహావిష్ణువు దశావతారాలను బిగ్ కాన్వాస్‌లో చూపించాలనే ఆలోచనతో మహావతార్ యూనివర్స్ మొదలైంది. ఈ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. నటీనటుల ఇమేజ్ దేవుడి పాత్రలను డామినేట్ చేసే అవకాశం ఉంటుంది కాబట్టే యానిమేషన్‌లో అయితేనే ఇలాంటి కథకు న్యాయం చేయగలం అని భావించాం.

ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది



- ప్రవీణ పరుచూరి

'ఒక మంచి సినిమాను తీయడం దాన్ని ప్రేక్షకుల చెంతకు చేర్చడం చాలా కష్టం. ఎన్నో అడ్డంకులను అధిగమించి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. ప్రేక్షకాధరణ ఆనందాన్నిస్తోంది. మానవ సంబంధాల్ని చక్కగా చూపించారు అని అందరూ ప్రశంసిస్తున్నారు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. మనోజ్ చంద్ర, మోనిక హీరో హీరోయిన్లుగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతున్నారు. రామకృష్ణ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అయిన విధానం, సినిమాను ఆస్వాదిస్తున్న తీరు ఆనందాన్నిస్తోంది. నా సినీ గమనాన్నే మార్చిన పాత్ర చేశాను. మంచి సినిమాతో ప్రేక్షకులను అలరించాలనే కోరిక నెరవేరింది' అని అన్నారు. మనుషుల విలువల్ని, వారి మధ్య ఉండే భావోద్వేగాల్ని దర్శకురాలు తెరపై ఎంతో సహజంగా చూపించారు కాబట్టే సినిమా విజయవంతమైంది అని నిర్మాతలు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌ను కలసిన దుల్కర్ సల్మాన్



మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల జరిగిన గద్దర్ అవార్డుల వేడుకల్లో 'లక్కీ భాస్కర్' చిత్రానికి గాను దుల్కర్‌ను ఉత్తమ నటుడి పురస్కారం వరించిన విషయం తెలిసిందే. అయితే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి దుల్కర్ హాజరు కాలేకపోయారు. ఆదివారం దుల్కర్ సల్మాన్ తన టీమ్‌తో కలసి సీఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనతో పాటు నిర్మాతలు స్వప్న దత్, సుధాకర్ చెరుకూరి తదితరులు ఉన్నారు.



పవన్‌కు జోడీగా

హీరోయిన్ రాశీ ఖన్నా ఓ క్రేజీ ఆఫర్ దక్కించుకున్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండడంతో శ్రీలీలను ఇప్పటికే ఓ కథానాయికగా ఖరారు చేశారు. మరో కథానాయికగా రాశీని ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో జరుగుతున్న చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో పవన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటోంది. సినిమాలో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో ఆయన కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్, హరీశ్ కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.



బాలీవుడ్ నటుడు సోనూసూద్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ఒకటి ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ముంబైలోని తన నివాసం దగ్గర్లో విషపూరితం కాని ఒక పామును ఆయన ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ వీడియోను తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది మీరు ప్రయత్నించొద్దు. ఇటువంటి పరిస్థితి ఎదురైతే నిపుణులను సంప్రదించండి. జాగ్రత్తగా ఉండండి' అని పేర్కొన్నారు.

డాన్ దర్శకుడు చంద్ర బారోట్ కన్నుమూత



అమితాబ్ బచ్చన్ కథానాయకుడిగా నటించిన బాలీవుడ్ క్లాసిక్ హిట్ 'డాన్' దర్శకుడు చంద్ర బారోట్ (86) కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ నటించి, నిర్మించిన పలు చిత్రాలకు చంద్ర సహాయ దర్శకుడిగా పనిచేశారు. 'డాన్' సినిమాను అద్భుతంగా తెరకెక్కించి, తొలి చిత్రంతోనే ఇండస్ట్రీ హిట్‌ను అందుకున్నారు. 1990లో ఆయన తెరకెక్కించిన బెంగాలీ చిత్రం 'ఆశ్రిత' ప్రేక్షకాధరణ పొందింది. తన సినిమా కెరీర్ సజావుగా సాగకపోవడంతో చంద్ర బారోట్ సినిమాల నుంచి వైదొలగి అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో కొనసాగారు. 'డాన్' చిత్రం పలు భాషల్లో రీమేక్ అయింది. తెలుగులో ఎన్టీఆర్ హీరోగా 'యుగంధర్' పేరుతో తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. అమితాబ్ సహా పలువురు బాలీవుడ్ తారలు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.




తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇండస్ట్రీకి చెందిన మహిళా స్టంట్‌మాస్టర్స్‌ను సత్కరించింది. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్, సీనియర్ నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా అపూర్వ లాఖియా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అనే చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ వాసి కల్నల్ బికుమళ్ల సంతోష్‌బాబు జీవితం ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ను ఆగస్టు నుంచి ప్రారంభించనున్నారు. ముంబైలో జరిగే ఈ షెడ్యూల్‌తో సల్మాన్ ఖాన్ సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఇందులో కథానాయకుడి గతానికి సంబంధించిన ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆ తర్వాత లద్దాఖ్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఈ సినిమాలో శక్తిమంతమైన యుద్ధవీరుడిగా కనిపించేందుకు సల్మాన్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఇందుకోసం శిక్షణ కూడా తీసుకున్నారు.

అజిత్‌కు తప్పిన ప్రాణాపాయం



కారు రేసింగ్ పోటీల్లో పాల్గొన్న హీరో అజిత్ కుమార్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయన అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇటలీలో జీటీ4 కార్ రేసింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో అజిత్ కుమార్ రేసింగ్ జట్టు కూడా పాల్గొంటోంది. ఆ సందర్భంగా అజిత్ కుమార్ నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ పోటీల్లో ముందుభాగంలో దూసుకెళుతున్న కారు ఒకటి ఉన్నట్టుండి అడ్డుగా రావడంతో ఆ కారును అజిత్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. అయితే, అజిత్ మాత్రం అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆడిషన్ల పేరిట మోసాలను అడ్డుకోవాలి

రకరకాల పేర్లతో ఏర్పాటవుతున్న నకిలీ సినీ అసోషియేషన్లు ఆడిషన్ల పేరిట మోసాలకు పాల్పడుతున్నాయి, సినీ ఇండస్ట్రీకి చెందిన యూనియన్‌లు అన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఇలాంటి మోసాలను అడ్డుకోవాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సినీరంగం పట్ల ఆసక్తి ఉన్నవారు నిజమైన సినీ సంఘాలను సంప్రదించి, వారి ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టాల'ని సూచించారు. ఏపీలో కొన్ని చోట్ల ఆడిషన్ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూసేవాళ్లను అడ్డుకున్నామని తెలిపారు. ఎటువంటి అవగాహన లేకుండా కొందరు యూనియన్లు ఏర్పాటు చేసి చిన్న కళాకారులు, టెక్నీషియన్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారనీ దీనిపై చిత్ర పరిశ్రమ పెద్దలు స్పందించాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ వ్యవస్థాపకులు అంబటి మధుమోహన్ కృష్ణ కోరారు.



కథలు చెబుతున్నారా..?

తల్లిదండ్రులు రోజూ కథలు చెబుతూ ఉంటే పిల్లల్లో మానసిక వికాసం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఇలా రోజూ కథలు వినడం వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- కథ వింటూ పిల్లలు ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుంటారు. కథలో లీనమై జరగబోయేదాన్ని ముందుగానే ఊహిస్తూ ఉంటారు. దీనివల్ల వారిలో ఊహాశక్తి, సృజనాత్మకత పెరుగుతాయి.
- కథల్లోని పాత్రలకు ఎదురయ్యే కష్టాలు, వాటి నుంచి బయట పడిన విధానాలు.... పిల్లలను అమితంగా ఆకర్షిస్తాయి. వీటిని బాగా గుర్తుపెట్టుకుంటారు కూడా. దీంతో పిల్లలు స్వయంగా సమస్యలను పరిష్కరించుకోవడం ఎలాగో నేర్చుకుంటారు.
- ముఖంలో భావాలను పలికిస్తూ కథ చెబుతూ ఉంటే పిల్లలు శ్రద్ధగా వింటారు. ధ్యాస మొత్తాన్ని కథపైనే ఉంచుతారు. దీనివల్ల పిల్లల్లో ఏకాగ్రత, కుదురు పెరుగుతాయి.



- కథలోని పాత్రల పేర్లు, ఊళ్ల గురించి పిల్లలు సందేహాలు అడుగుతూ ఉంటారు. అప్పటి జీవన విధానం, వృత్తులు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణలపై ప్రశ్నలు వేస్తూ ఉంటారు. వీటి గురించి ఎప్పటికప్పుడు వివరంగా చెబుతూ ఉంటే భాషకు సంబంధించిన ఎన్నో పదాలను పిల్లలు తెలుసుకుంటారు.
- తరచూ చందమామ కథలు, కాశీ మజిలీ కథలు చెబుతూ ఉంటే...... సమాజం, కట్టుబాట్లు, క్షమ, దయ, నైతిక విలువల గురించి పిల్లలకు అర్థమవుతుంది. మంచి, చెడుల తారతమ్యాన్ని ఆలోచించడం మొదలుపెడతారు.
- పిల్లలు సాధారణంగా వినడం కంటే మాట్లాడడం మీదే దృష్టి పెడుతూ ఉంటారు. వీళ్ల దృష్టిని మరల్చే విధంగా కథ చెబితే క్రమంగా వినడం అలవాటు చేసుకుంటారు. అలాగే తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను కూడా శ్రద్ధగా వినగల్గుతారు.
- కథలు వినడం వల్ల పిల్లలకు లోకజ్ఞానం తెలుస్తుంది. నీతి, అవినీతి గురించి అవగాహన ఏర్పడుతుంది. సమాజంలో మెలగాల్సిన తీరు అర్థమవుతుంది. భావోద్వేగాలు పరిచయమవుతాయి. సొంతంగా ఆలోచించే సామర్థ్యం పెరుగుతుంది.
- కథలు వింటూ ఉంటే పిల్లలకు చదవాలనే ఆసక్తి కలుగుతుంది. కథల పుస్తకాలు తీసుకుని సొంతంగా చదవడం ప్రారంభిస్తారు. దీంతో పిల్లలకు పుస్తక పఠనం అలవడుతుంది.

మరణం అంచుల వరకు వెళ్లింది. విధిని ఎదిరించి ధైర్యంగా నిలబడింది. ప్రమాదంలో కుడి చేయి కోల్పోయినా.. ఆత్మవిశ్వాసంతో అపురూప విజయాలు అందుకుంది. 'ప్రపంచ పారా గ్రాండ్ ప్రీ'లో రెండు స్వర్ణాలు గెలిచి.. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది వలసంగారి భవాని. మారుమూల పల్లె నుంచి వచ్చి.. పడి లేచిన కెరటంలా సంచలనాలు నమోదు చేస్తున్న ఈ పారా అథ్లెట్.. తన క్రీడా ప్రయాణం గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చింది.

పడి లేచిన కెరటంలా...
గెలిచి నిలిచి

"అది 2009... సెప్టెంబరు. అప్పుడు నాకు తొమ్మిదేళ్లు. ఇంటి బయట ఆగి ఉన్న లారీ పైకెక్కి ఆడుకుంటున్నా. సరదాగా గెంతుతుండగా నా కుడి చేయి విద్యుత్ తీగలకు తాకింది. షాక్ కొట్టి లారీలో పడిపోయా. గమనించిన మా నాన్న చంద్రయ్య నన్ను కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయన విద్యుదాఘాతానికి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. అపస్మారక స్థితిలో ఉన్న నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. చేతికి వెంటనే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. రూ.1.75 లక్షలు అవుతుందన్నారు. ఎలాగో కట్టాం. నా కుడి చేతి నరాలకు సర్జరీ చేశారు కానీ, విజయవంతం కాలేదు. ఆరు రోజుల తర్వాత... భుజం వరకు చేతిని తొలగించకపోతే గుండెకు ప్రమాదమన్నారు. చెయ్యి తీసేశారు. ఎడమ తొడ, కాళ్ల వేళ్లు, అరికాళ్లకు కూడా చాలా గాయాలయ్యాయి. 25 రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. వైద్యానికి మొత్తంగా రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యాయి. అన్నయ్య, అమ్మ కలిసి ఆ అప్పు తీర్చడానికి చాలా కష్టపడ్డారు. ఆస్పత్రిలో, ఇంటికి వచ్చాక మా పెద్దమ్మ లింగమ్మ నన్ను కంటికి రెప్పలా చూసుకుంది. నాకు ధైర్యం చెప్పింది.

ఏడాది వరకు..

కోలుకున్నాక 'నాన్న ఎక్కడ'ని అడిగితే... చేపల వేటకు చెన్నై వెళ్లారని, త్వరలోనే వచ్చేస్తారని ఇంట్లో వాళ్లు చెబుతూ వచ్చారు. దాదాపు ఏడాది తరువాత కానీ నాకు తెలియలేదు. నాన్న ఇక లేరని. నాన్నే లోకంగా బతికిన నేను ఆ విషాదాన్ని జీర్ణించుకోలేకపోయాను. ఇప్పటికీ ఆయన నా వెంటే ఉంటారని నమ్ముతాను. నెల్లూరు జిల్లా సర్వేపల్లిలోని ముత్తుకూరులో ఓ మత్స్యకార కుటుంబం మాది. నాన్న చంద్రయ్య, అమ్మ బుజ్జమ్మ వ్యవసాయ కూలీలు. వ్యవసాయ పనులు లేనప్పుడు నాన్న చేపల వేటకు వెళ్లేవారు. అన్నయ్య వెంకటేశ్వర్లు డ్రైవర్.

నాకు నేను ధైర్యం చెప్పుకొని...

చిన్నప్పటి నుంచీ క్రీడల్లో పాల్గొనేదాన్ని. ఖోఖో, కబడ్డీ, పరుగు పోటీల్లో ముందుండేదాన్ని. ప్రమాదానికి ముందు 4-100 రిలేలో పాల్గొని రజత పతకం సాధించా. నాన్నకు ఆ మెడల్ చూపిస్తే భుజాలపై ఎక్కించుకొని ఊరంత తిప్పి, అందరికీ చెప్పి సంబరపడ్డారు. ఆయన ఆనందం చూసి... ఎప్పటికైనా మంచి క్రీడాకారిణి కావాలని కలలు కన్నా. కానీ విద్యుద్ఘాతంతో ఆటలకు దూరమవ్వాల్సి వచ్చింది. పదో తరగతి వరకు పోయిన చెయ్యి తిరిగి వస్తుందని అనుకునేదాన్ని. ఆ తర్వాత కానీ తెలియలేదు బతికినంత కాలం ఒంటి చేత్తోనే నెట్టుకురావాల్సి వస్తుందని. పోలీసు అవ్వాలనేది నా చిన్ననాటి కోరిక. ఇక అది సాధ్యం కాదని తెలిసి ఎంతో బాధపడ్డాను. అలాగని కుంగిపోలేదు. డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ఉండగా.. నెల్లూరు స్టేడియంలో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ నిర్వహిస్తారని తెలిసింది. 2019లో జరిగిన ఆ పోటీల్లో 100, 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో పాల్గొని మూడు పసిడి పతకాలు గెలిచాను. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాను.

బలంగా నిశ్చయించుకున్నా..

జిల్లా స్థాయి పోటీలంటే ఏదో నాకున్న ఆసక్తితో బరిలోకి దిగి పతకాలు నెగ్గా. కానీ రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత సాధించడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. క్రీడలనే కెరీర్‌గా మలుచుకోవాలని ఆ క్షణమే బలంగా నిశ్చయించుకున్నా. రాష్ట్ర స్థాయిలో రాణించాలంటే కోచింగ్ అవసరం. దాంతో నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలోని శాప్ కోచ్ షేక్ జాసీంను కలిశాను. నా పట్టుదల, సామర్థ్యం చూసి సాధారణ అథ్లెట్లతో కలిపి సార్ నాకు శిక్షణ ఇచ్చారు. ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 100, 200 మీటర్ల స్ప్రింట్, లాంగ్‌జంప్ ఈవెంట్లలో స్వర్ణ పతకాలు సాధించాను. ఈ విజయం జాతీయ స్థాయి పోటీలకు కావల్సినంత స్ఫూర్తినిచ్చింది. 2021లో బెంగళూరులో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్‌జంప్‌లో రజతాలు, 200 మీటర్ల పరుగులో కాంస్యం గెలిచాను.

మలుపు తిప్పిన పోటీ...

జాతీయ స్థాయిలో నేను సాధించిన తొలి పతకాలు ఇవే కావడంతో వాటిని చూసి అమ్మ ఎంతో సంబరపడింది. అప్పటి నుంచి ఈ ఏడాది వరకు జరిగిన ఖేలో ఇండియా పారా అథ్లెటిక్స్, జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధిస్తూనే ఉన్నా. అయితే నా కెరీర్‌ను మలుపు తిప్పింది మాత్రం రెండేళ్ల కిందట థాయ్‌లాండ్‌లో జరిగిన 'వరల్డ్ ఎబిలిటీ పారా గేమ్స్'. టీ-46 కేటగిరీలో 100, 200 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు గెలిచాను. నా కెరీర్‌లో ఇవే తొలి అంతర్జాతీయ మెడల్స్. తాజాగా ఈ నెలలో చెక్ రిపబ్లిక్‌లో నిర్వహించిన 'ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీ' 100 మీటర్ల రేసును 13.70 సెకన్లలో, 200 మీటర్ల రేసును 29.07 సెకన్లలో పూర్తి చేసి రెండు స్వర్ణ పతకాలు సాధించాను. 34 దేశాలకు పైగా అథ్లెట్లు తలపడిన ఈ మెగా ఈవెంట్‌లో గట్టి పోటీ ఎదురైంది. అన్నిటినీ దాటి రెండు స్వర్ణ పతకాలు సాధించిన తొలి భారతీయురాలిని నేనే అంటే గర్వంగా ఉంది. కెరీర్‌లో ఇప్పటివరకు ఇరవైకి పైగా పతకాలు గెలిచాను.

ప్రస్తుత లక్ష్యం...

గత వారం బెంగళూరు వేదికగా జరిగిన ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ పోటీల్లో 100, 200 మీటర్ల స్ప్రింట్‌లో రెండు రజత పతకాలు సాధించా. ప్రస్తుతం నేను పోటీ పడే రెండు విభాగాల్లో 100 మీటర్లలో 11.97 సెకన్లు, 200 మీటర్లలో 27.92 సెకన్లు ప్రపంచ అత్యుత్తమ టైమింగ్‌గా ఉంది. నా వ్యక్తిగత టైమింగ్ 13.56 సెకన్లు, 29.05 సెకన్లు. మరింత అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ తీసుకొని దీన్ని మెరుగు పర్చుకోవాల్సి ఉంది. వచ్చే ఏడాది జపాన్‌లో జరిగే ఆసియా పారా క్రీడల్లో దేశానికి స్వర్ణ పతకం అందించాలనే పట్టుదలతో సాధన చేస్తున్నా."

● ఎస్.ఎస్.బి. సంజయ్





అదొక్కటే ఆధారం..

అమ్మ కిడ్నీల వ్యాధితో బాధపడుతోంది. కూలీ పనులకు వెళ్ల లేకపోతోంది. నాకు వచ్చే రూ.6 వేల పింఛన్, అమ్మకు వచ్చే రూ.4 వేల వితంతు పింఛనే మేము బతకడానికి ఆధారం. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలంటే ఈవెంట్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. నా డైట్‌కు కూడా కష్టమవుతోంది. మా ఊరు నుంచి నెల్లూరు 30 కిలోమీటర్లు. ఉదయం ఐదున్నరకు బస్సు ఎక్కితే, గంట ప్రయాణం తర్వాత స్టేడియానికి చేరుకొంటా. రెండు గంటలు సాధన తరువాత మళ్లీ ఇంటికి చేరేసరికి గంట పడుతుంది. మళ్లీ మధ్యాహ్నం 3.30కు వెళ్లి 7.30కు వస్తాను. రోజు 4 గంటలు ప్రయాణం చేయాల్సి వస్తోంది. దగ్గర్లో సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో నెలలో రెండుసార్లు గుంటూరు వెళ్లి నాగార్జున యూనివర్సిటీలో సాధన చేస్తున్నా. ఎంసీఏ చదవాలని ఉంది. యూనివర్సిటీలో ఫ్రీ సీటు ఇస్తే అక్కడే చదువుకుంటూ సాధన చేస్తాను.

చేయూత కోసం..

ఇప్పటివరకు నేను సాధించిన పతకాలకు రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాలసీ, జీఓలు ప్రకారం సుమారు రూ.20 లక్షలు రావాల్సి ఉంది. చంద్రబాబు గారి ప్రభుత్వం వచ్చాక రూ.2 లక్షలు ఇచ్చారు. చెక్ రిపబ్లిక్ పోటీల్లో పాల్గొనేందుకు రూ.1.96 లక్షలు ఖర్చు కాగా శాప్ ఛైర్మన్ రవినాయుడు గారి చొరవతో ఎన్ఆర్ఐ సెల్ ద్వారా రూ.1 లక్ష సాయం అందించారు. పెండింగ్ బకాయిలు విడుదల చేస్తే నా కష్టాలు కొన్ని అయినా తీరుతాయి. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకయ్యే ఖర్చులను సర్కార్ భరిస్తే దేశానికి మరిన్ని పతకాలు అందిస్తా. ఇక, నాకు క్రీడల్లో ధోనీ, హీరోల్లో బాలకృష్ణ అంటే చాలా ఇష్టం. జీవితంలో ఒకసారైనా వారిద్దరినీ కలవాలనేది నా ఆకాంక్ష.

వెండి మొక్క



ప్రకృతిలో మనకు అవసరమైనవన్నీ ఉంటాయి. కానీ కొన్నిసార్లు మనమే గుర్తించలేకపోతాం. అలాంటిదే అలాంగియం సాల్విఫోలియం మొక్క. అనారోగ్యానికి ఔషధంగానే కాక వెండి నానో కణాల తయారీకి ఉపయోగపడుతుంది ఇది. ఈ మొక్క గురించి వివరాలు తెలుసుందాం..

దీనిని అంకోల్ చెట్టు, ఊడుగ చెట్టు అని కూడా అంటారు. ఇది భారత్, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్, ఆగ్నేయాసియాలోని కొన్ని ప్రాంతాల్లో పెరుగుతుంది. తూర్పు కనుమలలోని అడవుల వద్ద ఈ మొక్క ఎక్కువగా కనిపిస్తుంది. ఇది 10 నుంచి 12 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఈ మొక్కకు లేత పసుపు రంగు ఆకర్షణీయమైన పువ్వులు పుస్తాయి. సువాసన వెదజల్లే ఈ పూలు వేసవిలో వికసిస్తాయి. ఈ మొక్కకు బెర్రీ రంగు పండ్లు కాస్తాయి. ఈ పండ్లలో ఒకేఒక్క విత్తనం ఉంటుంది. ఈ పండును సంప్రదాయ వైద్యంలో, ఆయుర్వేదంలో వినియోగిస్తారు. జ్వరం, వాపులు, జీర్ణ సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తారు. ఈ పండ్ల జీవ సంబంధ సమ్మేళనాలలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ మైక్రోబయల్ లక్షణాలు ఉండొచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ మొక్క దాహాన్ని తగ్గించడంలోనూ ఉపయోగపడుతుంది. ఈ చెట్టు పండు ఒక్కదానిని తింటే మండే ఎండాకాలంలోనైనా సరే 3-4 గంటల పాటు దాహం వేయదు. ఈ మొక్క ఆకులను వెండి నానో కణాల తయారీ ప్రక్రియలో వాడతారు.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్
drananthanenisreenath@gmail.com.

మునగాకుతో జుట్టుకు పోషణ



జుట్టు ఆరోగ్యంగా ఉండడం కోసం రకరకాల హెయిర్‌ప్యాక్‌లు వాడుతుంటారు. అయితే మునగాకు పొడితో తయారు చేసిన ప్యాక్ వలన జుట్టుకు పోషణ అంది ఆరోగ్యంగా మారుతుంది. ఆ వివరాలు తెలుసుకుందాం..

- మునగాకులో విటమిన్ బి, సి, జింక్, ఐరన్, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి కుదుళ్ల సమస్యలను దూరం చేసి జుట్టు ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.
- మునగాకు పొడి చుండ్రు, దురద వంటి సమస్యలకు విరుగుడుగా పనిచేస్తుంది.
- మునగాకులోని జింక్ కుదుళ్లలో సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది.
- యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కుదుళ్ల సమస్యలను దూరం చేస్తాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి... ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి తెల్లజుట్టు రాకుండా సహాయపడతాయి.
- మునగాకు పొడిలో ఉండే బెహెలిక్, ఓలియిక్ ఆమ్లాలు జుట్టు ఆరోగ్యాన్ని కాపాడి కురులు పెరిగేలా సహాయపడతాయి.


ఇలా తయారు చేయాలి : ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, మరో టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. ఇందులో కొంచెం పెరుగు వేసి మెత్తని పేస్టులా కలపాలి. దీనిని కుదుళ్లకు బాగా పట్టేలా ప్యాక్‌లా వేసుకోవాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఇంటి పనులు త్వరగా పూర్తవడం కోసం ఈ రోజుల్లో చాలామంది ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు ఉపయోగిస్తున్నారు. అయితే అవి ఎక్కువకాలం పనిచేయాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. అవేంటో తెలుసుకుందాం..



మిక్సీ: చట్నీలు, పిండి, మసాలాలు వంటివి రుబ్బడానికి అనువుగా ఇప్పుడు అందరి ఇళ్లల్లో మిక్సీ ఉంటోంది. అయితే చాలా మంది మిక్సీ జార్‌లను వాడిన తర్వాత సింక్‌లో పడేసి చాలా సమయం తరువాత శుభ్రం చేసుకుంటారు. అయితే ఇలా చేయడం వలన బ్లేడులు మొద్దుబారిపోతాయి. అలాగే గిన్నెల్లో మరకలు అంటుకుపోతాయి. అందుకే మిక్సీ జార్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. బ్లేడ్‌లు పదును తగ్గినట్లు అనిపిస్తే జార్‌లో కల్లుప్పు(క్రిస్టల్ సాల్ట్) వేసి మిక్సీ పట్టాలి. ఇలా చేస్తే బ్లేడ్‌లు పదునుగా మారతాయి. అలాగే మరకలు పడ్డాయని మిక్సీని నీటితో కడుగకూడదు. తడి గుడ్డతో తుడిచి శుభ్రం చేసుకోవాలి.



రైస్ కుక్కర్ : అన్నం పొంగడం, పక్కనే ఉండి చూసుకోకపోతే మాడిపోవడం వంటి సమస్యలకు పరిష్కారంగా రైస్ కుక్కర్ వాడుతున్నారు. అయితే ఈ కుక్కర్ వాడేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోకపోతే చాలా ప్రమాదం. కుక్కర్ గిన్నెను కుక్కర్‌లో పెట్టేముందు గిన్నె కింద భాగం తడి లేకుండా చూసుకోవాలి. అలాగే కుక్కర్ మీద అన్నం పొంగి మరకలు పడినా ఎట్టిపరిస్థితుల్లోనూ నీటితో కడగకూడదు. కుక్కర్ వైర్‌ను ప్లగ్ తీసేసి వస్త్రంతో కుక్కర్ మీది మరకలను తుడిచేయాలి.



ఫ్రిడ్జ్ : కూరగాయలు, కూరలు, పాలు వంటివి పాడవకుండా నిల్వ చేయడానికి ఫ్రిడ్జ్‌ను వాడుతుంటాం. అయితే చాలామంది ప్రతీ ఆహార పదార్థాన్ని ఫ్రిడ్జ్‌లో పెట్టేస్తారు. అలా చేయకూడదు. బయట నిల్వ ఉండే వాటిని బయటే ఉంచాలి. అలాగే ఫ్రిడ్జ్‌లో వేడి వేడి పదార్థాలను పెట్టకూడదు. గిన్నెల మీద మూత పెట్టకుండా ఆహారాన్ని ఫ్రిడ్జ్‌లో పెట్టకూడదు. ఒకవేళ అలా పెడితే ఆ పదార్థం వాసన మిగిలిన ఆహార పదార్థాలకు పడుతుంది. ఊరెళుతున్నాం కదా అని ఫ్రిడ్జిని స్విచ్ఛాఫ్ చేసి వెళ్లకూడదు. ఒకవేళ అలా ఫ్రిడ్జ్ ఆపాలి అనుకుంటే అందులోని వస్తువులన్నీ తీసేసి లోపల తడి లేకుండా ఆరబెట్టి ఫ్రిడ్జ్ డోర్ వేసేయాలి.



వాషింగ్ మెషీన్ : వాషింగ్ మెషీన్‌ను సక్రమంగా ఉపయోగిస్తే అది ఎక్కువకాలం చక్కగా పని చేస్తుంది. రెండు మూడు రోజులు బట్టలు వేయడం కుదరలేదని ఆ మొత్తం బట్టలు ఒకేసారి వాషింగ్ మెషీన్‌లో వేసేయకూడదు. లోడ్‌కు మించి ఎక్కువ బట్టలు వేస్తే వాషింగ్ మెషీన్ పాడైపోతుంది. వారానికి ఒకసారి కచ్చితంగా డ్రమ్ శుభ్రం చేయాలి. అలాగే పైప్‌లు, ఫిల్టర్, రబ్బరును తరచూ శుభ్రం చేయాలి.

ఉల్లి పంట... దాని ధర అమాంతంగా పెరిగి జనం కంట నీరు తెప్పిస్తుంది. హఠాత్తుగా పతనమైపోయి రైతులకు ఆవేదన మిగుల్చుతుంది. దీనికి కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన 23 ఏళ్ల కల్యాణి రాజేంద్ర షిండే సరికొత్త పరిష్కారంతో ముందుకొచ్చారు. ఆమె తీసుకున్న చొరవ రైతుల నష్టాలను భారీగా తగ్గించి... నికరమైన ఆదాయానికి భరోసా ఇస్తోంది.

ఆనియన్ క్వీన్



"మా నాన్నంటే నాకు ప్రాణం. ఎప్పుడూ సరదాగా, నవ్విస్తూ ఉండే ఆయన దిగాలుగా ఉంటే ఎంతో బాధగా ఉండేది. అలాంటి సందర్భాలు రాకూడదని దేవుణ్ణి కోరుకొనేదాన్ని. కానీ "ఈ ఏడాది కూడా నష్టమేనమ్మా!" అని ఆయన కన్నీళ్ళు ఆపుకొంటూ చెబుతుంటే మా ఇంటిల్లిపాదికీ ఏడుపొచ్చేది. ఇది మా ఒక్కరి కథ కాదు... లక్షలమంది ఉల్లి రైతుల వ్యథ. మహారాష్ట్రలోని లాసల్‌గావ్... ఆసియాలోనే అతి పెద్దదైన ఉల్లిపాయల హోల్‌సేల్ మార్కెట్. నేను ఆ ఊర్లోనే పుట్టాను. మా ప్రాంతంలో దాదాపు రైతులందరూ ఉల్లి సాగుచేస్తారు. వారిలో మా నాన్న కూడా ఒకరు. ఉల్లి పంట వేసినప్పటి నుంచి కోతకు వచ్చేసరికి దాదాపు నాలుగు నెలల సమయం పడుతుంది. ఆ తరువాత వాటిని ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు నిల్వ ఉంచుతారు. సరుకు దెబ్బతింటే... ధరల్లో ఎనిమిది వందల శాతం హెచ్చుతగ్గులు చోటు చేసుకోవడం నేను గమనించాను. మార్కెట్‌లో హఠాత్తుగా చోటు చేసుకొనే ఒడుదొడుకుల కారణంగాను, సరుకు దెబ్బతినడం వల్లా రైతులు తీవ్రమైన నష్టాలకు గురవడం సాధారణమైపోయింది. ఇవన్నీ చూస్తూ పెరిగాను. 'రైతుల కష్టాలు తీరే మార్గం లేదా?' అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని.

ఆ నష్టం దేశానిది కూడా...

నాసిక్‌లో 2018లో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు... టీసీఎస్ ఫౌండేషన్ నిర్వహణలోని ఓపెన్ సోషల్ ఇనీషియేటివ్ సెంటర్... 'డిజిటల్ ఇంపాక్ట్ స్క్వేర్'కు ఎంపికయ్యాను. సామాజికమైన వివిధ సవాళ్ళను పరిష్కరించడానికి డిజిటల్ సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన సంస్థ ఇది. దాని ద్వారా రైతుల సమస్యలను క్షేత్ర స్థాయిలో శాస్త్రీయంగా అధ్యయనం చేసే అవకాశం దొరికింది. మన దేశంలో ఉత్పత్తి అయ్యే ఉల్లి పంటలో 40 నుంచి 50 శాతం వరకూ వినియోగదారులకు చేరేలోగానే పాడవుతోంది. అది ప్రతీ ఏడాది అయిదు కోట్ల మంది వినియోగించే పంటతో సమానం. దేశ ప్రజల అవసరాలకు మించిన ఉత్పత్తిని మన రైతులు చేస్తున్నారు. కానీ పంట కోత తరువాత తలెత్తే పరిస్థితులు వారు నష్టపోవడానికి దారి తీస్తున్నాయి. సంప్రదాయమైన గిడ్డంగుల్లో నిల్వ చేయడం, ఆధునికమైన పర్యవేక్షణ పద్ధతులు అనుసరించకపోవడం లాంటి కారణాల వల్ల... పంట లోలోపలే కుళ్ళిపోతోంది. మరింత వివరంగా చెప్పాలంటే... పంట కుళ్ళిపోయిందా? లేదా? అని నిర్ధారించడానికి రైతులు తమ వాసన శక్తి మీద తరచుగా ఆధారపడుతున్నారు. కానీ కుళ్ళిన వాసన వచ్చేసమయానికి సగం పంట పనికిరాకుండా పోతోంది. ఈ నష్టం విలువ ప్రతి సంవత్సరం సుమారు రూ.40 వేల కోట్లు. ఈ నష్టం కేవలం రైతు కుటుంబాలదే కాదు, దేశానిది కూడా. ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలనుకున్నాను. దానికోసం తీవ్రంగా పరిశోధన చేశాను.

సాంకేతికతపై అవగాహనతో....



రైతు సంఘాలు, మీడియా నన్ను 'ఆనియన్ క్వీన్' అని పిలుస్తున్నాయి. దానికన్నా... మా నాన్నలాంటి ఎందరో రైతులను నష్టాల ఊబి నుంచి కాపాడగలగడం నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. రైతులకు కొత్త సాంకేతికతలను పరిచయం చేసి, వాటిపై అవగాహన కలిగిస్తే... ఎన్నో అద్భుతాలు జరుగుతాయని నా నమ్మకం. అది నిజమని నా ప్రయత్నం రుజువు చేస్తోంది.

ముందే హెచ్చరిస్తుంది...

అయిదేళ్ళ క్రితం నాసిక్ నుంచి లాసల్‌గావ్‌కు తిరిగి వచ్చి 'గోదామ్ ఇన్నోవేషన్స్' అనే అనే అగ్రిటెక్ స్టార్టప్‌ను ఏర్పాటు చేశాను. కేవలం రూ. మూడు లక్షల నిధులతో ఇది మొదలైంది. ఉల్లిపాయలు దెబ్బతినడాన్ని ముందుగానే గుర్తించేందుకు... ఒక ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సాంకేతికతతో... ఒక చిన్న పరికరానికి రూపకల్పన చేశాను. దానికి 'గోదామ్ సెన్స్' అనే పేరు పెట్టాను. ఈ తరహా పరికరం తయారీ దేశంలోనే తొలిసారి. ఉల్లిపాయలు నిల్వ చేసే గోదాముల్లో దీన్ని అమర్చితే... నిశ్శబ్ద సంరక్షకుడిలా గమనిస్తూ ఉంటుంది. ఉష్ణోగ్రతలను, తేమను నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఉల్లిపాయలు పాడవడం ప్రారంభమైన తొలి దశలో... వాటి నుంచి కొన్ని వాయువులు వెలువడతాయి. మొత్తం సరుకులో ఒక శాతం పాడవడం మొదలైనా సరే... ఆ పరికరం హెచ్చరికలు పంపుతుంది. సరుకు బాగా దెబ్బతిన్న తరువాత మేలుకొనేకన్నా... ముందుగా గుర్తించడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ఈ పరికరాన్ని అమర్చి చూశాం. ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో... ఆ వివరాలను ప్రభుత్వ సంస్థల దృష్టికి తీసుకువెళ్ళాం. వాటి నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఇప్పుడు 'డైరెక్టరేట్ ఆఫ్ ఆనియన్ అండ్ గార్లిక్ రీసెర్చ్' (డిఓజిఆర్), భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) తదితర సంస్థలు మాకు భాగస్వాములుగా ఉన్నాయి. భారీ, మధ్యతరహా, చిన్న తరహా రైతుల అవసరాల మేరకు... నెలవారీ ఛార్జీలతో గోదాముల్లో 'గోదామ్ సెన్స్' పరికరాలను అమరుస్తున్నాం. వాటి ద్వారా కనీసం 30 నుంచి 40 శాతం నష్టాన్ని రైతులు నివారించుకోగలుగుతున్నారు. దానికోసం పాత గోదాములనే కొత్తగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు పలు రాష్ట్రాల్లో... ఉల్లి నిల్వ చేసే చాలా గోదాముల్లో ఈ పరికరాన్ని వినియోగిస్తున్నారు. తద్వారా వారికి నష్టం తగ్గి... నికరమైన ఆదాయం లభిస్తోంది."

జగన్, భారతిలే ప్రధాన సూత్రధారులు
మిథున్‌రెడ్డి బంటు మాత్రమే..: కాంగ్రెస్

» లిక్కర్ మాఫియా కోటి కుటుంబాలను నాశనం చేసింది: ఠాకూర్



న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి బంటు మాత్రమేనని, అసలైన ప్రధాన సూత్రధారులు వైఎస్ జగన్, భారతి అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్యం ఠాకూర్ ఆరోపించారు. జగన్ మద్యం మాఫియా ఆంధ్రప్రదేశ్‌లో కోటి పేద కుటుంబాలను నాశనం చేసిందని ఆదివారం 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. జగన్ అండ్ కో రూ.3,500 కోట్ల లంచాల కోసం హానికరమైన మద్యాన్ని ప్రోత్సహించారని ఆరోపించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిన కుంభకోణం కాదని, జగన్ ఎంతో పకడ్బందీగా, ప్రణాళికతో చేసిన ఆపరేషన్ అన్నారు. నాసిరకం మద్యం బ్రాండ్లను గుర్తించి, పంపిణీ ప్రణాళికను రచించి, కిక్ బ్యాక్‌లపై ముందుగానే చర్చించుకుని, నకిలీ సంస్థలను సృష్టించి, దోపిడీని చట్టబద్ధంగా చేయడానికి కొత్త మద్యం పాలసీ తెచ్చారని ఆరోపించారు. జగన్, ఆయన భార్య భారతి, కొంతమంది మంత్రులు, వారితో కలిసి పనిచేసిన కాంట్రాక్టర్లు లబ్ధి పొందారని ఆరోపించారు. 2019-24మధ్య కనీసం రూ.3,200 కోట్లు మళ్లించినట్లు సిట్ దర్యాప్తు చెబుతోందని, ఐదేళ్లలో దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణం జరిగిందన్నారు. ఆ డబ్బును గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు, మద్యం పంచేందుకు, ఓటర్లకు డబ్బులు ఇచ్చేందుకు వినియోగించారని ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ, రాజకీయ నేతల మధ్య సమన్వయం చేయడంలో చీఫ్ ఆపరేటర్ అవతారంలో మిథున్‌రెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. ఇది జగన్ చేసిన మొదటి స్కామ్ కాదని, సీబీఐ లెక్కల ప్రకారం రూ. 43 వేల కోట్ల అక్రమ ఆస్తుల కేసుల్లో ఇప్పటికీ ప్రధాన నిందితుడని గుర్తు చేశారు. 16 నెలలకు పైగా జైలులో ఉన్నారని అన్నారు. జగన్.. ఇసుక మాఫియా, మైనింగ్, భూ కేటాయింపులు, అమరావతి చుట్టూ ఇన్ సైడ్ ట్రేడింగ్. దీనికి తోడు ప్రజాధనాన్ని సైతం తాకట్టుపెట్టి మద్యం దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. జగన్ బాధితులు అందరూ పేదలు, మాట్లాడలేని అమాయకులు, ఒంటరివారని తెలిపారు.

ఢిల్లీ స్కాంను తలదన్నేలా ఏపీ కుంభకోణం: మాధవ్



న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం స్కాంను తలదన్నేలా ఏపీలో మద్యం కుంభకోణం జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆరోపించారు. ఆప్, బీఆర్ఎస్‌లకు చెందిన కీలక వ్యక్తులు అరెస్టు అయ్యారని, ఈ కుంభకోణంలో భాగస్వాములైన ప్రతిఒక్కరిపైనా చర్యలు ఉంటాయని తెలిపారు. ఆదివారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లిక్కర్ స్కాంలో కీలక వ్యక్తి మిథున్ రెడ్డి అరెస్టును స్వాగతిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవస్థీకృతంగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో బీజేపీ జెండాను ఎగరేయడమే లక్ష్యమని, ప్రత్యేకంగా రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 27 నుంచి కడప వేదికగా యాత్రలు ప్రారంభిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా యాత్రలు కొనసాగుతాయని చెప్పారు. అంతకు ముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మాధవ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

పార్లమెంట్‌లో లేవనెత్తుతాం: ఎంపీ లావు



న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం గురించి పార్లమెంట్ లో లేవనెత్తుతామని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఆదివారం ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏపీలో రూ.3,500 కోట్ల మద్యం స్కాం జరిగిందని, దానిపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన, దేశమంతా తెలియాల్సిన అవసరముందని చెప్పారు. గతంలో వందకోట్ల రూపాయల పశుగ్రాసం కుంభకోణంపైనా పార్లమెంట్ చర్చ జరిగిందని గుర్తు చేశారు. ప్రధాని ధనధాన్య పథకంపై చర్చ జరగాలని అన్నారు. పొగాకు, మామిడి రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి ఆదుకుందని, ఈ నేపథ్యంలో రైతులను మరింత ఆదుకోవాలని కోరారు. జల జీవన్ మిషన్‌పై కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాలని కోరామన్నారు. గతంలో కేంద్రం రూ.4 వేల కోట్లు ఈ పథకం కింద రాష్ట్రానికి కేటాయిస్తే రూ.2 వేల కోట్లే గత ప్రభుత్వం వినియోగించుకుందని, చాలావరకు నిధుల మళ్లింపు జరిగిందని చెప్పారు. గోదావరి, పెన్నా నదులను అనుసంధానించే ప్రయత్నాలను ఏపీ చేస్తోందన్నారు. కేంద్రం నిధులిస్తే కార్యరూపం దాల్చే అవకాశం ఉందన్నారు. సామాజిక మాధ్యమాల్లో మహిళలకు వ్యతిరేకంగా వచ్చే పోస్టులను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు.

నువ్వసలు మనిషివేనా?.. సజ్జలపై కలిశెట్టి ఫైర్

నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిందే కాకుండా తమ మద్య విధానానికి ప్రజామోదం లభించిందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడడం చూస్తూ అసలు ఆయన మనిషేనా అన్న అనుమానం కలుగుతోందని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం స్కాంకు ఆధారాలు లేవనడం ఆయన తెలివి తక్కువతనానికి నిదర్శనమని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2019 వరకు డిస్టిలరీస్ లేని అదాన్ సంస్థకు వైసీపీ ప్రభుత్వం రూ.800 కోట్ల ఆర్డర్లు ఎలా ఇచ్చారని కలిశెట్టి ప్రశ్నించారు. మద్యం స్కామ్ జరగకపోతే ఆన్లైన్ లావాదేవీలను కాకుండా నగదు లావాదేవీలను ఎందుకు తప్పనిసరి చేశారని ప్రశ్నించారు.

చట్టం తన పని తాను చేస్తోంది: బాలశౌరి



ఏపీ మద్యం కుంభకోణంలో చట్టం తనపని తాను చేస్తోందని, మిథున్ రెడ్డి అరెస్టుకు రాజకీయాలతో సంబంధం లేదని జనసేన పార్లమెంటరీ పార్టీ నేత బాలశౌరి అన్నారు. ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన హామీలపై చర్చ జరగాలని, హామీలన్నీ అమలు చేయాలని కోరారు. జల జీవన్ మిషన్ పథకాన్ని పొడిగించాలని, రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరినట్టు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు త్వరగా పూర్తి చేస్తే తాగునీటికి, సాగుకు ఉపయోగపడుతుందన్నారు.

బయటికొస్తున్న పెద్ద తిమింగలం: కొల్లు



ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని, ఇందులో పెద్ద తిమింగలం ఎవరనేది త్వరలోనే బయటికి రానుందని గనులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లిలో ఆదివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి కనగానపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా.. అని ప్రజలను ఆరా తీశారు.అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మద్యంలో రూ.3,500 కోట్ల స్కాం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో నాయకులంతా దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకుని స్కాంలు చేశారని రవీంద్ర ఆరోపించారు.

ఏ ఒక్కరినీ వదిలిపెట్టం: సత్యకుమార్



గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో ఎంత మందికి లింకులు ఉన్నాయో సిట్ విచారణలో మొత్తం బయటకు వస్తాయని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో నాసిరకం మద్యం విక్రయాలు జరిపి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడి కోట్లు కొల్లగొట్టారని పేర్కొన్నారు. మద్యం స్కాంలో దోషులెవ్వరినీ వదిలిపెట్టేది లేదని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో పని చేసే వైద్యులు సమయానికి ఆస్పత్రిలో ఉండకపోతే వారికి మెమో జారీ చేస్తున్నామని చెప్పారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన వారికి ఎన్ఎంసీ గైడ్ లైన్స్, కోర్టు తీర్పుల ననుసరించి తగిన న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

రెంటపాళ్ల కేసులో అంబటికి నోటీసులు

సత్తెనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఆదివారం రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. సోమవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

అదే మందుకు కొత్త పేర్లు!

» ఒకే విధంగా పలికే నూతన బ్రాండ్లు సృష్టి

» ఒక్కో కేసుపై రూ.వెయ్యికి పైగా ధర పెంపు

» మద్యం స్కాం చార్జిషీటులో కీలక అంశాలు

నిబంధనలకు విరుద్ధంగా బ్రాండ్ల పేర్లు మార్చి దోపిడీ

మద్యంలో ముడుపులు రావాలి.. కంపెనీలను అడిగితే కొంతవరకే ఇస్తాయి.. అవి కూడా ఎంతకాలం ఇస్తాయో తెలియదు. అధికారం ఉన్నంతకాలం కమీషన్లు రావాలంటే ఏం చేయాలి?.. మద్యం కుంభకోణం సూత్రధారులకు మొదట్లో వచ్చిన అనుమానమిది. బాగా ఆలోచించి పరిష్కార మార్గం కనిపెట్టారు. అసలు కంపెనీలు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు. అవి తమ అక్రమాలకు సహకరిస్తే చాలు. అదెలాగంటే.. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసినందుకు కంపెనీలకు బిల్లులు చెల్లిస్తారు. ఉదాహరణకు.. ఒక కేసుకు కంపెనీకి రూ.500 చెల్లిస్తున్నారనుకుంటే దానిని రూ.వెయ్యి చేసేద్దాం.. మద్యం కంపెనీకి అదనంగా అందే రూ.500 మనం తీసుకుందాం.. ఇలా ప్రణాళిక రచించారు. అయితే దానికో అడ్డంకి ఏర్పడింది. నిబంధనల ప్రకారం రేటు అగ్రిమెంట్‌ను మధ్యలో మార్చలేరు. అందుకే ఒకే విధంగా పలికే బ్రాండ్లను తెరపైకి తెచ్చారు. ఆ కొత్త బ్రాండ్లకు ఎంత కావాలంటే అంత పెంచుకోవచ్చు. అలా కంపెనీలకు ధరలు పెంచేసి, ఆ పెంచిన మొత్తాన్ని ఇటు లాగేద్దామనే ప్రణాళికను అమలుచేశారు. మద్యం స్కాం చార్జిషీటులో సీఐడీ ఈ అంశాలను కీలకంగా ప్రస్తావించింది. తొలుత ఒకే విధంగా పలికే బ్రాండ్లను ఎలా ప్రవేశపెట్టారు.. అప్పటివరకూ వాటికి ఇస్తున్న రేటెంత.. పేరు మార్చి ఎంత పెంచారు.. తద్వారా ప్రభుత్వానికి జరిగిన నష్టమెంత.. అనే వివరాలను పొందుపరిచారు. ఆ బ్రాండ్లను ప్రవేశపెడితే నిర్దేశిత శ్లాబు ప్రకారమే ధరలు పెంచాలి. కానీ శ్లాబులు దాటి రేట్లు పెంచారు. ఉదాహరణకు.. బీ కేటగిరీ శ్లాబు రూ.575-రూ.700 వరకు ఉంది. ఆ శ్లాబు పరిధిలో ఉన్న ఒక బ్రాండ్ కేసు ధర రూ.696. అచ్చు ఆ పేరులాంటిదే కొత్త బ్రాండు తెచ్చి ధరను రూ.1,759కు పెంచారు. అంటే 152.72 శాతం పెంచారన్న మాట.అలాగే బృందావన్ మార్కెటింగ్ ఏజెన్సీస్‌కు చెందిన హేవార్డ్స్ క్లాసిక్ విస్కీని హేవార్డ్స్ ఫైన్ విస్కీగా పేరు మార్చి ధరను రూ. 696 నుంచి రూ.1,037(49శాతం)కి పెంచారు. వైసీపీ హయాంలో ఆ బ్రాండ్ 6,71,550 కేసులు సరఫరా చేసింది. తద్వారా ప్రభుత్వానికి రూ.22.9 కోట్ల నష్టం వాటిల్లింది. ఆ మొత్తం చేతులు మారింది.

- హనీ బీ గోల్డ్ బ్రాందీకి ప్రత్యామ్నాయంగా హనీ బీ బ్రాందీని సృష్టించారు. ధరను రూ.696 నుంచి రూ.1037కు పెంచారు. ఈ బ్రాండ్ 7,15,250 కేసులు సరఫరా చేయగా.. ప్రభుత్వానికి రూ.24.39 కోట్లు నష్టం వచ్చింది.
- బృందావన్ మార్కెటింగ్ కంపెనీకి చెందిన బ్యాగ్ పైపర్ ప్రీమియం విస్కీకి ప్రతిగా బ్యాగ్‌పైపర్ గోల్డ్ రిజర్వ్ విస్కీ పేరుతో కొత్త బ్రాండ్ తెచ్చారు. ధరను రూ.696 నుంచి రూ.1,759కి పెంచారు. ఒక్కో కేసుపైనే రూ.1,063 పెంచారు. దీంతో 92.25 కోట్లు అదనంగా కంపెనీకి వెళ్లాయి.
- బకార్డి ఇండియా కంపెనీకి చెందిన బకార్డి కార్టా బ్లాన్కా క్లాసిక్ సుపీరియర్ వైట్ రమ్‌కు.. ప్రత్యామ్నాయంగా బకార్డి కార్టా బ్లాంకా అల్ట్రా ప్లాటినం సుపీరియర్ వైట్ రమ్‌ను ప్రవేశపెట్టారు. ధరను రూ.1,879 నుంచి రూ.3,075కు పెంచారు. ఫలితంగా ప్రభుత్వానికి రూ.80.92 లక్షలు నష్టం.
- ఎంఎస్ బయోటెక్‌కు చెందిన మంజీరా బ్లూ సెలెక్ట్ విస్కీ ఉండగా మంజీరా బ్లూ ప్రీమియం డీలక్స్ విస్కీ పేరుతో కొత్త బ్రాండ్ తెచ్చారు. దాని ధరను రూ.620 నుంచి రూ.853 చేశారు. దీంతో రూ.18.79 కోట్ల నష్టం ఏర్పడింది.
- బీఆర్‌కే స్పిరిట్స్‌కు చెందిన ఓల్డ్ టైమర్ డీలక్స్ విస్కీ బ్రాండ్‌కు సారూప్యంగా ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ తీసుకొచ్చి ధరను రూ.696 నుంచి రూ.853 చేశారు. దీంతో రూ.98.9 కోట్లు కంపెనీకి అదనంగా వెళ్లాయి.

ఆటోమేటిక్ విధానం తొలగించి ఆర్డర్లు..

బేవరేజెస్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం కంపెనీలకు ఆర్డర్లు ఆటోమేటిక్‌గా వెళ్లాలి. ఇందుకోసం గత మూడు నెలల అమ్మకాలను సాఫ్ట్‌వేర్ పరిగణనలోకి తీసుకుంటుంది. ఆ అమ్మకాలపై గరిష్ఠంగా 150 శాతం వరకు ఆర్డర్లు ఇవ్వాలి. ఆ విధానంలో అయితే వైసీపీ బ్రాండ్లకు ఎక్కువ ఆర్డర్లు ఇవ్వలేరు. అందుకే ఆటోమేటిక్ విధానం తొలగించి.. మాన్యువల్ విధానం తీసుకొచ్చారు.

\- అమరావతి, ఆంధ్రజ్యోతి

బాబు హయాంలోనే స్కాం: సజ్జల

లిక్కర్ స్కాంలో ఎలాంటి ఆధారాలు లేకపోయినా అక్రమంగా అందరినీ అరెస్టు చేస్తున్నారని, అరెస్టయిన వారి ఉసురు చంద్రబాబుకు తగులుతుందని వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. చంద్రబాబు హయాంలోనే మద్యం కుంభకోణం జరిగిందని, ఏడాదికి రూ.1,300 కోట్ల ప్రివిలేజ్ ఫీజు రద్దు చేసి, 40 వేలకుపైగా బెల్టు షాపులు పెట్టారని, నాలుగైదు డిస్టలరీలకు భారీగా ఆర్డర్లు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఆ స్కాంలో అరెస్ట్ అయిన చంద్రబాబు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని చెప్పారు. విజయవాడలో కోర్టుల ప్రాంగణం వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. ఈసారి కూటమి ప్రభుత్వం బరితెగించి తప్పుడు కేసు సృష్టించిందన్నారు. మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇది చంద్రబాబు సృష్టించిన కట్టు కథ అని, న్యాయస్థానంలో నిలబడదని పేర్కొన్నారు.

మిథున్‌పై కక్ష సాధింపే!

\- మాజీ మంత్రి పెద్దిరెడ్డి

ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన తండ్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. "గతంలో విమానాశ్రమం మేనేజరును కొట్టారని తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేశారు. ఆ కేసు నిలబడలేదు. ప్రస్తుత మద్యం కేసు కూడా నిలబడదు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తాడు. వైసీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. చాలామంది నియంతలు దేశాన్ని వదలి పారిపోయారు. కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. వారి కంటే మీరు పెద్ద నియంతలేమీ కాదు. మీ పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వచ్చే ఎన్నికల్లో చూస్తాం." అని పెద్దిరెడ్డి అన్నారు.

జైలుకు మిథున్‌రెడ్డి



1వ తేదీ వరకు రిమాండ్
విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

విజయవాడ/తిరుపతి(జీవకోన), జూలై 20(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి. భాస్కరరావు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. శనివారం సిట్ విచారణకు వచ్చిన మిథున్‌రెడ్డిని అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్(సిట్) తరఫున ఇ. కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, మిథున్‌రెడ్డి తరఫున హైకోర్టు సీనియర్ న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. న్యాయాధికారి బెంచ్ మీదకు వచ్చిన వెంటనే మిథున్ రెడ్డిని కోర్టు హాలులోకి పిలిచారు. న్యాయాధికారి భాస్కరరావు తొలుత మిథున్‌రెడ్డిని పేరు అడిగారు. అనంతరం, నాగార్జున రెడ్డి వాదనలు వినిపించారు. "రిమాండ్‌పై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మిథున్‌రెడ్డి మూడు సార్లు ఎంపీగా గెలిచారు. ప్రోటెం స్పీకర్‌గా కూడా పనిచేశారు. ఆయనకు 'వై' కేటగిరి భద్రత ఉంది." అని చెప్పారు. దీనిపై న్యాయాధికారి.. మిథున్‌రెడ్డిని ప్రశ్నించగా.. తనకు ఎనిమిది మంది గన్‌మన్లతో కూడిన 'వై' కేటగిరి భద్రత ఉందని వివరించారు. మిథున్‌పై నమోదు చేసిన సెక్షన్లలో ఐపీసీ 409 వర్తించబోదని న్యాయవాది నాగార్జునరెడ్డి వాదించారు. వైద్య పరీక్షల నివేదికలో ఈసీజీకి సంబంధించి వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ఈ విషయంపైనా మరోసారి మిథున్‌రెడ్డిని న్యాయాధికారి ప్రశ్నించారు. ఈసీజీలో రెండుసార్లు హెచ్చుతగ్గులు వచ్చాయని మిథున్‌రెడ్డి తెలిపారు. తర్వాత ఎకో-2డీ పరీక్షలు చేశారన్నారు. దీనికి సంబంధించి ఇంతకుముందున్న సమస్యను మిథున్‌రెడ్డి వివరించారు. ఆ రిపోర్టులను న్యాయాధికారికి ఇచ్చారు. దీనిపై సిట్ తరఫున పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. ఇంతకుముందు వైద్య నివేదికలు ఎలా ఉన్నా ప్రభుత్వాసుపత్రి వైద్యుల నివేదిక మాత్రం రిమాండ్‌కు అనుకూలమేనని ఉందని వివరించారు. మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి నేరం చేసినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయన్నారు. ఆయన దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్లను హైకోర్టు, సుప్రీం కోర్టు కొట్టేశాయని వివరించారు.

నెల్లూరు జైలుకు పంపండి: మిథున్

ఎంపీ మిథున్‌రెడ్డిని జైలుకు పంపే విషయంపై న్యాయాధికారి భాస్కరరావు.. నేరుగా ఆయననే అభిప్రాయం కోరారు. తనకు గుంటూరు, నెల్లూరు జైళ్లలో ఏదైనా ఫర్వాలేదని మిథున్ సమాధానం ఇచ్చారు. సిట్ తరఫు న్యాయవాది పోసాని స్పందిస్తూ.. మిథున్ రెడ్డి ప్రజాప్రతినిధిగా ఉన్నారు కాబట్టి జైళ్ల శాఖ నిబంధనలు ఎలా ఉంటే అలా అధికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. మిథున్‌రెడ్డికి ఇంటి భోజనం అనుమతించాలని, ఐదు ములాఖత్‌లు ఇవ్వాలని, వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. వాటిపై పిటిషన్లు దాఖలు చేసుకోవాలని పోసాని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి భాస్కరరావు తీర్పును వెలువరించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. ఈ తీర్పును న్యాయాధికారి తన చాంబర్‌లో వెల్లడించారు. తీర్పు అనంతరం బయటకు వచ్చిన మిథున్‌రెడ్డి తర్వాత మళ్లీ చాంబర్‌లోకి వెళ్లారు. నెల్లూరు సెంట్రల్ జైలును కేటాయించాలని అభ్యర్థించారు. కానీ, న్యాయాధికారి అంగీకరించలేదు. ఇదిలావుంటే, సిట్ అధికారులు మిథున్ రెడ్డిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ఆయనకు క్యాజువాలిటీలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో-2డీ పరీక్షలు చేశారు. ఈసీజీ రెండుసార్లు నిర్వహించగా హెచ్చుతగ్గులు రావడంతో ఎకో-2డీ పరీక్ష చేసి ఎలాంటి సమస్యలు లేవని వైద్యులు నిర్ధారించారు.

కోర్టు ప్రాంగణంలో రెచ్చిపోయిన నేతలు

ఎంపీ మిథున్‌రెడ్డిని కోర్టులో హాజరుపరచడంతో ఆయనను పరామర్శించేందుకు వైసీపీ నేతలు భారీగా అక్కడకు చేరుకున్నారు. రిమాండ్ విధించిన తర్వాత మిథున్‌రెడ్డిని జైలుకు తరలించడానికి పోలీసులు ఆయనను బయటకు తీసుకురాగా వైసీపీ నేతలు నినాదాలతో రెచ్చిపోయారు. 'జై మిథున్‌రెడ్డి' అంటూ న్యాయస్థానాల ప్రాంగణం అనే స్పృహ కూడా లేకుండా హల్చల్ చేశారు. దీంతో కోర్టుకు వచ్చిన వారితోపాటు న్యాయవాదులు భయభ్రాంతులకు గురయ్యారు.

ఆ జైలు.. ఈ జైలు!

"రిమాండ్ విధిస్తే 'వై' కేటగిరి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆ తరహా సదుపాయాలు ఉన్న జైలుకు పంపాలి. రాజమహేంద్రవరం, నెల్లూరులో సెంట్రల్ జైళ్లు ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాలు విజయవాడకు సమాన దూరంలో ఉన్నాయి. రాజమహేంద్రవరం జైలు కంటే నెల్లూరు సెంట్రల్ జైల్లో సదుపాయాలు ఎక్కువ., ఆ జైలుకు పంపే విషయాన్ని పరిశీలించాలి."

\- మిథున్ రెడ్డి తరఫు న్యాయవాది మన్మథరావు

మిథున్ మూడు పిటిషన్లు

ఎంపీ మిథున్‌రెడ్డి తరఫున న్యాయవాదులు కోర్టులో మూడు పిటిషన్లు దాఖలు చేశారు. వారానికి 5 ములాఖత్‌లు ఇవ్వాలని, ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని, వైద్యం చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే, న్యాయాధికారి భాస్కరరావు వీటిపై విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

రింగ్ మాస్టర్

లిక్కర్ సిండికేట్‌ను నడిపించింది, దందాలో కర్త, కర్మ, క్రియ ఆయనే
రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"వైసీపీ హయాంలో జరిగిన మద్యం ముడుపుల దందాలో రాజంపేట ఎంపీ, వైసీపీ నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డే రింగ్‌మాస్టర్. మద్యం సిండికేట్‌కు ప్రాణంపోసింది మొదలు రూ.3,200 కోట్ల మేర సొమ్మును దోచుకునేందుకు జరిగిన వ్యూహాత్మక నేరపూరిత కుట్ర రూపకల్పన, దాని అమలుకు ఆయనే కర్త, కర్మ, క్రియ." అని ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కుండబద్దలు కొట్టింది. మద్యం ముడుపుల కుంభకోణం ఆలోచన ఇచ్చి, దాన్ని ఆచరణలోకి తీసుకొచ్చి, వేలకోట్ల సొమ్మును కొల్లకొట్టడంలో ఆది నుంచి అంతం వరకు, నాటి ముఖ్యమంత్రికి అవినీతి సొమ్ము చేరే దాకా ఈ ఎంపీనే ప్రధాన పాత్రధారి అని వెల్లడించింది. శనివారం రాత్రి ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనపై ఐపీసీ సెక్షన్లు 409, 420, 384, 201, 120(బీ), రెడ్‌విత్ సెక్షన్ 34, 37లతోపాటు, అవినీతి నిరోధక చట్టం(పీసీఏ) 1988లోని సెక్షన్ 7, 7ఏ, 8, 12, 12(1)(బీ), 13(2)ల కింద కేసులు నమోదు చేసింది. ఈ సందర్భంగా సిట్ సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలను ప్రస్తావించింది. నాటి ముఖ్యమంత్రి జగన్‌కు అవినీతి సొమ్ము చేరిందన్న అంశాన్ని ప్రస్తావిస్తూనే, మద్యం ముడుపుల దందాలో మిథున్‌రెడ్డి పాత్ర ఎలా మొదలైంది? ఆయన ఏం చేశారో సవివరంగా పేర్కొంది.

అలా మొదలైంది..

2014-19 మధ్య లిక్కర్ పాలసీ ఆటోమెటిక్ పంపిణీ విధానంలో కొనసాగింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం వ్యాపారం నుంచి నెలవారీగా ముడుపులు రాబట్టుకోవాలని మిథున్‌రెడ్డి ప్రణాళిక చేశారు. అయితే, ముడుపులకు ప్లాన్ చేయమని ఆయనకు ఎవరు చెప్పారు? ఆ తెరవెనక ఉన్న శక్తి ఎవరు? తేలాల్సి ఉందని సిట్ పేర్కొంది. విచారణ సందర్భంగా ఎంపీ తమకు సహకరించలేదని, కీలకమైన అంశాల్లో దాటవేత ధోరణిని కనబర్చారని రిపోర్టులో తెలిపింది. ఈ దందాలో ప్రమేయం ఉన్నవారిని కాపాడేందుకు, కొత్తగా మరెవరి పాత్ర వెలుగులోకి రాకుండా ఉండేందుకు మొత్తం అంశాన్ని తప్పుదోవపట్టించేలా మిథున్ వ్యవహరించారని సిట్ పేర్కొంది.

కుట్రకు రూపశిల్పి

2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం నుంచి రూ.వేల కోట్లను ముడుపుల రూపంలో పిండుకోవాలని ప్లాన్ వేశారు. ఈ ముడుపుల దందా ఎలా ఉండాలి? ఎలా అమలు చేయాలి? ఎవరెవరు భాగస్వాములవ్వాలి? డిస్టిలరీస్ ఏం చేయాలి? ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఎలా వాడుకోవాలి? అక్కడి అధికారులను గుప్పిట్లో పెట్టుకొని తమ పన్నాగాలను ఎలా అమలు చేయాలన్న అంశాలన్నీ మిథున్‌రెడ్డి ఆలోచన నుంచి వచ్చినవే. నిర్మాణాత్మక నేరపూరిత నిధుల దోపిడీ కుట్రకు మిథున్‌రెడ్డి తిరుపతిలోని తన ఇంటి నుంచే శ్రీకారం చుట్టారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సత్యప్రసాద్‌ను ఈ కుట్రకు పావుగా వాడుకోవాలనుకున్నారు. ముడుపుల దందాపై చర్చించేందుకు తిరుపతిలోని తన నివాసానికి 2019, అక్టోబరు 10న సత్యప్రసాద్‌ను పిలిపించుకుని, మద్యం సిండికేట్ కోసం పని చేయాలని ఆదేశించారు. ప్రతిఫలంగా ఆయనకు 2023 కోటాలో ఐఏఎస్ పదోన్నతి కల్పిస్తామని ఆశ చూపారు. దీంతో సత్యప్రసాద్ లొంగిపోయారు. 3 రోజుల తర్వాత(13-10-2019) రెండో మీటింగ్ హైదరాబాద్‌లో అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి నివాసంలో జరిగింది. ఈ సమావేశంలోనే మద్యం సిండికేట్ పనితీరు, డిస్టిలరీస్ నుంచి ముడుపులు ఎలా వసూలు చేయాలి? ఏయే బ్రాండ్లను ప్రోత్సహించాలి? డిస్టిలరీస్‌తోపాటు, మద్యం కంపెనీల నుంచి నెలవారీ ముడుపులు ఎలా వసూలు చేయాలి? అన్న అంశాలపై కీలక చర్చ జరిగింది. నెలకు రూ.50-60 కోట్ల మేరకు మద్యం ముడుపులు రాబట్టాలనిప్లాన్ చేశారు. మద్యం అమ్మకాల బేస్ ధరపై కనీసం 12 శాతం కమీషన్ వసూలు చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతిపాదించారు. తన ప్లాన్ పక్కాగా అమలు చేసేందుకు సత్యప్రసాద్, వాసుదేవరెడ్డిలకు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు. మద్యం అమ్మకాలకు సంబంధించి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆటోమేటిక్ విధానం తీసేయాలని, ఆ స్థానంలో మాన్యువల్ పంపిణీ విధానం తీసుకురావాలని సూచించారు.

ముడుపుల సొమ్ముతో..

డిస్టిలరీల నుంచి వసూలు చేసిన సొమ్ముతో బంగారం కొనుగోలు, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెట్టించారు. ఆఫ్రికా, దక్షణాసియా, అమెరికాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టించారు. ఇవే కాకుండా ఎస్పీవై ఆగ్రోస్, శాన్‌లాబ్, డీ-కార్ట్ లాజిస్టిక్స్ మధ్య రూ.కోట్ల లావాదేవీలు నడిపించారు. పేమెంట్స్ డిస్కౌంట్స్‌లో మానిప్యులేషన్ చేయడం ద్వారా బేవరేజెస్ కార్పొరేషన్‌కి రూ.200 కోట్ల నష్టం కలిగించడంలో ఎంపీ కీలక పాత్రధారుగా ఉన్నారు. కీలక నిందితులతో ఎంపీ మిథున్‌రెడ్డి వాట్సాప్ చాటింగ్ చేశారు. 2023, మే నుంచి 2024, మే వరకు ఏడాది కాలంలో కృష్ణ మోహన్‌రెడ్డి(55 సార్లు), చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(23 సార్లు), మోహిత్‌రెడ్డి(4 సార్లు), వాసుదేవరెడ్డి, ధనుంజయ్‌రెడ్డిలతో అనేక సార్లు ఫోన్‌లో మాట్లాడారు. రజత్‌భార్గవ, ఈ కేసులో సాక్షిగా ఉన్న బీవీఎస్ డిస్టిలరీస్ ఎండీ వెంకటసుబ్బారావుతో కూడా మిథున్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడినట్లు సిట్ పలు ఆధారాలను సమర్పించింది.

అడ్డంగా దొరికింది ఇక్కడే

మద్యం సిండికేట్‌లో కీలంగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి.. ఎస్పీవై ఆగ్రోస్, శాన్‌హాక్ లాబ్, డీ-కార్ట్ లాజిస్టిక్స్ మధ్య రూ.కోట్ల లావాదేవీలు నడిపించారు. చివరకు డీ-కార్ట్ లాజిస్టిక్స్ ఖాతా నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్టుకు రూ.5 కోట్ల నిధులు వెళ్లాయి. ఈ విషయంలోనే ఎంపీ అడ్డంగా దొరికిపోయారు. పీఎల్ఆర్ ప్రాజెక్టు అనేది ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ కంపెనీ. కాబట్టి, డీ-కార్ట్ లాజిస్టిక్స్ నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్టు కంపెనీకి నిధులు రావడం అనేది లిక్కర్ కుంభకోణంలో ఆయన పాత్రను స్పష్టం చేస్తోంది. అంతేకాదు, సిండికేట్‌లోని కంపెనీల నుంచి ఎంపీ కుటుంబ వ్యాపారాలకు రూ.కోట్ల నిధులు వెళ్లడం కూడా యాదృచ్ఛికం కాదు. ఎంపీ నేతృత్వంలోనే మనీలాండరింగ్ జరిగింది. ఆయా విషయాలపై పక్కా ఆధారాలను ఎంపీ ముందు ఉంచి ప్రశ్నిస్తే.. దాటవేసే ప్రయత్నం చేశారు. ఈ దందాలో ఇతరులను కాపాడేలా వ్యవహరించారు. విచారణకు సహకరించలేదు. ఈ కేసులో అన్ని అంశాలను వెల్లడించాల్సింది ఎంపీనే. ఎంపీ కుటుంబానికి పీఎల్ఆర్‌తోపాటు 'శివశక్తి డైరీ' కూడా ఉంది. ఇంకా అనేక లెక్కలు తేలాల్సి ఉంది. కాబట్టి ఆయన్ను కస్టడీకి ఇవ్వాలి.

పోలీసులు-లాయర్ల వాగ్వాదం

మిథున్‌రెడ్డిని ఏసీబీ కోర్టులో హాజరుపరచడంతో పోలీసులు న్యాయస్థానాల సముదాయానికి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన న్యాయవాదులు, మిథున్‌రెడ్డికి సంబంధించిన వ్యక్తులను, వైసీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలను మాత్రమే అనుమతించారు. బార్, కోర్టుకు వస్తున్న కొంతమంది న్యాయవాదులను కూడా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషా కారును అడ్డుకోవడంతో ఆయన అక్కడే వాహనాన్ని వదిలేసి కోర్టుకు వచ్చారు. వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదులు.. న్యాయాధికారి చాంబర్‌కు రాగానే వెళ్లి ఫిర్యాదు చేశారు.

ఇదీ లెక్క!

డిస్టిలరీలు, కంపెనీలతో ముడుపుల వ్యవహారాన్ని చర్చించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేకంగా మనుషులను నియమించారు. 2018-19లో 30 లక్షల కేసుల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లక్షల కేసుల బీరు అమ్ముడుపోయాయి. కాబట్టి, ఒక్కో కేసుపై రూ.150-600 మేరకు మద్యం ముడుపులు వసూలు చేయాలని ఎంపీ సూచించారు. ముడుపులు చెల్లించేందుకు అంగీకరించిన డిస్టిలరీల నుంచే సరుకు తీసుకుని, వాటినే ప్రభుత్వ రిటైల్ దుకాణాల్లో విక్రయించాలని ఎంపీ ఆదేశించారు. ఈ మేరకు డిస్టిలరీల నుంచి తీసుకునే ముడుపులను(బేస్ ధరపై) 12 నుంచి 20 శాతానికి పెంచారు. ఇలా వచ్చిన సొమ్ము రాజ్ కసిరెడ్డి, మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి తదితరుల ద్వారా నాటి సీఎం జగన్‌కు చేరింది. డిస్టిలరీల నుంచి డబ్బు వసూలు బాధ్యతను రాజ్ కసిరెడ్డి చూడగా, ఆ సొమ్మును నాటి సీఎంకి చేర్చడంలో మిథున్‌రెడ్డి పాత్ర ఉంది.

ముడుపులు మూలవిరాట్‌కే!!

ఎవరెవరి ద్వారానో మళ్లింపులు..

బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి డిస్టిలరీలకు నిధులు జమ కాగానే మద్యం డిస్టిలరీల నుంచి కమీషన్లు వసూలు చేసేందుకు పలు విధానాలు అవలంబించారు. వారి ఖాతాల నుంచి బులియన్ ట్రేడర్స్, బంగారం వ్యాపారులకు బదిలీ చేసి.. ఆ తర్వాత బంగారం కొనుగోలు జీఎస్టీల ఇన్‌వాయిస్‌తో ముడుపులను కసిరెడ్డికి, చాణక్యకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా తమ కమీషన్‌ను మినహాయించుకునే వారు. కొన్ని సందర్భాల్లో డిస్టిలరీలు, మద్యం సరఫరాదారులు కూడా బంగారం వ్యాపారులతో కుమ్మక్కై నిందితులకు బంగారం రూపంలో ముడుపులు అందించారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో.. డిస్టిలరీల బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలిస్తే బంగారం వ్యాపారులతో వాటి అనుమానాస్పద లావాదేవీలు రూ.100 నుంచి రూ.120 కోట్ల వరకు బయటపడ్డాయి.



(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించకపోతే ఒక్కరికి కూడా మద్యం సరఫరా ఆర్డర్ ఇవ్వబోమని భయపెట్టారు. అప్పట్లో ప్రతి నెలా 27-30 లక్షల మద్యం కేసులు, 7-10 లక్షల బీరు కేసులను విక్రయించారు. మొదట్లో సరఫరాదారులు ముడుపులు ఎంతెంత ఇవ్వాలో ఏ-1 రాజశేఖర్‌రెడ్డి, ఏ-8 సుమిత్, ఏ-2 ఎండీ వాసుదేవరెడ్డి, ఏ-6 సజ్జల శ్రీధర్‌రెడ్డి నిర్ణయించారు. రెండో దఫా వాసుదేవరెడ్డి విజయవాడకు చెందిన సరఫరాదారులు, డిస్టిలరీలతో ప్రకాశ్/సుమిత్ సహకారంతో హైదరాబాద్‌లో సమన్వయం చేసుకుని ముడుపుల వ్యవహారాలను చర్చించారు. ఈ బేరసారాల్లో బేసిక్ ధరను పరిగణనలోకి తీసుకున్నారు. సదరన్ బ్లూ, 9 హార్సెస్, ఆంధ్రా గోల్డ్, హెచ్‌డీ విస్కీ లాంటి చౌక బ్రాండ్‌లకు కేసుకు రూ.150గా నిర్ణయించారు. దారు హౌస్, రాయల్ ప్యాలెస్, బ్రిలియంట్ బ్లెండ్‌లకు కేసుకు రూ.200 ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. మ్యాన్షన్ హౌస్, రాయల్‌స్టాగ్ కేసుకు రూ.350, టీచర్స్, 100 పైపర్స్ లాంటి పెద్ద బ్రాండ్లకు కేసుకు రూ.600గా నిర్ణయించారు.

- 2019-24 మధ్య సేల్స్ డేటాను పరిశీలిస్తే మద్యం అక్రమార్కులు సుమారు రూ.3,500 కోట్ల వరకు కూడబెట్టుకున్నట్లు అర్థమవుతోంది.
- మద్యం ముడుపుల వసూలుకు పకడ్బందీ ప్రణాళికలు వేశారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) కార్యాలయం నుంచి అమ్మకాల వివరాలు రియల్‌టైం విధానంలో ఏ-1 టీంకు అందేలా ఏర్పాట్లు చేసుకున్నారు. విజయసాయిరెడ్డి సిఫారసుతో ఎంఐఎస్ సెక్షన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎ.అనూషను అప్పటి ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ భార్గవ ప్రత్యేక మెమో ద్వారా నియమించారు. ఆమె నేరుగా వాసుదేవరెడ్డికి రిపోర్ట్ చేయాలి. ఎంఐఎస్ సెక్షన్ నుంచి సేల్స్ డేటాను ప్రతి రోజూ సేకరించి దానిని కసిరెడ్డి టీంలోని సైఫ్ అనే వ్యక్తి మొబైల్ నంబర్ 9182192645కు పంపించారు. సరఫరాదారుల చెల్లింపుల వివరాలు, మద్యం, బీరు సరఫరదారుల వారీగా విక్రయించిన కేసుల వివరాలు అనూష ఈమెయిల్స్ ద్వారా వెల్లడయ్యాయి.
- సేల్స్ డేటా ఆధారంగా డిస్టిలరీ, సరఫరాదారులు చెల్లించాల్సిన ముడుపుల వివరాలను సైఫ్ టేబుల్స్ వేసి కసిరెడ్డికి పంపేవాడు. అవి సుమిత్‌కు, ఆ తర్వాత చాణక్య/ప్రకాశ్‌కు కూడా అందేవి. విక్రయించిన మద్యం డబ్బులు బేవరేజెస్ కార్పొరేషన్ నంచి డిస్టిలరీల ఖాతాల్లో పడగానే.. సుమిత్/ప్రకాశ్ వాటి యజమానులకు ఫోన్ చేసి ముడుపులు చెల్లించాలని డిమాండ్ చేసేవారు. వారి అనుచరులు ఏ-9 కిరణ్‌కుమార్‌రెడ్డి, కైఫ్, దిలీప్, సందీప్, ఖురేషీ, చెన్ని, మల్లేశ్.. నానక్‌రామగూడ, జూబ్లీహిల్స్ తదిత ప్రాంతాల్లో వీపీఎన్/ఇంటర్నేషనల్ ఫోన్ నంబర్లతో వాట్సాప్, సిగ్నల్ నెట్‌వర్క్ ద్వారా డిస్టిలరీలు, సరఫరాదారులను సంప్రదించేవారు. మద్యం ముడుపులు ఎక్కడ చెల్లించాలో నిర్దిష్ట ప్రాంతాలను ఎంపిక చేసుకుని.. అక్కడ వసూలు చేసిన సొమ్మును కసిరెడ్డికి చేర్చేవారు.
- వచ్చిన వసూళ్ల ఆధారంగా ఆర్డర్ ఆఫ్ సప్లయ్, ఇండెంట్ ప్లాన్ రూపొందించి దానిని సత్యప్రసాద్‌కు అప్పగించేవారు. ఈ ఇండెంట్ ఆధారంగా ఆర్డర్ ఫర్ సప్లయ్‌ను డిపో మేనేజర్లకు పంపించి పకడ్బందీగా అమలు చేయాలని సూచించేవారు. దాని కోసం సత్యప్రసాద్ డిపో మేనేజర్లతో వాట్సాప్ కాన్ఫరెన్స్ కాల్స్ నిర్వహించేవారు. ఇండెంట్ ప్రకారం చేస్తున్నారో లేదో పర్యవేక్షించేవారు. ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయడానికి వాసుదేవరెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి క్రమంగా తప్పకుండా సమావేశమయ్యేవారు.
- మద్యం ముడుపుల వసూళ్లను పర్యవేక్షించేందుకు తొలుత సుమిత్‌ను నియోగించారు. తర్వాత అతడి స్థానంలో చాణక్య/చాను/ప్రకాశ్‌ను రంగంలోకి దించారు. ప్రకాశ్, అతడి అనుచరులు డిస్టలరీలు, సరఫరాదారులతో మాట్లాడేందుకు వీపీఎన్/అంతర్జాతీయ ఫోన్ నంబర్లను వినియోగించారు. కార్పొరేషన్ నుంచి చెల్లింపులు జరిగిన రెండ్రోజుల్లోగా ముడుపులు చెల్లించాలని ఫోన్లు చేసేవారు. అలా ముడుపులిచ్చిన కంపెనీలకు మాత్రమే మద్యం ఆర్డర్లు ఉంటాయి. ఏపీలో విశాఖ, పీఎంకే, ఎస్‌పీవై, ఎంబీడీఎల్ డిస్టలరీల నుంచి యంత్రసామగ్రి, స్థలాలు సబ్‌లీజుకు తీసుకున్న ఆదాన్, లీలా కంపెనీలకు అధిక ఆర్డర్లు ఇచ్చారు. నిబంధనలను తుంగలో తొక్కారు. ఇందుకోసం మార్కెట్‌లో పాపులర్ బ్రాండ్లు విడుదల కాకుండా అడ్డుకున్నారు. తమ బ్రాండ్లు మూతపడడంతో పాపులర్ బ్రాండ్ల కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో విక్రయించుకోవాల్సి వచ్చింది. ఆదాన్ నుంచి సుప్రీం బ్లెండ్ విస్కీ, బ్రిలియంట్ బ్లెండ్ విస్కీ, దారూహౌస్ బ్రాందీ, తిలక్‌నగర్ డిస్టిలరీ నుంచి సరఫరా అయిన మ్యాన్షన్ హౌస్ బ్రాండ్ అమ్మకాలు విపరీతంగా ఉన్నాయి. గతంలో ప్రముఖమైన బ్రాండ్లు పెర్నాడ్ రికార్డ్(సీగ్రామ్స్), మెక్‌డోవెల్ తదితర బ్రాండ్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. పాపులర్ బ్రాండ్లు మార్కెట్‌లో అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు ఆందోళనలకు దిగారు. అయినప్పటికీ అధికారులు, ప్రభుత్వం, ఈ కేసులో నిందితులు, రాజకీయ నేతలు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మద్యం ముడుపులు ఇచ్చిన బ్రాండ్లకే పెద్దపీట వేసి.. వినియోగదారులకు నాసిరకం మద్యాన్ని విక్రయించారు.

షెల్ కంపెనీలకు..

ముడుపుల్లో ఇంకొన్ని నిధులను షెల్ కంపెనీలకు బదిలీ చేశారు. కొన్ని సార్లు లైనెన్ గార్మెంట్స్, గోల్డ్ కాయిన్స్ తదితర వస్తువులను ప్రమోట్ చేసే చట్టబద్ధమైన కంపెనీల ఖాతాల్లోనూ జమచేశారు. అయితే వాటి జీఎస్టీ వివరాలు, వాహనాల వే బిల్లులను పరిశీలిస్తే.. ఆయా కంపెనీల వాహనాలు సరుకుతో టోల్‌గేట్లు దాటినట్లు ఆధారాలే లేవు.

- లిక్కర్ సిండికేట్ సభ్యుల బంధుమిత్రులకు చెందిన కొన్ని రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపార సంస్థల ఖాతాల ద్వారా కూడా ముడుపులు మళ్లించారు. నిధులు ఎటు వెళ్లాయో తెలియకుండా.. దర్యాప్తు సంస్థలు పసిగట్టకుండా చేసేందుకే ఇలాంటి చెల్లింపుల ప్రక్రియ చేపట్టారు.
- ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌తో పాటు యూఏఈ (దుబాయ్) తదితర దేశాలకు చెందిన వ్యవస్థీకృత హవాలా నెట్‌వర్క్‌ల ద్వారా కూడా షెల్ కంపెనీలకు, నిందితులకు మద్యం ముడుపులు పంపించారు.

ఆర్డర్ల కోసం ముడుపులు

ఆర్డర్ ఆఫ్ సప్లయ్ కోసం కమీషన్లు ఇవ్వాలని ఒత్తిడి చేశారని పలువురు డిస్టలరీల యజమానులు దర్యాప్తులో తెలిపారు. ముడుపుల వ్యవహారాలకు సంబంధించి పలు వాట్సాప్ సంభాషణలు రకరకాల వ్యక్తుల మధ్య జరిగినట్లు గుర్తించారు. వారి ఫోన్లు సీజ్ చేశారు. మద్యం ముడుపులు వసూలు చేసిన పలు ప్రాంతాల ను గుర్తించారు. ముడుపులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ-38)కి, ఆయన అనుచరులకు కూడా అందాయి.

- మద్య నిషేధం విడతల వారీగా చేపడతామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. దశల వారీగా మద్యం వినియోగం తగ్గిస్తామని పేర్కొంది. పలు దఫాలు ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీచేశారు. 2019-24 మధ్య కాలంలో మొత్తం రూ.23,838 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్ల ద్వారా వెల్లడైంది.

పర్యవేక్షణ కోసం ఫీల్డ్ ఆఫీసర్లు..

2020లో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఏర్పాటు చేసినా.. ప్రభుత్వ మద్యం షాపులపై పర్యవేక్షణ బాధ్యతను దానికి అప్పగించలేదు. దాని బదులుగా ఫీల్డ్ మానిటరింగ్ ఆఫీసర్లు (ఎఫ్ఎంవోస్) అనే కొత్త వ్యవస్థను తెచ్చి ప్రత్యేక బ్రాండ్లను మాత్రమే షాపుల్లో అమ్మేందుకు కుట్ర పన్నారు. 2019లో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ కేపీఎంజీ అనే ప్రైవేట్ సలహాదారు సంస్థను నియమించారు. దాని నివేదికల్లో ఒకదానిలో చెప్పిన సూచనలు మరొకదానిలో ఉండకపోవడం, నిందితులకు అనుకూలమైన సూచనలే అమలు చేయడం వెనుక కుట్ర ఉంది. కేపీఎంజీ పాత్రపై ఇంకా దర్యాప్తు జరుగుతోంది.

తల్లి, కుమార్తె పేరుతో 100 కోట్ల ఆస్తులు..

రాజ్ కసిరెడ్డి హైదరాబాద్ శివారులో 92 ఎకరాలను తల్లి సుభాషిణి, కుమార్తె ఈశాన్వి పేరుతో కొనుగోలు చేశాడు. మాచనపల్లి, షాబాద్, దామరపల్లె ప్రాంతాల్లో ఉన్న ఈ భూముల మార్కెట్ విలువ రూ.100 కోట్లు కాగా.. రిజిస్ట్రేషన్ పత్రాల్లో రూ.30 లక్షలుగా చూపించాడు. గచ్చిబౌలిలో ఈశాన్వి పేరుతో రూ.9 కోట్ల వాణిజ్య స్థలం, కౌశిక్ కుమార్ అగర్వాల్ ఖాతాకు మళ్లించిన కోట్లాది రూపాయలను లిక్కర్ ముడుపుల సొమ్ముగానే సిట్ భావిస్తోంది. వైజాగ్‌లో కాల్ సెంటర్ ద్వారా కార్యకలాపాలు, ఇతరత్రా వివరాలు పరిశీలిస్తే మద్యం సొమ్మును ఆస్తుల పెంపునకు వినియోగించినట్లు తేలింది. పలు దేశాలకు తరచూ వెళ్లి వచ్చే కసిరెడ్డి దుబాయ్ కేంద్రంగా హవాలా నడిపించారని రుజువు చేసేందుకు సాక్షుల వాంగ్మూలాలను సిట్ చార్జిషీటుతో జతచేసింది.

▶ **గ**త ఐదేళ్లలో వందల కొద్దీ వెండర్లు, డిస్టలరీలతో జరిగిన లావాదేవీలు విచారణ చేయాలంటే ఎక్కువ సమయం తీసుకుంటుందని సిట్ వెల్లడించింది. 111 డిస్టలరీల్లో ప్రధానమైన 40 మేజర్ డిస్టలరీల లావాదేవీలను పరిశీలించామని.. 90 శాతం పైగా మద్యం ముడుపులు చేతులు మారినట్లు గుర్తించామని పేర్కొంది. ఇందులో 16 కీలకమైన డిస్టలరీలను పూర్తిగా విచారించింది. మద్యం ముడుపులు షెల్ కంపెనీలకు, గోల్డ్ మర్చంట్స్‌కు నిధుల బదిలీ, వసూళ్ల చేయడానికి సంబంధించిన డాక్యుమెంటరీ, డిజిటల్ ఆధారాలను కూడా చార్జిషీటుకు జతపరచింది.

ఫైళ్లు మాయం..

▶ **మ**ద్యం అవుట్‌లెట్లవారీగా చూపించే ఫోర్‌క్యాస్ట్ స్టేట్‌మెంట్ ఫైల్స్‌ను లిక్కర్ ముఠా మాయం చేసినట్లు జమ్ముల రవీంద్ర అనే వ్యక్తి మొబైల్ నుంచి ఎఫ్ఎస్ఎల్ నివేదికతో బయటపడినట్లు సిట్ పేర్కొంది. ఇక్కడి కంప్యూటర్లలో వివరాలు నిక్షిప్తమై ఉంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని నిందితులు ముందు జాగ్రత్త పడ్డారు. ఫైళ్ల మాయమైన విషయాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ కూడా తెలిపారు. అయితే విదేశాల్లో ఉండే పింగళి రాజీవ్ ప్రతాప్(ఏ-48) డేటా మొత్తాన్ని అక్కడి సిస్టమ్‌లో భద్రపరచినట్లు తేలింది. కసిరెడ్డి కోట్లాది రూపాయల అక్రమ సొమ్మును దేశం దాటించేసి.. యూఏఈ, జింబాబ్వే, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో టెక్కర్ పేరుతో పలు కంపెనీలు స్థాపించి ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి అప్పగించాడు. అతడు దుబాయ్‌లో గోల్డెన్ వీసా పొంది అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు.

ప్రజాధనం నష్టం.. ప్రజలకు విశ్వాస ద్రోహం..

▶ **2019-24** మధ్య జరిగిన రూ.3,500 కోట్ల మద్యం స్కాంతో ప్రజాధనానికి నష్టం వాటిల్లడంతో పాటు ప్రజలకు విశ్వాస ద్రోహం చేసిందని సిట్ అభిప్రాయపడింది. ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులు వారి నమ్మకాన్ని వమ్ము చేశారని, లిక్కర్ వ్యాపారులకు లాభాలు.. అధికారులకు ప్రయోజనాలు, ప్రజాప్రతినిధులకు ఓట్లు, వ్యవస్థను నడిపించిన మధ్యవర్తులకు లగ్జరీ జీవితం.. కింగ్ పిన్‌కు భవిష్యత్ పెట్టుబడులు.. ఇలా ఎవరికి వారు దోచుకున్నారని పేర్కొంది. ఇప్పటి వరకూ 48 మంది నిందితులు ఉన్నారని, వారిలో 12 మంది అరెస్టయి జైల్లో ఉంటే.. 8 మంది విదేశాల్లో దాక్కున్నారని.. ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించి.. తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సిట్ తెలిపింది. మున్ముందు మరికొందరి పాత్ర వెలుగులోకి రావచ్చని తెలిపింది.











పక్కా వ్యూహంతో స్కాం

డిస్టిలరీల నుంచి ముడుపులు.. బోగస్ కంపెనీలతో దారి మళ్లింపు

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణం పక్కా వ్యూహం ప్రకారం సాగింది. మద్యం కంపెనీల నుంచి ముడుపులు వసూలు చేయడం, బోగస్ కంపెనీలను సృష్టించి డబ్బు దారి మళ్లించడం, షెల్ కంపెనీల ద్వారా బ్లాక్‌మనీని వైట్‌గా మార్చడం.. వసూలు చేసిన మద్యం ముడుపులను వాటాలు పంచుకోవడం, నెలనెలా 'పెద్దల'కు చేర్చడం, ఎన్నికల ఖర్చు కోసం కొంత వైసీపీ అభ్యర్థులకు పంపిణీ చేయడం.. అంతా ఓ పథకం ప్రకారం జరిగింది. మద్యం స్కామ్‌లో ముడుపుల బాగోతాన్ని సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లో క్షుణ్నంగా వివరించింది. విశ్వసనీయం సమాచారం మేరకు...

ముడుపులు ఎలా వచ్చాయంటే...

- లిక్కర్ బ్రాండ్ బేసిక్ ధరపై బాక్స్‌కు రూ.150 నుంచి 600 వరకు కమీషన్ నిర్ణయించారు. ఇలా 3,500 కోట్ల రూపాయల ముడుపులు వసూలు చేశారు.
- బీఆర్‌కే స్పిరిట్స్ అనే లిక్కర్ సరఫరా సంస్థను 2013లో శైలేందర్ సింగ్ బగ్గా, మన్‌మీత్ సింగ్ బగ్గా ప్రారంభించారు. 2019 నుంచి 2024 మధ్యలో ఏపీఎస్‌బీసీఎల్‌కు రూ.902 కోట్ల విలువైన మద్యం సరఫరా చేసింది. అందులో రూ.148 కోట్లు కమీషన్ల రూపంలో మద్యం మాఫియాకు తిరిగి చెల్లించింది.
- జీఎస్‌బీ అండ్ కో ఎల్ఎల్‌పీ అనే సంస్థను 2016లో శైలేందర్ సింగ్ బగ్గా, గురుచరణ్ సింగ్ బగ్గా ప్రారంభించారు. వైసీపీ హయాంలో 269 కోట్ల రూపాయల మద్యం సరఫరా చేయగా, ముడుపుల రూపంలో 39 కోట్లు మాఫియాకు ముట్టజెప్పారు.
- విశాఖపట్నం జిల్లా కసింకోటలో ఉన్న బీ9 బేవరేజెస్ 2019-24 మధ్య బిరా91 పేరుతో భారీగా బీర్లు సరఫరా చేసింది. అందుకుగానూ 43 కోట్ల రూపాయల ముడుపులు చెల్లించింది. ప్యాకేజింగ్, రా మెటీరియల్స్, ప్రమోషన్ లాంటి సేవల కోసం షెల్ కంపెనీల ఖాతాల్లోకి మళ్లించారు. ఆ సొమ్మును కొన్ని రోజుల్లోనే విత్ డ్రా చేసి గుండం కృష్ణారెడ్డికి అందజేశారు. సిండికేట్ అనుమతితో కృష్ణారెడ్డి ఆ మొత్తాన్ని తాడేపల్లిలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో 302 ఫ్లాట్‌లో ఉన్న ప్రణయ్ ప్రకాశ్‌కు అందజేశాడు. ఈ విషయాన్ని ఇద్దరూ సిట్ విచారణలో అంగీకరించి వాంగ్మూలం ఇచ్చారు.
- ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఇన్న ట్రోపికల్ ఇన్ బేవ్ అనే ఫర్మ్ 2021-23 మధ్యలో రూ.89 కోట్ల విలువైన మద్యాన్ని సరఫరా చేసింది. అందుకుగానూ ముడుపుల రూపంలో 16 కోట్లు ఏడు ఇతర వ్యాపార బ్యాంకు ఖాతాల నుంచి చెల్లించింది. ఆ బ్లాక్ మనీ వైట్‌గా మారి రూ.14.65 కోట్లు లిక్కర్ మాఫియాకు చేరింది.
- కారియానో టెలీకామ్ కంపెనీ సహా 12 సంస్థల నుంచి రూ.127.03 కోట్లు అక్రమంగా వివిధ షెల్ కంపెనీల ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు సిట్ గుర్తించింది. అందులో ఓం సాయి మొబైల్స్, ఫెరారీ వీడియో, వైష్ణో టెలీకామ్, పసిఫిక్ ఎలక్ట్రానిక్స్, ఐకాన్ టెక్నాలజీ ఇండియా, సన్ అండ్ ఇండియా తదితర ఖాతాల్లోకి లావాదేవీలు జరిగాయి.

ముడుపుల్లో వాటాలు

- ముడుపుల వసూలులో కీలకంగా వ్యవహరించిన ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఎప్పటికప్పుడు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డిలకు అందజేశాడు. ఎవరెవరికి ఎంత శాతమో తీసుకోగా.. అక్కడి నుంచి అంతిమలబ్ధిదారు జగన్‌కు చేరాల్సిన వాటా చేరింది.
- రాజ్ కసిరెడ్డి కొంత సొమ్మును వ్యాపారాలు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టాడు. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్ పేరుతో సినిమా(స్పై) నిర్మించి పాతిక కోట్ల రూపాయలు నల్లధనం ఖర్చు చేశాడు. దుబాయ్‌లో విలాసంగా గడపడం నుంచి తన కంపెనీల్లో ఉద్యోగులకు జీతాలు సైతం చెల్లించాడు. లిక్కర్ సొమ్ముతో లగ్జరీ కార్లు, భూముల కొనుగోలు చేశాడు. ఈ కుంభకోణానికి సంబంధించి బ్యాంకు స్టేట్‌మెంట్లు, సాక్షుల వాంగ్మూలాలు, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌లు చార్జిషీట్‌తో పొందుపరిచినట్లు సిట్ పేర్కొంది.

ఎన్నికల ఖర్చుకు ముడుపులు

2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు లిక్కర్ ముడుపులు ఖర్చు పెట్టారు. అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని లాంసమ్ ఎటానియా, కృషి వ్యాలీ అపార్ట్‌మెంట్, తాడేపల్లిలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లలో బాక్సుల్లో సిద్ధంగా ప్యాక్ చేసి ఉంచిన 250 కోట్ల రూపాయలను వైసీపీ అభ్యర్థులకు అందజేశారు.

ఫోన్లు లాక్కుని దుబాయ్‌కు..

ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో లిక్కర్ మాఫియా ముందు జాగ్రత్త పడింది. ముడుపుల వ్యవహారాలు చూసిన పలువురి ఫోన్లు లాక్కొని దుబాయ్‌కి పంపించింది. జూబ్లీహిల్స్‌లోని రాజ్ కసిరెడ్డి ఆఫీసుకు వారిని పిలిపించి పైలా దిలీప్(ఏ-30) ఫోన్లు తీసుకుని, వాటి ధరకు రెట్టింపు నగదు చెల్లించాడు. ఆ తర్వాత బూనేటి చాణక్య సూచన మేరకు దుబాయ్ చేరుకుని, అక్కడి బిజినెస్ బేలోని దమాక్ అపార్ట్‌మెంట్‌లో వరుణ్ తదితరులు ఉన్నారు.

దోపిడీకి అధికారుల సహకారం

మద్యం ముఠా దోపిడీకి ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు పూర్తిగా సహకరించారు. ప్రతి నెలా తన వాటా కోసం కేంద్ర సర్వీసుల్లో ఉన్న వాసుదేవ రెడ్డి, ఐఏఎస్ హోదా ఇప్పిస్తారన్న ఆశతో సత్యప్రసాద్ తోడ్పాటు అందించారు. డిస్టిలరీ యజమానులు, మేనేజర్లతో పాటు ప్రొక్యూర్మెంట్ అధికారులను బ్లాక్ లిస్ట్ చేస్తామని బెదిరించి దారికి తెచ్చుకున్నారు.

త్వరలో మరో చార్జిషీట్

'ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిన ఈ కుంభకోణంలో 40 మంది పాత్ర ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చాం. కానీ పది కంపెనీలు, ఆరుగురు వ్యక్తుల పాత్రపై ప్రాథమిక అభియోగపత్రంలో వివరిస్తున్నాం. ఇతరుల పాత్రపై త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేస్తాం' అని కోర్టుకు సిట్ తెలిపింది.

ముడుపులిస్తేనే ఆర్డర్లు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం కుంభకోణంలో ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్ఎస్)లది కీలక పాత్ర. మద్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వానికి కంపెనీలు చేసుకొనే విన్నపం ఇది. ఆటోమేటిక్ ఆర్డర్లను తొలగించిన వైసీపీ ప్రభుత్వం మాన్యువల్ విధానం తీసుకొచ్చి కంపెనీలకు చుక్కలు చూపించింది. ఏ కంపెనీకి ఎన్ని ఆర్డర్లు ఇవ్వాలి? ఏ కంపెనీలను ప్రమోట్ చేయాలి? ఏ కంపెనీలను తొక్కేయాలి? అనే వ్యూహరచన అప్పట్లో ఎక్సైజ్ శాఖలో జరిగింది. ఎ-1 కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు కొన్ని కంపెనీలపై అమితమైన ప్రేమ చూపించారు. ఒక్క 2020లోనే 111 ఓఎఫ్ఎస్‌లు తిరస్కరించారు. ముడుపులు ఇవ్వడానికి అంగీకరించని కంపెనీల వినతులను ఏకపక్షంగా తిరస్కరించి, ఊరూ పేరు లేని కొత్త బ్రాండ్లకు వంద శాతం ఆర్డర్లకు అనుమతులు ఇచ్చేశారు. ఫలితంగా లిక్కర్ మార్కెట్‌లో జే-బ్రాండ్ల హవా కొనసాగింది. కొన్ని కంపెనీలను కమీషన్ల పరిధిలోకి తీసుకొచ్చిన ఆర్డర్లు పునరుద్ధరించారు. కొన్ని బ్రాండ్లను ప్రోత్సహించడం, కొన్నిటికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం వెనుక కుట్ర ఉన్నట్లు స్పష్టమవుతోందని చార్జ్‌షీట్‌లో సిట్ స్పష్టం చేసింది.

అనుమతుల్లో వివక్ష

- 2020లో ఆల్కో బ్రూ డిస్టిల్ ఇండియా కంపెనీ 68,450 కేసుల సరఫరాకు రిక్వెస్ట్ పెడితే 25,400 కేసులకే అనుమతించారు.
- కార్ల్స్‌బర్గ్ ఇండియా కంపెనీ 55,200 కేసులు సరఫరా చేస్తామని అడిగితే కేవలం 7,200 కేసులు మాత్రమే తీసుకున్నారు.
- పెర్నోడ్ రికార్డ్‌కు 100 శాతం, క్రౌన్ బీర్ ఇండియా కంపెనీకి 89శాతం, అన్‌హెసర్ బుష్ ఇన్‌బేవ్ ఇండియాకు 88శాతం శాతం ఆర్డర్లు తిరస్కరించారు.
- ఎస్ఎన్‌జే డిస్టిలరీస్, ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్, విశాఖ డిస్టిలరీస్, ఈగల్ డిస్టిలరీస్, ఇతర కొన్ని డిస్టిలరీలకు వంద శాతం ఆర్డర్లు అనుమతించారు.

డిస్టిలరీల పేరిట దందా!

- కేవలం మద్యం వ్యాపారం కోసమే రూ.60కోట్ల పెట్టుబడితో ఆదాన్ డిస్టిలరీస్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం, ఏపీఎస్‌బీసీఎల్, వైసీపీ నేతల సహకారంతో భారీగా ఓఎఫ్ఎస్‌లు దక్కించుకున్నారు. ఈ కంపెనీ పూర్తిగా కసిరెడ్డి, విజయసాయిరెడ్డి ఆదేశాలతో నడిచేది. 2020 మే నుంచి 2022 డిసెంబరు మధ్యకాలంలో రూ.732 కోట్ల వ్యాపారం చేసింది. ఇతర డిస్టలరీలను లీజుకు తీసుకుని సొంత బ్రాండ్లను తయారుచేసింది. ఒక్క ఆదాన్ నుంచి రూ.135 కోట్లు వరకూ ముడుపులు నిందితులకు అందినట్లు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. అదాన్ కేవలం డబ్బు సంపాదన కోసం ఏర్పాటైన క్రిమినల్ సంస్థగా సిట్ పేర్కొంది.
- పాండిచ్చేరికి చెందిన లీలా డిస్టిలరీని నిందితులు బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. వైసీపీ సర్కారు వచ్చిన మొదటి ఏడాదిలో ఆదాన్ సరఫరా చేసిన నాసిరకం మద్యం కారణంగా రాష్ట్రంలో పలు మరణాలు సంభవించాయి. ఆ తర్వాత ఆదాన్ నుంచి సరఫరా తగ్గించి లీలా డిస్టలరీ ద్వారా మద్యం సరఫరా చేయాలని నిర్ణయించారు. 2021 జూన్ నుంచి 2024 మార్చి మధ్యకాలంలో మూడేళ్లలో రూ.454 కోట్ల మేర లీలా డిస్టిలరీ ద్వారా వ్యాపారం చేశారు. ఈ సంస్థ నుంచి దాదాపు రూ.62 కోట్లు ముడుపులు చేతులు మారాయి.
- ఎస్పీవై సంస్థ ద్వారా రాష్ట్రంలో 2019-2024 మధ్యకాలంలో రూ.1,569 కోట్ల వ్యాపారం జరిగింది. లిక్కర్ సిండికేట్‌లో సజ్జల శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రధాన పాత్ర వహించింది. ఆదాన్, లీలా డిస్టలరీల తరహాలో షెల్ కంపెనీలకు నిధులు బదిలీ చేసింది.

వధూ'వరులు'!

» ఒకే యువతిని పెళ్లాడిన అన్నదమ్ములు!

» హిమాచల్‌లో ఓ తెగ సంప్రదాయం

న్యూఢిల్లీ, జూలై 20: ఇద్దరు అన్నదమ్ములు ఒకే యువతిని వివాహమాడారు...! అవును ఇది నిజమే.. అదేమిటి వారేమైనా చదువు సంధ్యలు లేనివారను కుంటున్నారా? కానే కాదు.. చదువుకుని ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా.. మరొకరు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. మరి ఎందుకిలా..? హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఓ తెగ సంప్రదాయం ఇది. ఆ రాష్ట్రంలోని సిర్మార్ జిల్లా షిలాయి గ్రామంలో ఈ వివాహం జరిగింది. ఇక్కడ హట్టి తెగకు చెందిన ప్రదీప్ నేగి, కపిల్ నేగి అనే ఇద్దరు అన్నదమ్ములు కున్హత్ గ్రామానికి చెందిన సునీత చౌహాన్ అనే యువతిని తమ తెగ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన వీరి వివాహ కార్యక్రమానికి వందలాది మంది హాజర య్యారు. ప్రదీప్ హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వ శాఖలో పనిచేస్తుండగా, అతడి తమ్ముడు కపిల్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ వివాహం తమ ఇష్టపూర్వ కంగానే చేసుకున్నామని ముగ్గురూ చెప్పడం విశేషం. వీరి వివాహానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రాచుర్యంలోకి వచ్చి చర్చకు దారితీసింది. ఇలా ఒకరు ఇద్దరిని వివాహం చేసుకో వడం భారత్‌లో చట్టవిరుద్ధం అయినా హిమాచల్‌ప్ర దేశ్‌లో సిర్మార్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఈ సంప్ర దాయం కొనసాగుతూనే ఉంది. అలాగే కిన్నూర్,



లాహాల్ స్పితి జిల్లాల్లో, పొరుగున ఉన్న ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొన్నిచోట్ల ఈ విధానం ఉంది. హట్టి తెగకు చెందినవారు ఇది తమ సంప్రదాయమని చెబుతు న్నారు. జోడిదారణ్ లేదా ద్రౌపది ప్రథగా ఈ సంప్ర దాయాన్ని వారు పిలుస్తారు. ఇటీవలే ఈ తెగవారికి గిరిజన తెగ(ఎస్టీ) హోదా కూడా వచ్చింది. కాగా, సెంట్రల్ హట్టి కమిటీ న్యాయ సలహాదారు అయిన రణ్‌సింగ్ చౌహాన్ అనే న్యాయవాది మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఈ సంప్రదాయం హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతోందని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు కూడా దీన్ని గుర్తించిందన్నారు.

అసెంబ్లీలో మహారాష్ట్ర మంత్రి ఆన్‌లైన్ పేకాట

పూణె, జూలై 20: ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే.. ఆ రాష్ట్ర మంత్రి మాత్రం తీరిగ్గా కూర్చొని ఫోన్‌లో గేమ్ ఆడుతూ కన్పిం చారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ఈ ఘటన జరిగింది. ఎన్సీపీ(అజిత్ పవార్)కి చెందిన వ్యవసాయ మంత్రి మాణిక్‌రావ్ కొకాటె.. రైతు సమస్యలపై అసెం బ్లీలో చర్చ జరుగుతున్న సమయంలో తన ఫోన్‌లో ఆన్‌లైన్ పేకాట ఆడుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రతిపక్ష ఎన్సీపీ(శరద్ పవార్) నేత రోహిత్ పవార్.. తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. "రాష్ట్రంలో రోజుకు సగ టున ఎనిమిది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్నో వ్యవసాయ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. బీజేపీని సంప్ర దించకుండా ఏమీ చేయలేనందున, మంత్రికి వేరే పని లేకపోవడంతో పేకాడటానికి సమయం దొరికినట్లు కనిపిస్తోంది" అని విమర్శించారు. ఈ ఘటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈ మంత్రి గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, ఆయన ప్రవర్తన ప్రజాస్వామ్యానికే అవమానకరమని శివసేన(యూబీటీ) వర్గం విమర్శించింది.

లోకం తీరు



మొబైల్ ఇంటర్నెట్ వేగంలో యూఏఈదే అగ్రస్థానం

» టాప్-10లో లేని జపాన్.. 26వ స్థానంలో భారత్

న్యూఢిల్లీ, జూలై 20: మొబైల్ ఇంటర్నెట్ వేగంలో యూఏఈ ప్రపం చంలోనే మొదటి స్థానంలో నిలిచింది. సగటున సెకనుకు 546.14 మెగా బిట్స్ (ఎంబీపీఎస్) వేగంతో ఇతర దేశాలను తలదన్ని అగ్రస్థానం సాధిం చింది. 'హోం బ్రాడ్‌బ్యాండ్' స్పీడ్‌లో సింగపూర్ 393.15 ఎంబీపీఎస్‌తో తొలి స్థానం చేజిక్కించుకుంది. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది జూన్ మధ్య కాలంలోని డాటా ఆధారంగా 'స్పీడ్ టెస్ట్' వెబ్‌సైట్ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇటీవల సెకనుకు 1.02 పెటాబిట్స్‌తో ప్రపం చంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసి వార్తలకె క్కిన జపాన్.. ఈ రెండు విభాగాల్లోనూ టాప్ టెన్ జాబితాలో కూడా లేక పోవడం గమనార్హం. అత్యాధునిక ఫైబర్ ఆప్టిక్ పరిజ్ఞానంతో తాము సాధించిన ఈ ఇంటర్నెట్ వేగానికి నెట్‌ఫ్లిక్స్ వీడియాలు అన్నింటినీ రెప్ప పాటులో డౌన్‌లోడ్ చేయగల సామర్థ్యం ఉందని జపాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్ మొబైల్ ఇంటర్నెట్ వేగంలో 133.51 ఎంబీపీఎ స్‌తో 26వ స్థానంలో, బ్రాడ్‌బ్యాండ్‌లో 59.51 ఎంబీపీఎస్‌తో 98వ స్థానంలో నిలిచింది.

టాప్-20లో మన వైద్య కళాశాల ఒక్కటీ లేదు!

» ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల జాబితాలో తెలుగు రాష్ట్రాల కాలేజీలకు దక్కని చోటు

» నేటి నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

న్యూఢిల్లీ, జూలై 20: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు అత్యుత్తమ వైద్య కళాశాలలను ఎంచుకుంటారు. నీట్‌లో సాధించిన మార్కుల ఆధా రంగా విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తాయి. దేశంలోని అత్యుత్తమ వైద్య కళాశాలలకు నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ ఎఫ్) ర్యాంకులు ఇస్తుంది. ఎన్ఐఆర్ఎఫ్-2024 ర్యాంకుల జాబితాలో టాప్-20లో తెలుగు రాష్ట్రాల్లోని ఒక్క వైద్య కళాశాల కూడా లేకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇచ్చిన ఈ ర్యాంకింగ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదే శ్‌ల్లోని ఏ మెడికల్ కాలేజీకీ చోటు దక్కలేదు. నీట్‌లో తెలుగు విద్యార్థులు సత్తా చాటుతుంటారు. కానీ, ఉత్తమ వైద్య కళాశాలల విషయంలో మాత్రం తెలుగు రాష్ట్రాలు వెనకబడిపోవడం శోచనీయం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో తొలి స్థానం ఢిల్లీ ఎయిమ్స్‌కు దక్కగా.. 20వ స్థానంలో చెన్నై లోని శ్రీరామచంద్ర కళాశాల నిలిచింది. టాప్ 20 వైద్య కళాశాలల్లో అత్యా ధికంగా తమిళనాడులోనే 6 ఉండడం విశేషం.

దేశంలోని టాప్-10 వైద్య కళాశాలలివే..

1. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్), ఢిల్లీ
2. పీజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(చండీగఢ్)
3. క్రిస్టియన్ మెడికల్ కాలేజీ (సీఎంసీ), వెల్లూరు, తమిళనాడు
4. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్స్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్), బెంగళూరు, కర్ణాటక
5. జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మెర్), పుదుచ్చేరి
6. సంజయ్ గాంధీ పీజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, యూపీ
7. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ), ఉత్తరప్రదేశ్
8. అమృత విశ్వ వైద్య పీఠం, కోయంబత్తూరు, తమిళనాడు
9. కస్తూర్బా మెడికల్ కాలేజీ (కేఎంసీ), మణిపాల్, కర్ణాటక
10. మద్రాస్ మెడికల్ కాలేజీ అండ్ గవర్నమెంట్ హాస్పిటల్, తమిళనాడు

టీడీపీ పోరాటయోధుడు శేషగిరి మృతి

» గుండెపోటుతో 'పాల్వాయిగేట్' నేత హఠాన్మరణం

» సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విచారం

» బాధిత కుటుంబానికి ఫోన్‌లో పరామర్శ

» పిన్నెల్లి అరాచకాన్ని ఎదురొడ్డిన ధైర్యశాలి శేషగిరి



పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుండగా అడ్డుకుంటున్న శేషగిరిరావు (ఫైల్)



నంబూరి శేషగిరిరావు (ఫైల్)

రెంటచింతల, మాచర్లటౌన్, అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయిగేట్ గ్రామానికి చెందిన టీడీపీ పోరాట యోధుడు నంబూరి శేషగిరిరావు(50) ఆదివారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటుతో మృతిచెందారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ రోజున అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయిగేట్ బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేయగా.. ఆయన్ను నంబూరి శేషగిరిరావు ఎదిరించి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. శేషగిరిరావు ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన మరణం విషయం తెలియగానే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చారు. మృతదేహానికి నివాళులర్పించారు. శేషగిరిరావుకి ఆదివారం సాయంత్రం గ్రామస్థులు, టీడీపీ నాయకులు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. అంత్యక్రియల కార్యక్రమం పూర్తయ్యే వరకు ఎమ్మెల్యే, టీడీపీ యువ నాయకుడు నిఖిల్ అక్కడే ఉన్నారు.

శేషగిరిరావు కుటుంబానికి సీఎం పరామర్శ

శేషగిరిరావు మృతిపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. శేషగిరి రావు పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, అలాంటి నేతను కోల్పోవడం బాధాకరమన్నారు. శేషగిరిరావు పిల్లల చదువు వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం.. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి గత ఎన్నికల్లో వీరోచిత పోరాటం చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్నికల రోజున వైసీపీ రౌడీల చేతిలో గాయపడినా.. మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్లిన శేషగిరిరావు ఒక పోరాట యోధుడు అంటూ అభివర్ణించారు. భౌతికంగా దూరమైనా, పార్టీకీ ఆయన చేసిన సేవలను శ్రేణులు గుర్తుంచుకుంటాయన్నారు. శేషగిరిరావు మృతిచెందారన్న వార్త తనను బాధించిందని మంత్రి లోకేశ్ తెలిపారు.

అభిశంసనకు సిద్ధం

» నోటీసుపై 100 మందికి పైగా ఎంపీల సంతకాలు

» రిజిజు అధ్యక్షతన అఖిలపక్ష భేటీ.. నేటి నుంచి పార్లమెంటు



అఖిలపక్ష భేటీకి వెళ్తున్న కేంద్ర మంత్రులు మేఘ్వాల్, నడ్డా,రిజిజు

న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన జస్టిస్ యశ్వంత్ వర్మను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన అభిశంసన తీర్మానాన్ని పార్లమెం టులో ప్రవేశపెట్టేందుకు అంతా సిద్ధమైంది. జస్టిస్ వర్మపై మహాభియోగ తీర్మానం ప్రవేశపెట్టే విషయంలో అన్ని పార్టీలు కలిసి నిర్ణయం తీసు కుంటాయని, కేవలం ప్రభుత్వమే నిర్ణయాన్ని వెల్లడించబోదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసుపై ఇప్పటికే 100 మందికి పైగా ఎంపీలు సంతకాలు చేశారని వెల్లడించారు. ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి 54 పార్టీలు హాజరుకాగా దాదాపు 40 మంది నాయ కులు తమ అభిప్రాయాలను వెల్లడించారని పేర్కొ న్నారు. ఈ తీర్మానాన్ని రాజ్య సభలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. సోమవారం నుంచి పార్ల మెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. దీనికి పార్లమెంటరీ వ్యవహా రాల మంత్రి కిరెణ్ రిజిజు అధ్యక్షత వహించారు. సభ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ప్రతిపక్షాలను అభ్యర్థించారు. ఆపరేషన్ సిందూర్ సహా అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కిరెణ్ రిజిజు మీడియాకు చెప్పారు. సైద్ధాంతిక విభేదాలను పక్కన పెట్టి ఉభయ సభలు సజావుగా జరిగేలా చూడటం అన్ని పార్టీల బాధ్యత అని అన్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే సంధి కుదిరేలా చేశానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనపై కూడా ప్రభుత్వం సభలో స్పందిస్తుందని తెలి పారు. ఆపరేషన్ సిందూర్‌పై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ద్వారా ప్రకటన చేసేందుకు సిద్ధమవు తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్య టనకు వెళ్లిన రోజుల్లో తప్ప ప్రధాని ఢిల్లీలో ఉంటే పార్లమెంట్ సమావేశానికి తప్పకుండా హాజరవు తారని వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయనకు సంబంధించిన ప్రశ్న ఉంటే మోదీ స్వయంగా సమాధానమిస్తారని తెలిపారు. రాజ్యస భలో బీజేపీ పక్ష నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ప్రభుత్వం తరఫున అఖిలపక్ష సమావే శంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ఎన్సీపీ నేతలు శరద్ పవార్, సుప్రియా సూలే, డీఎంకే నేత టీఆర్ బాలు, తెలు గుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు కృష్ణదేవరాయలు తదితరులు సమావేశానికి హాజ రయ్యారు. కాగా, సోమవారం నుంచి ఆగస్టు 21 వరకు జరిగే ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు పన్ను చట్టాల సవరణ బిల్లు, జన విశ్వాస్ సవ రణ, ఐఐటీ యాజమాన్య సవరణ, గనుల అభి వృద్ధి సవరణ, మణిపూర్ జీఎస్టీ సవరణ బిల్లు, జాతీయ క్రీడా పాలనా బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, భారత రేవుల బిల్లులను ప్రభుత్వం సిద్ధం చేసింది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజ నకు సంబంధించి కూడా ప్రభుత్వం చేపట్టబోయే చర్యలను ఈ సమావేశంలో ప్రకటించే అవకాశా లున్నాయి.

బిహార్ పరిణామాలపై విపక్షాల ఆందోళన

అఖిలపక్ష సమావేశంలో ప్రతిప క్షాలు అనేక అంశాలను లేవనెత్తాయి. ఎనిమిది ప్రధాన అంశాలపై వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసేం దుకు సిద్ధంగా ఉన్నామని విపక్షాలు ప్రకటించాయి. ముఖ్యంగా పహల్గామ్ ఘటన, మన దౌత్య విధానం విఫలం కావడం, ట్రంప్ ప్రకటనలు, బిహా ర్‌లో ఎన్నికల జాబితా సవరణపై ప్రధాని మోదీ స్వయంగా సభకు వివరించాలని బిహార్ ప్రతిప క్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పార్లమెంట్ సమావే శాలు జరుగుతున్న సమయంలో జూలై 23, 24 తేదీల్లో మోదీ మాల్దీవులు, బ్రిటన్ పర్యటనకు వెళ్ల డంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతు న్నాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరిట జరుగుతున్న తంతుపై అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు ఆందోళన వెలిబుచ్చాయి. దీనిపై ప్రత్యేక చర్చ కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, ఆ అంశం కోర్టు పరిశీలనలో ఉందని ప్రభుత్వం చెప్పినట్లు సమాచారం. బిహార్‌లో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై ప్రతిపక్షాలు సభను స్తంభింపచేసే అవకాశాలు న్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు పూర్తికాకముందే పైలట్లను నిందించేలా తాత్కాలిక నివేదికను బయటపెట్టడంపై ప్రతిప క్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పహల్గామ్ ఘటన, ఆపరేషన్ సిందూర్‌లో ట్రంప్ దౌత్యం, బిహార్‌లో ఓటర్ల జాబితాపై సభకు మోదీ సమా ధానం చెప్పాలని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్, సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిటాస్, సమాజ్‌వాదీ నేత రాంగోపాల్ యాదవ్, సీపీఐ నేత సందోశ్ కుమార్ డిమాండ్ చేశారు.

పిల్లల్తో వెళ్తూ ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే

రెట్టింపు జరిమానా!

న్యూఢిల్లీ, జూలై 20: చిన్న పిల్లలతో ప్రయాణం చేస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించే వారికి రెట్టింపు జరిమానా విధించాలని కేంద్రం భావి స్తోంది. ఈ మేరకు మోటారు వాహన చట్టంలో సవరణలను ప్రతిపాదించింది. స్కూల్ బస్సులు, విద్యార్థులను తీసుకెళ్లే ఆటోరిక్షాలు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల నిర్లక్ష్య డ్రైవింగ్‌ను వీడి.. బాధ్యతాయుతంగా మెలిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు.. డ్రైవర్ల ఉల్లంఘనలపై మెరిట్, డీమెరిట్ పాయింట్ల విధానాన్ని కూడా అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అంటే.. నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించే డ్రైవ ర్లకు పాజిటివ్(మెరిట్), ఉల్లంఘనులకు నెగటివ్(డీ మెరిట్) పాయింట్లు ఇస్తారు. డీమెరిట్ పాయింట్లు గరిష్ఠ స్థాయికి చేరితే.. సదరు డ్రైవర్ లైసెన్సును సస్పెండ్ లేదా రద్దు చేస్తారు. మెరిట్, డీమెరిట్ పాయింట్లను బీమా ప్రీమియంతో లింక్ చేయాలనే ప్రతిపాదన కూడా తాజా ముసాయిదాలో ఉంది.

ధర్మస్థలపై ఎట్టకేలకు 'సిట్'

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఎవరో చెప్పారన్న కారణంతో సిట్ ఏర్పాటు చేయలే మని రెండురోజుల క్రితం వ్యాఖ్యానించిన సీఎం సిద్దరామయ్య.. ధర్మస్థలిలో సామూహిక సమాధి, అదృశ్యాలు, మహిళల పై నేరాల ఆరోపణలపై దర్యా ప్తునకు తాజాగా సిట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి డీజీపీ (అంతర్గ భద్రతా విభాగం) ప్రణవ్ మహంతి నేతృత్వం వహించనుండగా.. ఇతర సీని యర్ పోలీసు అధికారులు అనుచేత్, జితేంద్రకు మార్, సౌమ్యలత సభ్యులుగా ఉంటారు. సిట్ ఏర్పా టుపై రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది.

బాలికను కట్టేసి.. పెట్రోల్ పోసి నిప్పు

» ఒడిశాలోని పూరీ జిల్లాలో ముగ్గురు దుండగుల చర్య

పూరీ, జూలై 20: ప్రొఫెసర్ లైంగిక వేధింపులను భరించలేక ఓ విద్యార్థిని ఆత్మాహుతికి పాల్పడిన ఘటన మరువక ముందే ఒడిశాలో మరో దారుణం జరిగింది. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు దుండగులు పెట్రోల్ పోసి, నిప్పంటించారు. పూరీ జిల్లాలోని బయబర్ గ్రామంలో శనివారం ఈ ఘటన జరి గింది. 70% కాలిన గాయాలతో సదరు బాలిక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. బాలికకు మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఆమెను భువనే శ్వర్ ఎయిమ్స్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్‌కు విమానంలో తరలించారు. శనివారం ఉదయం బాలిక తమ ఇంటి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బంధు వుల ఇంటికి వెళ్తుండగా ముగ్గురు దుండగులు ఆమెను అడ్డగించారు. కిడ్నాప్ చేసి భార్గవ నది ఒడ్డుకు తీసుకువెళ్లారు. అక్కడ ఆమెను కట్టేసి, ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో భయపడి పారిపో యారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఒడిసాలో సంచలనం సృష్టించింది. ఘటనపై ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ స్పందిస్తూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతు న్నాయన్నారు.

ట్రంప్ మెడకు లొలిటా ఎక్స్‌ప్రెస్ లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

తరలించి అక్కడ సెక్స్ పార్టీలు నిర్వహించేవాడు. పద్దెనిమిదేళ్లు కూడా లేని బాలికలను తరలించేం దుకు అతడు ఉపయోగించిన విమానం 'లొలిట ఎక్స్‌ప్రెస్'గా పేరొందింది (రష్యన్ రచయిత వ్లాది మిర్ నబకోవ్ రాసిన 'లొలిట' నవలలో ప్రధాన పాత్రధారి 12 ఏళ్ల బాలికపై కోరిక పెంచుకుంటాడు. ఆ నవల కథాంశం ఆధారంగానే ఎప్‌స్టీన్ విమానా నికి 'లొలిట ఎక్స్‌ప్రెస్' అనే పేరొచ్చింది). ఆ విమా నంలో వెళ్లినవారి వివరాల జాబితాలో.. డోనాల్డ్ ట్రంప్, బిల్ క్లింటన్, బ్రిటన్ రాజవంశానికి చెందిన ప్రిన్స్ ఆండ్రూ, హాలీవుడ్ నటుడు కెవిన్ స్పేసీ.. ఇలా ఎందరో ప్రముఖులున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తనపై కేసు నమోదు కావడంతో 2019 ఆగస్టులో.. ఎప్‌స్టీన్ జైల్లోనే ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. దానికి సంబంధించిన వీడియో ఫుటే జీని ఎఫ్‌బీఐ ఇటీవలే బయటపెట్టడం.. 'లొలిట ఎక్స్ ప్రెస్'ను పూర్తిగా ధ్వంసం చేయడానికి రంగం సిద్ధ మైన నేపథ్యంలో వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. ఎప్‌స్టీన్‌తో డోనాల్డ్ ట్రంప్ సంబంధాలపై పలు ప్రశ్నలు సంధించింది. 2003లో ఎప్‌స్టీన్ 50వ పుట్టినరోజు సందర్భంగా.. అతణ్ని పొగుడుతూ లేఖలు రాసినవారిలో ట్రంప్, బిల్ క్లింటన్ ఉన్నట్టు అందులో పేర్కొంది. దీంతో ఈ అంశం అమెరికాలో ఒక్కసారిగా వైరల్ అయ్యింది. అయితే.. ట్రంప్ మాత్రం ఆ లేఖ తాను రాయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదంతా ఫేక్ అంటూ.. వాల్‌స్ట్రీట్ జర్నల్‌పై పరువు నష్టం దావా కూడా వేశా రాయన. ఆ విమానంలో తాను ప్రయాణించిన మాట నిజమేగానీ.. ఎప్‌స్టీన్ సొంత దీవికి వెళ్లలేదని చెబుతున్నారు. ఎప్‌స్టీన్ చనిపోయినా.. ఈ వ్యవ హారం ఇంకా తనను వదిలిపెట్టకపోవడం ట్రంప్‌కు తలనొప్పిగా మారింది.

ఎవరీ ఎప్‌స్టీన్?

ఏం చేసుకోవాలో తెలియనంత డబ్బున్న వ్యక్తి.. జెఫ్రీ ఎప్‌స్టీన్. 1953లో జన్మించిన ఎప్‌స్టీన్.. డిగ్రీ పూర్తవక ముందే స్థానిక డాల్టన్ స్కూల్‌లో టీచర్‌గా చేరాడు. అక్కడ ముక్కుపచ్చలారని బాలికలతో సైతం అతడు అనుచితంగా ప్రవర్తించాడన్న ఆరోప ణలు వచ్చాయి. దీంతో.. 1976లో స్కూల్ యాజ మాన్యం అతడిని తొలగించింది. ఆ తర్వాత అతడు బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలోకి అడుగుపెట్టి రాణిం చాడు. వర్జిన్ ఐలండ్స్‌లో.. 'లిటిల్ సెయింట్ జేమ్స్ ఐలండ్'ను కొనుగోలు చేసి అక్కడ బాలికలతో సెక్స్ పార్టీలు నిర్వహించేవాడు. ఈ క్రమంలోనే.. 2006లో.. పద్నాలుగేళ్ల బాలిక తండ్రి ఒకరు అతడిపై పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో ఎప్‌స్టీన్ పాపం బద్ద లైంది. 2008లో కోర్టు అతణ్ని దోషిగా నిర్ధారించింది 13 నెలల ఖైదు విధించింది. అదే సమయంలో.. వర్క్ రిలీజ్ పేరిట జైల్లోంచి ఎడాపెడా యథేచ్ఛగా బయ టకు వచ్చే వీలు కల్పించింది. 2019లో పోలీసులు అతణ్ని మరోసారి అరెస్టు చేశారు. ఈసారి.. లొలిట ఎక్స్‌ప్రెస్‌లో బాలికలను ఫ్లోరిడా నుంచి న్యూయా ర్క్‌కు అక్రమంగా రవాణా చేశాడన్న ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. అభియోగాలను పటి ష్ఠంగా నమోదు చేయడంతో.. గతంలోలాగా తప్పిం చుకునే చాన్స్ లేదని గ్రహించి జైల్లోనే బలవంతంగా ఉసురు తీసుకున్నాడు. అనంతరం 2020 మార్చిలో అతడి విమానాన్ని ఫ్లోరిడాకు చెందిన వరల్డ్ ఏవియే షన్ సర్వీసెస్ కొనుగోలు చేసింది. అయితే.. ఎప్‌స్టీన్ దాన్ని ఎంత నీచమైన పనికి వాడాడో తెలిసిన తర్వాత దాన్ని ఆ సంస్థ నుంచి కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఇప్పుడు దాన్ని పూర్తిగా ధ్వంసం చేయడానికి సిద్ధమైనట్టు 'డెయిలీమెయిల్' వార్తా సంస్థ ఒక కథనంలో తెలిపింది.

భారత్ అమ్ములపొదిలో

కొత్త బ్రహ్మాస్త్రం.. కే-6 క్షిపణి!

న్యూఢిల్లీ, జూలై 20: దీర్ఘ శ్రేణి ఖండాంతర క్షిపణులపై దృష్టి సారించిన భారత్.. కే-6 పేరుతో ఒక క్షిపణిని అభి వృద్ధి చేస్తోంది. దాని రేంజ్ 8 వేల కిలోమీటర్లని చెబుతు న్నారు. వాస్తవానికి అది 12 వేల కిలోమీటర్ల దాకా ఉంటుం దని సమాచారం. ఇది సబ్‌మెరైన్ లాంచ్‌డ్ బాలిస్టిక్ న్యూక్లి యర్ మిస్సైల్ (ఎస్ఎల్‌బీఎం). అంటే.. జలాంతర్గాముల నుంచి ప్రయోగించగల ఖండాంతర క్షిపణి. చైనా నౌకా దళం హిందూ మహా సముద్రంలో పట్టు పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆ దేశం వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన జేఎల్-3 ఎస్ఎల్‌బీఎంకు దీటుగా కే-6 ఎస్ ఎల్‌బీఎంను మన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు హైదరాబాద్‌లోని 'అడ్వాన్స్‌డ్ నేవల్ సిస్టమ్స్ లేబొరేటరీ'లో అభివృద్ధి చేస్తు న్నారు. దేశ క్షిపణి కార్యక్రమ పితామహుడు, మాజీ రాష్ట్ర పతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గౌరవార్థం తయారుచే స్తున్న 'కె' శ్రేణి క్షిపణుల్లో ఈ కే-6 అత్యంత అధునాతనమై నది. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే వీలున్న ఈ క్షిప ణులు.. మన దేశ 'సెకండ్ స్ట్రైక్ క్యాపబిలిటీ' (ఏవరైనా మనపై అణ్వాయుధాన్ని ప్రయోగించినా.. సబ్‌మెరైన్ బేస్డ్ క్షిపణులతో వాటిపై అణు ప్రతిదాడులు చేసే శక్తి)కి అత్యంత కీలకం.

మూడంచెల క్షిపణి..

కే-6 ఎస్ఎల్‌బీఎం.. ఘన ఇంధనంతో పనిచేసే మూడం చెల క్షిపణి (ఇంధన వినియోగంలో నష్టాన్ని తగ్గించడానికి, క్షిపణి బరువు తగ్గించడానికి, ఎక్కువ దూరాలను అధిగ మించడానికి ఇలా మూడంచెల క్షిపణులను వాడతారు. మన వద్ద ఉన్న అగ్ని-4 రెండంచెల ఘన ఇంధన క్షిపణి). దాదాపు 39 అడుగుల పొడుగు, ఆరున్నర అడుగుల వెడ ల్పుతో ఉండే ఈ క్షిపణులు 2 నుంచి 3 టన్నుల దాకా పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. వీటి రేంజ్ చాలా ఎక్కువ కావ డంతో.. భారత జలాల్లోంచి ప్రయోగిస్తే చైనాలో మారు మూల ప్రాంతాలకు, యూరప్, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల దాకా వెళ్లగలవు. ఇవి శబ్దం కన్నా 7.5 రెట్ల వేగాన్ని అందుకోగల హైపర్ సానిక్ క్షిపణులు. వేగం.. గంటకు దాదాపు 9,200 కిలోమీటర్లు. అంత వేగంతో దూసుకొచ్చే ఈ క్షిపణులను గుర్తించి, అడ్డుకోవడం శత్రు దేశ రక్షణ వ్యవస్థలకు చాలా చాలా కష్టం. వీటికి ఎంఐఆ ర్‌వీ (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహి కల్స్) సామర్థ్యం ఉంటుంది. అంటే.. ఒకే క్షిపణి నుంచి ఒకటి కన్నా ఎక్కువ అణు వార్‌హెడ్లు బయటకు వచ్చి, వేర్వేరు లక్ష్యాలపై దాడి చేయగలవు. అణ్వాయుధాలనే కాదు.. దీని ద్వారా సంప్రదాయ పేలుడుపదార్థాలను కూడా ప్రయోగించవచ్చు. అయితే.. ఈ క్షిపణుల బరువును మోయగలిగే స్థాయి ప్రస్తుతం మన వద్ద ఉన్న జలాంతర్గా ములకు లేదు. మన వద్ద ఉన్న అరిహంత్, అరిఘాత్ దీన్ని మోయలేవు. ఈ శ్రేణిలో మూడో జలాంతర్గామి.. అరిదమన్ ఇంకా సీ ట్రయల్స్ దశలో ఉంది. ఇవి కాకుండా.. న్యూక్లి యర్ పవర్డ్ బాలిస్టిక్ మిస్సైల్ జలాంతర్గామి ఎస్4ను (నాలుగో సబ్‌మెరైన్) భారత నౌకాదళం 2024 అక్టోబరులో జలప్రవేశం చేయించింది. ఆ జలాంతర్గామి ద్వారా.. 3500 కిలోమీటర్ల రేంజ్ గల కలాం-4 (కే-4) మిస్సైల్‌ను ప్రయోగించవచ్చు (దాని తదుపరి తరమైన కె-5 శ్రేణి క్షిపణుల రేంజ్.. దాదాపు 5000 కిలోమీటర్లు). ఇప్పుడు తయారుచేస్తున్న కే-6 క్షిపణు లను మోసుకెళ్లే జలాంతర్గాములు లేకపోవడంతో.. ఎస్-5 శ్రేణి స్ట్రాటజిక్ సబ్‌మెరైన్లను కొచ్చిన్ షిప్‌యార్డ్‌కు సమీపంలోని తయారీ కేంద్రంలో నిర్మిస్తున్నారు. ఈ ఎస్-5 జలాంతర్గాముల బరువు 13 వేల టన్నులు (డిస్‌ప్లేస్‌మెంట్). ఒక్కో ఎస్-5 జలాంతర్గామీ 12 నుంచి 16 దాకా కే-6 క్షిపణు లను మోసుకెళ్లగలదు. శత్రువుల సోనార్ వ్యవస్థలకు చిక్కకుండా ఈ జలాంతర్గామిపై పూసేం దుకు 'మిశ్ర ధాతు నిగమ్' ఒక ప్రత్యేకమైన పదార్థాన్ని తయారు చేస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.